శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
హైదరాబాద్

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 8, ఆగస్టు 2026

వెల: రూ. 25/-







హరినామ క్షేత్రం శంకుస్థాపన



# శ్రీవేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 8


**సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)
గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం,
శ్రీనివాస మంగాపురం
డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| సుదర్శన చక్రత్తాళ్వార్ | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| మాతృభక్తి పరాయణుడు – వైనతేయుడు | 22 |
| శ్రావణ వరలక్ష్మీ వైభవం | 25 |
| మార్గదర్శకులు – మహర్షులు | 27 |
| నాగపంచమి | 31 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 36 |
| జయదేవుని 'గీత గోవిందము' (సీరియల్) | 40 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 46 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 51 |
| శ్రీవేంకటేశ్వర ప్రపత్తి | 56 |
| అష్టావక్ర మహర్షి | 60 |
| మీ ప్రశ్న మా సమాధానం | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


ఎడిటోరియల్

# అందివచ్చిన అదృష్టం

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు. ఈ సృష్టి, స్థితి, లయలకు కారకుడు. సృష్ట్యాది నుండి ఎన్నో అవతారాల నెత్తి మనలను రక్షిస్తున్నారు. ఈ యుగములో మన రక్షణార్థం వైకుంఠమును వీడి తిరుమల కొండపై వెలసిన దయామూర్తి. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారము. శరణార్థులను రక్షించే దయామయుడు. పిలిచిన పలికే దైవం. "వేంటేశుని వంటి దైవం ఈ సృష్టిలో లేడు, రాబోడు" అనే విషయమును పెద్దలు చెబుతారు. మన ఈ మానవజన్మకు కారణమైనవాడు. తరతరాలుగా మనకు తల్లి తండ్రి లాంటివాడు. ఇంతటి మాహాత్మ్యము కలిగిన పరమాత్మ కొన్ని వేల సంవత్సరాల పూర్వము తిరుమల కొండపై కొలువై ఉన్న విషయం విదితమే. ఈ స్వామివారికి కొన్ని వేల సంవత్సరాల క్రితం నుండి పుణ్యాత్ములైన రాజులు, మహారాజులు, భక్తులు వారి కైంకర్య నిమిత్తం కొందరు ఆలయ నిర్మాణంలో, మరికొందరు ధన, వస్తు, వాహన రూపంలో సేవలందించి తరించారు. నేడు ఆనాడు సేవలు చేసిన భక్తులు లేకపోవచ్చును. కాని వారు అందించిన సహాయం మాత్రం ఆలయ, వస్తు, వాహన రూపములో స్వామివారు స్వీకరిస్తూ నేటి తరముతో పాటు భవిష్యత్తు తరాల వారికి అందుబాటులో ఉన్నది. కాబట్టి ఆనాడు స్వామివారికి సేవలను అందించిన మానవులు ఎంతో ధన్యులు. కాని ఈనాడు నివసిస్తున్న మనము తిరుమల ఆలయ నిర్మాణములో కాని వారి వస్తు, వాహనాలలో కాని భాగస్వామ్యం పొందలేదు, కాబట్టి స్వామివారికి సేవ చేయాలనే భక్తుల ఆర్తిని తీర్చుటకు ఈనాడు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు చిన్నగుండవెల్లి (సిద్ధిపేట)లో మరో తిరుపతిగా స్థిరనివాస మేర్పరచుకోదలిచారు. తిరుమల ప్రతిరూప ఆలయమును (వెండి వాకిలి వరకు) నిర్మించి, అక్కడ అఖండ హరిభజన జరగాలనే వారి కోరికను వెల్లడించారు. ఈ ఆలయం పేరు 'హరినామక్షేత్రం' అని ఉండాలని కూడా సూచించారు. ఈ హరినామక్షేత్రం ప్రాశస్త్యాన్ని తెలుపుటకు మరియు భక్తులను ఈ ఆలయ నిర్మాణములో భాగస్వాములుగా చేర్చుటకు వారు 2000 సంవత్సరము నుండి ప్రసాదిస్తున్న వేలాది అనుభూతులను ఈ పత్రికలో "దిశా నిర్దేశం" అనే శీర్షికతో ఏప్రిల్ 2023 నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. మరియు వీటిని తెలుగు, ఇంగ్లీషు భాషలలో www.srivenkatesham.org అనే మా వెబ్ సైట్ లో భక్తులకు అందుబాటులో పెడుతున్నాం. ఈ క్షేత్రంలో స్వామివారు స్థిర నివాసం ఏర్పరచుకుందురని, భవిష్యత్తులో ఈ క్షేత్రం ఒక దివ్యదేశం వలె వెలుగొందగలదని స్వామివారు సూచించారు. తరతరాల భక్తులు స్వామి కృపను పొందగలరని కూడా సూచించారు. ఈ క్షేత్రం తిరుమల శ్రీవారికి ఎంతో ఇష్టమైనది కాబట్టి గత 26 సంవత్సరాల నుండి దీని ఏర్పాటుకై లీలలను ప్రసాదిస్తూ ఉన్నారు. భద్రాచలం, యాదగిరిగుట్ట క్షేత్రాల లాగా తగిన యోగ్యత సాధించిన తరువాతనే దీని శంకుస్థాపనకు తేది 02-07-2026 నాడు అనుమతించారు. ప్రస్తుతం ఈ ఆలయం పునాది పనులు జరుగుచున్నవి. కాబట్టి భక్తులందరూ యథాశక్తి తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ఎంతో ఇష్టమైన ఈ ఆలయ నిర్మాణములో పాలు పంచుకుని ధన్యులమవుదాము. ఇది తరతరాలు వేచి చూచినప్పటికీ లభించని అరుదైన అందివచ్చిన అవకాశం. కాబట్టి దీనిని ఎట్టి పరిస్థితిలోనూ జారవిడువకూడదని మనవి. శక్తి లేనివారు ఉడతాభక్తిగా యథాశక్తి సమర్పించుకోవచ్చును. కాని దీనిలో తప్పక భాగస్వాములు కాగలరని మనవి. మరో విషయం : మనకు లభించిన ఈ మానవ జన్మ క్షణభంగురం. మనం సంపాదించిన ఆస్తులు, నా అన్నవారు ఎవరూ మనతో రారు. కాబట్టి తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఎంతో ఇష్టంతో నిర్మించుకుంటున్న ఈ క్షేత్రంలో పాలు పంచుకుని ధన్యులమవుదాం! స్వామి వారి కృపను పొందుదాం! ఆసక్తి గల భక్తులు ఈ క్రింది అకౌంట్ లో జమ చేయగలరు.

**Bank : SBI, Habsiguda** **Name : Sri Venkateshwara Maha Mantrapeetham**
**IFSC Code : SBI N0016514** **Account No : 45388232753**

వివరాలకు ఈ పీఠమును సంప్రదించగలరు. ఓం నమో వేంకటేశాయ

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి. లేదా శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను లేదా

**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") ఉచితం




# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

శ్లో ॥ సద్యోవికాసి సముదిత్వర సాంద్రరాగ
సౌరభ్య నిర్భర సరోరుహ సామ్య వార్తామ్
సమ్యక్షు సాహసపదేషు విలేఖయంతౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే

తాత్పర్యం – శ్రీవేంకటేశ్వరా! మిక్కిలి ఎర్రనివై వికసించుచుండు నంతలోనే సువాసన నిండుగా కల్గియున్న పద్మములతో నీ శ్రీపాదములు పోలినవిగా వున్నవా? అని సందేహముతో పల్కినను, ఆ మాట కూడా మొరటుగా చేసిన ఒక కార్యముగా చెప్పదగినట్లున్న, మిక్కిలి ఎర్రగా ఉండి, సువాసనలను వెదజల్లుచు, వికసించిన నీ పాదములను శరణు పొందుచున్నాను (వేడుచున్నాను).

శ్లో ॥ రేఖామయధ్వజ సుధాకలశాతపత్ర
వజ్రాంకుశాంబురుహ కల్పక శంఖ చక్రైః
భవ్యై రలంకృత తలౌ పరతత్త్వ చిహ్నైః
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే

తాత్పర్యం – శ్రీవేంకటేశ్వరా! నీ అరికాళ్ళలో (పాదతలములలో) జెండా, అమృతకలశము, గొడుగు, వజ్రాయుధము, అంకుశము, పద్మము, కల్పవృక్షము, శంఖము, చక్రములు అనెడి పరతత్త్వమునకు (శ్రీమన్నారాయణునికి) ఉండదగిన శుభలక్షణములు కలవు. అట్టి నీ శ్రీ పాదములను శరణు వేడుచున్నాను.

# ముక్తిమార్గము



## శంకరాభరణం

ఛీఛీ నరుల దేఁటి – జీవనము
కాచుక శ్రీహరి నీవే – కరుణింతు గాక! ॥ పల్లవి ॥

1. అడవిలో మృగజాతి – యైనాఁ గావచ్చుఁగాక
వడి నితరులఁ గొలు – వఁగ వచ్చునా?
ఉడివోని పక్షియై – వుండనైన వచ్చుఁగాక
విడువకెవ్వరినైనా – వేఁడ వచ్చునా? ॥ఛీఛీ ॥

2. పసురమై వెదలేని – పాటు పడవచ్చుఁగాక
కసివో నొరులఁ బొగడఁ – గా వచ్చునా?
ఉసురుమానై పుట్టి – వుండనైన వచ్చుఁ గాక
విసువక వీరి వారి – వేసరించ వచ్చునా? ॥ ఛీఛీ ॥

3. ఎమ్మెలఁ బుణ్యాలు సేసి – యిల యేల వచ్చుఁగాక
కమ్మి హరిదాసుఁడు – గావచ్చునా?
నెమ్మది శ్రీవేంకటేశ – నీ చిత్తమే కాక
దొమ్ములు కర్మము లివి – తోయవచ్చునా? ॥ఛీఛీ॥





భావము – ఛీ ఛీ! మానవుల దెంత హీనమైన బ్రతుకు! శ్రీహరీ! నీవే మమ్ము కాచుకొని దయజూతువు గాక!

అడవిలో మృగమై పుట్టి జీవించినను జీవించవచ్చును గాని క్షుద్రమైన బ్రతుకు కొరకు ఇతర మానవులను సేవించుట తగదు. సర్వదా కాకివంటి పక్షిగా నైన బ్రదుకవచ్చును గాని ఇతరులను యాచించుట తగదు.

పశువై సుఖము లేని పాటైన పడవచ్చు గాని లేనిపోని మాటలతో పరులనెక్కువగా పొగడుట తగదు. ఒక చెట్టుగానైనా పుట్టి జీవించవచ్చును గాని తాను విసుగు జెందక అడ్డమైన వారినెల్ల విసిగించుట ఉచితము కాదు.

పెద్ద పెద్ద పుణ్యకార్యములు చేసి రాజై పుట్టి భూమిని పరిపాలించుటైనా సులభమే కాని హరికి దాసుడై తదనుగుణమైన ప్రవృత్తి కలిగి యుండుట సులభసాధ్యము కాదు. శ్రీవేంకటేశ్వరా! నీ చిత్తము చొప్పున నీవే మమ్ము కాపాడవలెను గాని గుంపులు గుంపులుగా పైబడుచున్న కర్మములను మాకు మేమై త్రోసివేసికొనజాలము.

**భావానువాదం:**
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**

# సుదర్శన చక్రత్తాళ్వార్

– డా|| కె.బి.రాజేంద్రప్రసాద్

**దనుజ విస్తార కర్తన దనుజ విద్యా వికర్తన – జని తమిస్రా వికర్తన భజద విద్యా నికర్తన**
**అమరదృష్ట స్వవిక్రమ సమరజుష్ట భ్రమిక్రమ – జయ జయ శ్రీ సుదర్శన! జయ జయ శ్రీ సుదర్శన!**

"అసుర గణాలను అంతమొందించువాడు, రాక్షస మాయా విద్యలను నాశమొందించువాడు, జన్మ జరా మృత్యు బాధలను తొలగించువాడు, భక్తుల అజ్ఞానాన్ని తొలగించి నిజమైన సుజ్ఞానాన్ని అందించేవాడు, అమరులు దర్శించిన నిజపరాక్రమం కలవాడు, యుద్ధంలో శత్రువులకు భ్రమలను కల్గించే వేగంతో తిరుగుతుండే సుదర్శన ప్రభూ! నీకు జయము కల్గు గాక! లోకాలకు శుభాలను కల్గించు గాక" అంటూ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను భక్తులు ప్రార్థించుతున్నారు.



సాక్షాత్తు చతుర్భుజుడైన శ్రీమన్నారాయణుని విశిష్టం, విఖ్యాతం అయిన చక్రాయుధమే సుదర్శన చక్రం. దివ్యమై భవ్యమై స్వామివారి సంకల్ప లక్ష్య సాధకమై, తిరిగి గమ్యాన్ని చేరుకొని సదా స్వామిని సేవించే విశ్వశ్రేయోదాయకమైన ఆయుధమూర్తి సుదర్శన చక్రత్తాళ్వార్. ఈ ఆళ్వార్ పదాన్ని చేర్చి, పూజించడం తమిళ వైష్ణవ భక్త శిఖామణులు చూపిన ఆధ్యాత్మిక బాట. దీనికి బలమైన కారణం కూడా ఉంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మ సంస్థాపనే ధ్యేయంగా స్వామి అవసరం, అవకాశాన్ని బట్టి అనేక అవతారాలను ధరించారు. ఆ సందర్భంలో స్వామి సంకల్పానికి బలంగా, ఫలంగా స్వామివారిని సదా సేవిస్తున్న వారి ఆయుధాలు, వస్తువులు కూడా వివిధ రూపాలలో భువికి వచ్చి, భక్తి ఆధ్యాత్మిక ద్వారాలను తెరచి, ధార్మిక జీవనం, ఆత్మ, పరమాత్మల తత్త్వజ్ఞానం, ముక్తి మార్గాలను చూపడం జరిగింది. అలా వచ్చినవారే ఆళ్వారులు. శ్రీవారి పాంచజన్యం (శంఖం), కౌమోదకి (గద), నందకం (ఖడ్గం), శార్ఙ్గం (ధనుస్సు), వనమాల, కౌస్తుభమణి, శ్రీవత్సం మొదలైన వాటితో పాటు భూమాత అంశగా గోదాదేవి, గరుత్మంతుని

అంశగా పెరియాళ్వార్ మొదలైనవారు. అన్నమయ్య కూడా నందకమనే శ్రీవారి ఖడ్గం అంశగా కూడా సెలవిస్తారు. అలాగే సుదర్శన చక్రం కూడా సృష్టిలో అత్యున్నతం, అత్యద్భుతం, అనిర్వచనీయమైన ఎదురు లేని, తిరుగులేని, లక్ష్య చ్ఛేదనం చేయగల శక్తి గల ఆయుధం. ఆ ఆయుధ శక్తికి ఒక ఆకృతిని అద్దగా వచ్చిన మూర్తియే సుదర్శన చక్రత్తాళ్వార్. స్వామి రాముడుగా ఉన్నప్పుడు భరతుడై సుదర్శనం కనిపించింది. కృష్ణావతారంలో సదా స్వామిని అనునయించి, శిశుపాలాది దుష్టసంహారాన్ని కావించింది. నారసింహునిగా స్వామి అవతరిస్తే స్వామి గోళ్ళుగా మారి హిరణ్యకశిపుని సంహరించింది. ఇలా విశ్వరక్షణ, జీవసంరక్షణ, భక్తపాలనాది కార్యక్రమాదులలో సుదర్శనమూర్తి తన శక్తిదీప్తితో స్వామి సంకల్పానికి సానుకూలంగా, సృష్టి సంరక్షణకు, ప్రకృతి పరిరక్షణకు, ధార్మిక సంస్కృతిని స్థాపించడానికి తన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చుతూ వచ్చింది.

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఏడుకొండల ఱేడు, శ్రీవేంకటాద్రి విభుడు, కలియుగ ప్రత్యక్ష దైవం. శ్రీవారు వేంచేసిన పుణ్యస్థలి కలియుగ వైకుంఠం వేంకటాద్రి. కలి పాదం మోపిన ఈ యుగంలో సకల జీవులను సంరక్షించడానికి స్వామి 108 దివ్య క్షేత్రాలలో కొలువై ఉన్నాడు. శ్రీరంగంలో శ్రీరంగనాథుడు, కంచిలో శ్రీ వరదరాజస్వామి, తిరుమలకొండపై శ్రీనివాసుడై, పాపాలను హరిస్తున్నాడు కనుక వేంకటేశ్వరుడనే అన్వర్థ నామంతో వెల్గొందుతున్నాడు. కోరిన కోర్కెలను తీర్చుతున్న స్వామి ఆపద మ్రొక్కుల వాడుగా మారినాడు. మరి ఈ సమయంలో దేవతలు, మునులు, స్వామివారి ఆయుధ సంపత్తి మొత్తంగా విభిన్న ఆధ్యాత్మిక విభూతులతో కొండపై వెల్గొందడం జరిగింది. ఆళ్వారులు భక్తశిఖామణులు. స్వామిని సేవించి, భజించి, పాశురాలతో స్వామిని కీర్తించి, తిరిగి స్వామివారిలోనే లీనమైనారు. కలియుగంలో శ్రీవారి నామకీర్తనలతో, నామ పారాయణలతోనే జీవులు భవబంధ విముక్తులవుతున్నారని ఆళ్వారులు తమ జీవిత గమనం గమ్యం ద్వారా నిరూపించారు.

అలాంటి తిరుమల స్వామికి చతుర్ముఖ బ్రహ్మ స్వయంగా భువికి వచ్చి, సేనాపతి విష్వక్సేనులవారు, ఆగమ పండితులు విఖనస ముని, మరియు ఇతర స్వామి సేవకులైన గరుడాళ్వార్, హనుమంతులవారు, ఆదిశేషుడు మొదలైన వాహనమూర్తుల సమన్వయంతో ప్రారంభించిన వేడుకలే బ్రహ్మోత్సవాలు. దివ్యనేత్రోత్సవాలు. సకలలోకవాసుల మహా మహిమోత్సవాలు. ఆశ్వయుజమాసం శుక్లపక్షం శ్రవణా నక్షత్రంలో ప్రారంభించే ఈ బ్రహ్మోత్సవాలను సాలకట్ల బ్రహ్మోత్సవాలంటారు. సాలీనా ఒక క్రమపద్ధతికి కట్టుపడి నిర్వహించే ఉత్సవాలు కనుక సాలకట్ల బ్రహ్మోత్సవాలు. బ్రహ్మగారు ప్రారంభించిన ఉత్సవాలు బ్రహ్మోత్సవాలు. అంకురార్పణ, ధ్వజారోహణంతో ప్రారంభమై చక్రస్నానం, ధ్వజావరోహణంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఈ మధ్యలో తొమ్మిది రోజులు శ్రీవారికి అనేక పూజలు, వేడుకలు, ఆరాధనలు, క్రతువులు, ఊరేగింపులు, వాహనసేవలు, భక్తుల భజనలు, కోలాటాలు, నృత్యాలు, పురాణ పఠన పారాయణాలు, నామసంకీర్తనలు, ద్రవిడ పాశురాల సేవ, పదకవితల నీరాజనాలు ఒక్కటేమిటి? భక్తి ఆధ్యాత్మికతా భావనా ప్రపంచం ప్రత్యేకంగా సృష్టింపబడుతుంది. ఈ వేడుకలలో ప్రతి కార్యక్రమం జీవులను తరింపచేసేవే. వీనిలో అతి ముఖ్యం గరుడసేవ కాగా చివరిది చక్రస్నానం. అదే శ్రీచక్రత్తాళ్వార్ స్నానం. స్వామివారి పుష్కరిణిలో మలయప్పస్వామి వారి ఉత్సవమూర్తులు, మరియు సుదర్శన చక్రత్తాళ్వార్ ల పవిత్ర స్నానఘట్టం నిర్వహిస్తారు. ముందుగా ఉత్సవమూర్తులకు, సుదర్శన చక్రానికి అభిషేకం చేసి, అనంతరం పుష్కరిణిలో పూర్తి స్నానం చేయిస్తారు. సుదర్శన చక్రానికి గల శక్తి తత్త్వం జలాలకు కల్గి, అనంతరం అందు స్నానం చేసే భక్తుల పాపాలు నశిస్తాయని విశ్వాసం. ఈ చక్రస్నానాన్నే ''అవభృథ స్నానం'' అని కూడా అంటారు. నిజానికి బ్రహ్మోత్సవాలు ఒక మహా క్రతువు. ఈ క్రతువు సంపూర్ణమైందని తెల్పుతూ చేసే స్నాన ప్రక్రియ ఇది. దీనికి ముందు ఉత్సవ మూర్తులకు చేసే అభిషేకాన్ని ''స్నపన తిరుమంజనం'' అంటారు.

అయితే ఈ సుదర్శన చక్రం పుట్టుక, చరిత్ర, చరితలను, మహిమలను గూర్చి ఒకింత తెల్సుకొనవలెను. అలాగే సుదర్శనమూర్తి ఆళ్వార్ గా ఎలా గౌరవం పొందుతున్నారని కూడా తెలుసుకోవలసి ఉంది.

నిజానికి ఆళ్వార్ అంటే రక్షకుడు అని అర్థం. నిండైన భక్తి, మెండైన జ్ఞానానురక్తి, అసమానమైన ఆధ్యాత్మిక విభూతి, అనిర్వచనీయమైన పరమాత్మ అనుభూతి, ప్రపత్తి, శరణాగతి నీతిని ఒంటబట్టించుకున్నవారు ఆళ్వారులు. వారి జీవితం పరమాత్మకే అంకితం. ఇహం తెలియదు. అహం ఉండదు. పరముడై పరమాత్మ ధ్యానమే తపంగా జీవిస్తారు. వారి భాష,. ఆశ, శ్వాస, ధ్యాస పూర్తిగా పరమాత్మ సేవే. ప్రపంచ హితమే. మన సుదర్శన చక్రమూర్తి కూడా సదా సర్వదా అచ్యుతుని సేవలోనే ఉంటాడు. విశ్వరక్షణకు, ప్రాణికోటి సంరక్షణకు, ధర్మసంస్థాపనకు వీలుగా మేలుగా సానుకూలంగా స్వామి సంకల్పాలను నెరవేర్చుతాడు. స్వామి తోడుగానే ఉంటాడు. మరి ఈ సుదర్శన చక్రం ఎలా పుట్టింది? అనే విషయంపై కథలు అనేకం.

విశ్వకర్మ కుమార్తె సంజ్ఞాదేవి. ఈమెను విశ్వకర్మ



ఆపకూడదని భావించి, తన నేత్ర కమలాన్నే తీసి మ్రొక్కు తీర్చుకోవాలని సంకల్పించి, సంసిద్ధుడైనాడు. ఆ తరుణంలో మహాదేవుడు ప్రత్యక్షమై శ్రీహరిని ఓదార్చి, అనునయించి, సుదర్శన చక్రాన్ని అనుగ్రహించాడట. నాటినుండి లోకహితం కొరకు శ్రీహరి ఈ సుదర్శన చక్రాన్ని వినియోగించడం జరుగుతోంది.

మొత్తానికి సుదర్శన చక్రం మహా మహిమాన్వితమైన శక్తి యుక్తమైన ఆయుధం. ఆ శక్తే సృష్టిని నడిపించే శక్తి. సృష్టిని కాపాడే శక్తి. సృష్టి జీవులకు శుభాలను అనుగ్రహించే శక్తి. ఈ సుదర్శన చక్ర శక్తికి, దివ్యము భవ్యము అయిన త్రిమూర్తుల శక్తులకు భేదం లేదు. అందుకే శ్రీహరి యొక్క అంశగానే సుదర్శనచక్రాన్ని,

సూర్యునికిచ్చి పెండ్లి చేశాడు. కాని సూర్యుని వేడిమి తట్టుకోలేని సంజ్ఞాదేవి భర్తకు సుదూరంగా ఉండసాగింది. అప్పుడు విశ్వకర్మ సూర్యుని సానపట్టి, వేడిమిని తగ్గించి, కుమార్తె కాపురాన్ని నిల్పాడు. అలా సూర్యుని సానపట్టినప్పుడు రాలిన పొడిని తీసుకుని విశ్వకర్మ సుదర్శన చక్రాన్ని తయారు చేసి విష్ణుమూర్తికి ఇచ్చాడు. ఈ సుదర్శన చక్రం వేయి సూర్యుల కాంతితో వెల్గొందుతుంది. శ్రీహరి సంకల్పించడమే తడవుగా శత్రువులను నిర్మూలించి, తిరిగి శ్రీహరిని చేరుకుంటుంది. దీనికి తిరుగులేదు. ఒకమారు స్వామి సంకల్పం ఆదేశంగా వస్తే చాలు లక్ష్య ఛ్చేదనం చేయడం సుదర్శనమూర్తి స్వభావం. సుదర్శనం అంటేనే శుభకరమైన, శ్రీకరమైన, హితకరమైన దర్శనం కలది. శుభశోభనాలు, లోక కళ్యాణ కారకాలకు మాత్రమే సుదర్శన చక్రం ఉపయోగించబడుతుంది. ప్రకృతికి, ప్రాణికోటి హితానికి ఆటంకం కల్గించే దుష్ట స్వభావులను త్రుంచడానికి కూడా చక్రాయుధం ప్రయోగించబడుతుంది.

సుదర్శనచక్రం పుట్టుకకు సంబంధించిన మరొక ఐతిహ్యం కూడా విన్పిస్తోంది. దేవదానవులకు నిరంతరం యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి. ఒకమారు శ్రీమహావిష్ణువు దానవులతో ఎంత పోరాడినా లక్ష్యాన్ని సాధించలేక నిర్వేదానికి, నిరుత్సాహానికి గురి అవుతాడు. వెంటనే వారణాసి వచ్చి, శుచిస్నాతుడై, 1000 పద్మాలతో విశ్వనాథుని ఆరాధించే విధంగా మ్రొక్కుకొని, పద్మాలను సిద్ధం చేసుకొని, అర్చనను ఆరంభిస్తాడు. సదాశివుడు కొంటెతనంగా, ఆ పద్మాలలో ఒక పద్మాన్ని మాయం చేస్తాడు. ఆరాధన చివరకు వచ్చింది. ఒక పద్మం తగ్గింది. శ్రీహరి ఆలోచనతో ఆరాధన

వైష్ణవ భక్తి సంప్రదాయంలో భావిస్తారు. సంభావిస్తారు. సంపూజిస్తారు. ఆ ఆయుధ మూర్తియే సుదర్శన చక్రత్తాళ్వార్.

శ్రావణమాసం – సప్తమీ తిథి – చిత్తా నక్షత్రం నాడు ''సుదర్శన తిరు నక్షత్రం'' అంటూ సుదర్శన జయంతిని నిర్వహిస్తారు భక్తులు.

సుదర్శన హోమం, సుదర్శన అభిషేకం, సుదర్శన మంత్రజపం సర్వపాపాలను హరించి, సకల శుభాలను అందిస్తాయని విజ్ఞుల హితవు. సుదర్శనాష్టకం, సుదర్శనస్తుతి కూడా కన్పిస్తోంది.

**గరుడపురాణంలో**

**నమః సుదర్శనాయైవ సహస్రాదిత్య వర్చసే ।**
**జ్వాలా మాలా ప్రదీప్తాయ సహస్రారాయ చక్షుషే ॥**
**సర్వదుష్ట వినాశాయ సర్వపాతక మర్దినే**
**సుచక్ర విచక్రాయ సర్వమంత్ర విభేదినే ॥**
**విష్ణురూపాయ శాంతాయ చ ఆయుధ నాం ధరాయ చ ।**
**విష్ణు శస్త్రాయ చక్రాయ నమో భూయో నమో నమః ॥**


అని స్తుతించడం జరిగింది. ''వేయి సూర్యుల కాంతితో ప్రకాశించే సుదర్శనాయుధం సాక్షాత్తు విష్ణురూపమే'' అంటూ సర్వ దుష్టులను, సకల పాపాలను అంతం చేసే దివ్యమైన శక్తి శ్రీ సుదర్శన చక్రం. రక్షణ, సంరక్షణ, శిక్ష, శిక్షణల సమర్థత, విచక్షణ కల్గిన చక్రత్తాళ్వార్ ను వైష్ణవ మహా దివ్యశక్తి స్వరూపంగా అందరం ప్రార్థించాలి. ఆరాధించాలి. శ్రీవారు, శ్రీవారి ఆయుధాలు, శ్రీవారి భక్తులు వేఱు కాదు. అందరూ, అందరకూ పూజనీయులే.

"నమో నారాయణాయ"



41వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు



### తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**– గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 41 వ భాగపు లీలల ప్రచురణ. (అక్టోబర్ 2022 – ఫిబ్రవరి 2023).

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన సంకల్పాన్ని ఎలాగైనా సాధించాలనే పట్టుదలను నాలో ద్విగుణీకృతం చేశాడు. ఇదే సమయంలో నాలోని బలహీనతను ఉపయోగించి మరింత కఠిన శిక్షణ ఇవ్వసాగాడు. మరియు నాకు కొన్ని బాధ్యతలను ఆపాదించుటతో పాటు యోగ్యతకు అవసరమైన మరికొన్ని వికారాలను తీసివేయసాగాడు. వాటిని చూద్దాం.

హైదరాబాద్ లోని దమ్మాయిగూడలో ఉన్న మా భూ సమస్యను ఉపయోగించి రకరకాల మలుపులు త్రిప్పుచు అత్యంత మానసిక ఒత్తిడికి గురి చేశాడు. ప్రక్కవాడు నా భూమిని 30 అడుగుల పైవరకు ఆక్రమించాడు. మండల సర్వేయర్ త్వరగా రావట్లేదు. ప్రక్క భూమి వారి అనుమతితో ప్రైవేట్ డిజిటల్ సర్వే చేసి సరైన విధంగా హద్దు రాళ్ళు పాతాము. అప్పుడు మా కొడుకు చి|| వేదాంత్ కూడా ఆ భూమి దగ్గరికి వచ్చాడు. దీనినంతటినీ మాకు తెలియకుండా ఫోటోలు తీశాడు. మరియు మేము వారి భూమిని ఆక్రమించామని చెప్పి నా పైన, సురేఖ పైన, వేదాంత్ పైన ఆ ఫోటోలు చూపుచు పోలీసు కంప్లైంట్ ఇచ్చాడు. పోలీసు వారు కూడా ఎలాంటి ఎంక్వైరీ చేయకనే మాపైన ఎఫ్.ఐ.ఆర్ బుక్ చేశారు. ఫలితంగా పోలీస్ స్టేషన్ చుట్టూ పలుమార్లు తిరగవలసి వచ్చింది. నేనే దొంగననే పరిస్థితి ఏర్పడ్డది. ముందే హృదయ సంబంధ సమస్యతో బాధపడుచున్నాను. దీనికి తోడు పోలీసు కేసు నన్ను తీవ్రమైన బాధకు గురి చేసింది. ప్రతిరోజు భూమి వద్దకు, పోలీసు స్టేషన్ వద్దకు పోయి రావడంతో అలసిపోయేవాడిని. పైగా స్వామి సంకల్పంలో ఈ తిరుగుడును విఘాతముగా

భావిస్తూ మరింత బాధపడ్డాను. ఈ బాధ, భయము బయటి వ్యక్తులకు కనిపించక పోవచ్చు కాని మానసికంగా నా హృదయం ద్రవించసాగింది. ఇది ఒక ప్రత్యేకమైన శిక్షణ, అనుభవించుటే తప్ప వివరించలేకపోతున్నాను. ఫలితంగా స్వామివారిని క్షణం వదలక స్మరించుట ఎన్నో రెట్లు పెరిగింది. రేపటి పరిస్థితి ఎలాగుండునో ఊహించలేకపోయాను. నా జీవితంలో ఇది అత్యంత బాధాకరమైన పరిస్థితి. మనస్సు స్థిమితాన్ని కోల్పోసాగింది. ఇక స్వామివారు కూడా నా ప్రార్థనలకు ఎలాంటి సడలింపు ఇవ్వలేదు. ఈ బాధ రోజు రోజుకూ పెరుగసాగింది. సాధనలో నూతన ఒరవడిని పరిచయం చేసినట్లనిపించింది. ఇలాంటి గడ్డుకాలము, బాధాకర సమయంలో స్వామివారు కొన్ని కర్తవ్యాలను కట్టబెడుతూ మరింత శిక్షణ ఇవ్వసాగారు.

## భక్తుల సంఘానికి నాయకుడిగా ఎన్నుకొనుట

నన్ను మా ఊరి భక్తుల సంఘానికి ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నాడు, మరియు వారికి స్వామి కృప కలిగించే బాధ్యత నీదేనంటూ ఈ క్రింది లీల ద్వారా తెలిపారు.


**తేది 19-10-2022 కల:** నేను చిన్నగుండవెల్లి గ్రామములోని భక్తుల బృందానికి ప్రెసిడెంట్ గా ఎన్నుకోబడ్డాను. ఊరికి సర్పంచ్ ను ఏవిధంగా ఎన్నుకుంటారో అదే విధంగా ఆ ఊరి భక్తులు వారి ప్రతినిధిగా నన్ను ఎన్నుకున్నారట. నేను ధోవతి కండువా ధరించి పూజ దుస్తులతో ఉన్నాను. ఇంతలో నాలో ఒక భావన కలిగింది. ''నేను ఈ ఊరి బాగోగులను, భక్తులందరికీ స్వామివారి ఆశీస్సులు లభించే విధంగా జాగ్రత్తగా చూచుకోవాలి. ఇప్పుడు ఒక బాధ్యత నాకు అప్పగించారు. కావున నా విధిని నేను సక్రమంగా నిర్వర్తించాలి'' అనే భావన కలిగింది. ఎలాగైతే ఒక సర్పంచ్, వారి ఊరి బాగోగులు చూచుకొనునో, ఆ విధంగా ఈ ఊరి భక్తబృందాల బాగోగులు చూచుకోవాలనే కర్తవ్యాన్ని దిశానిర్దేశం చేశారు. అంటే... ఆ ప్రాంతపు భక్తబృందాలకు స్వామికృప అందే విధంగా నేను మధ్యవర్తిత్వం చేయాలని దీని అర్థం.

ఈ కర్తవ్యాన్ని బాగుగా గుర్తుంచుకొనుటకు ఇంతటి క్లిష్టపరిస్థితిలో చెప్పారు. ఇక నేను మాత్రం ఒక ప్రక్క అనారోగ్యం, మరోప్రక్క భూ సమస్య, పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుట ఇలా క్లిష్టపరిస్థితిలో స్వామివారిని అత్యంత తీవ్రంగా, దీనంగా ప్రార్థిస్తున్నాను. స్వామివారి లీల ఏమిటో తెలియదు కాని భయముతో వణికిపోవుచున్నాను.

## అంచెలంచెలుగా యోగ్యతను ప్రసాదించుట

ఈ రోజు చాలా విచిత్రమైన కల కన్నాను. ఈ కల ఎంతో విలువైనది మరియు నాకు తెలియకుండా నాలో కలిగే పరిణామమును తెలిపేటటువంటిది. ఈ కల ఉదయం 4 గంటల 50 నిముషాలకు అలారం మ్రోగడంతో చెదిరిపోయింది. తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాకు తెలియకుండా రకరకాల లీలలను, ఆపదలను, భయాలను సృష్టించి భయపెట్టేవాడు. తద్వారా నా సంపూర్ణ మనస్సును భగవంతునిపై కేంద్రీకరిస్తూ, సాధన చేస్తూ గత 23 సంవత్సరాల నుండి అంచెలంచెలుగా ఎదిగే విధంగా చేయుటను ఈ కలలో చూపాడు. ఇది చిన్నదైనప్పటికీ ఎంతో విలువైనది.

**తేది 22-10-2022 కల :** ఒక పెద్ద స్టేజి పైన నాటకం జరుగుచున్నది. ఎంతోమంది జనాలు దానిని వీక్షిస్తున్నారనే భ్రమలో ఉన్నాను. నేను ఆ స్టేజి పైన ఆరడుగుల ఎత్తుతో ఉన్న శ్రీకృష్ణుణ్ణి చూచాను. శ్రీకృష్ణుని ముందర ఒక మూడు అడుగుల ఎత్తు ఉన్న ఒక బాలుడు నిలబడ్డాడు. వారు ఒకరికొకరు ఎదురెదురుగా నిలబడ్డారు. అప్పుడు శ్రీకృష్ణుడు తన పిల్లనగ్రోవిని తీసి ఆ పిల్లవాని తలనుండి క్రిందికి, అనగా పైనుండి క్రిందికి తడిమాడు. వెంటనే ఆ చిన్నపిల్లవాడు




ప్రతి సమస్యకు కొంత కొంత ఎదుగునట్లు చూపుట
(లీల 22-10-22)

కొంచెం పెరిగాడు. ఈ పెరుగుచున్న క్రమంలో ఆయన ఎవరో తన పేరేమిటో తెలుపుచున్నాడు. ఇలా శ్రీకృష్ణుడు తన పిల్లనగ్రోవితో పైనుండి క్రిందికి తడుముతున్నాడు. ప్రతి పర్యాయానికీ ఆ పిల్లవాడు కొంత కొంత పెరిగి ఆ స్థితిలో ఉన్న భక్తుని పేరు చెప్పుచున్నాడు. ఈ విధంగా చెప్పుచు చెప్పుచూ ఒక దశలో ''ఐ యామ్ అర్జున'' అన్నాడు. ఈ విధంగా శ్రీకృష్ణుడు తన పిల్లనగ్రోవితో పైనుండి క్రిందికి తడమడం, ఈ పిల్లవాడు పెరగడం జరుగుచున్నది. ఒకానొక దశలో ఆ పిల్లవాడు శ్రీకృష్ణుని అంత ఎత్తు పెరిగి చివరికి ''ఐ యామ్ కృష్ణా'' అన్నాడు.

అంటే... సాధన చేసి చేసి చివరికి శ్రీకృష్ణుడు ఆశించిన స్థాయికి ఎదగాలని దీని అర్థం. ఐ యామ్ కృష్ణా అన్నప్పుడు, నేను ఆ పిల్లవాని ముఖం, శ్రీకృష్ణ సీరియల్ లో అర్జునుని ముఖం లాగా అంతే ఎత్తు కలిగి అదే ముఖ వర్చస్సు ఉన్నట్లు కనబడ్డది. శ్రీకృష్ణుడు మాత్రం ప్రక్కభాగం (సైడ్ వ్యూ) లో కనబడ్డాడు. ఆ తరువాత ఆ పిల్లవాడు పొగ రూపంలోకి మారిపోయి మాయమయ్యాడు. కల చెదిరింది.

ఈ కల కన్నప్పుడు దాని అర్థమును గ్రహించలేదు కాని దాని నిజమైన అర్థం ఇలా ఉన్నది. గత 23 సంవత్సరాల నుండి నా జీవితంలో ఎదురైన ప్రతి సంఘటన ద్వారా కొంత కొంత మార్పు చెందుచు, స్వామివారు ఆశించే స్థితికి చేరుతున్నానని అర్థం. మరియు ఇది స్వామివారు ఆశించే స్థాయి వరకు చేరగలదని కూడా సూచించాడు. ప్రస్తుతం నేను అనుభవిస్తున్న ఈ భయానక స్థితి కూడా అందులో భాగమని సూచించాడు.

## సమస్యలు కొని తెచ్చుకొనుట

గత మూడు నాలుగు నెలల క్రితం ఈ సమస్యలను నేనే కోరుకున్నాను. రోజూ ఆఫీసులో ఏ పనీ లేకుండా కూర్చుంటే మనస్సుకు మేత లేక బోరు కొడుతోంది. అందుకని కొన్ని కష్టాలు కలిగించమని, అందులో స్వామివారిని ఆత్రుతతో ప్రార్థించే భాగ్యమును ప్రసాదించవలసిందిగా కోరుకున్నాను. అన్నటులనే గత రెండు నెలల నుండి ఆఫీస్ స్టాఫ్ కొరత, ఆఫీసులో ప్రక్కవారితో స్థల సమస్య, దమ్మాయిగూడ భూ సమస్య, నా హృదయ రోగ సమస్య, చివరికి భూ సమస్య ముదిరి పోలీసు కేసు కావడం, మరియు నా కుమారుని కుటుంబ సమస్య ఇలా దమ్ము తీసుకోలేని విధంగా ఒకదానిపై ఒకటి వచ్చి పడ్డాయి. చివరికి ఈ సమస్యలన్నింటినీ తీర్చమని, నేను సంపూర్ణంగా మీకు శరణాగతుణ్ణని, నాకున్న సర్వస్వం మీకు ధారపోస్తున్నానని ప్రార్థించాను. హరినామ క్షేత్రమునకు ఉపయోగించగా మిగిలింది మాత్రమే మేము వాడుకుందుమని ప్రమాణం చేశాను. ఈ సమస్యల వలన భయముచే వణికిపోతున్నాను. కాబట్టి వాటిని పూర్తిగా తొలగించమని, నా మనస్సును మీ సేవ యందు మాత్రమే వినియోగిస్తానని మరీ మరీ ప్రమాణం చేశాను. శ్వాస తీసుకొనుటకు వీలు లేనంత సమస్యల్లో ఇరుక్కున్నాను. మా కాలనీలో ఉన్న శ్రీ మహంకాళీ సమేత శ్రీ రామాలయంలోని శ్రీ ఆంజనేయుల వారికి మరియు శ్రీరాముడికి ప్రదక్షిణలు చేస్తూ వేడుకున్నాను. నేను స్వామివారి లీలలను గత 22 సంవత్సరాల నుండి చూస్తున్నాను. నేను ఆయన భక్తుణ్ణి, సేవకుణ్ణి, కాని వచ్చే ప్రతి సమస్యకు వణికిపోవుచున్నాను. సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుని కృప, ఆజ్ఞ లేనిది ఏదీ జరగదని, ఇదంతా ఆయన లీల అనే దృఢాభిప్రాయము ఉన్నప్పటికీ వణికిపోయాను. నా జీవితంలో ఇంతటి భయానక పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. స్వామివారి ప్రతి లీలకు కొంత కొంత పరిణతిని పొందాలని, మరియు చాలా రోజుల నుండి లీలలు చూడకుండుటచే మనస్సులో ఆయన పట్ల తపన, ఉత్సుకతను తిరిగి పొందుటకు ఇది ఉద్దేశించిందని అనుకుంటున్నప్పటికీ భయం మాత్రం తగ్గలేదు.

## మాధుర్యాన్ని అనుభవించుమనుట

తేది 26-10-2022 సాయంత్రం స్వామివారిని రకరకాలుగా ప్రార్థించాను. నేను మీ సేవకుడనని, భక్తుడనని నాకున్న ఆరోగ్య, భూ సమస్య మరియు పిల్లల సమస్యలను తీర్చమన్నాను. లేకున్నచో నేను మానసికంగా చాలా బాధపడుచున్నానని, ఏ విధంగానైనా రక్షించమని పదే పదే శరణు వేడాను. చివరికి నన్ను రక్షించి ఆనందాన్ని కలగజేస్తే ప్రతిగా మీకు మరో జన్మను అంకితం చేస్తానని ప్రతిజ్ఞ చేశాను. అంటే... ఇప్పటికే 14 జన్మలు మానవునిగా జన్మించి స్వామి సేవ చేసి ఋణం తీర్చుకోవాలి. ఇప్పుడు 15వ జన్మను కూడా దీనితో జత చేశానన్నమాట. ఈ రోజు స్వామివారు ఈ క్రింది లీల చూపారు.

**తేది 27-10-2022 లీల :** ఇది ఒక హృదయాంతర భావం, ఇలా ఉంది. ''రోజంతా భక్తుడు మాధుర్యాన్ని అనుభవిస్తున్నాడు'' అనే భావం కలిగింది. వెంటనే అలారం మ్రోగడంతో చెదిరిపోయింది. అంటే... ఈ విపత్కాల పరిస్థితులలో స్వామివారిని స్మరించి స్మరించి మాధుర్యాన్ని అనుభవించాలని ఫలితంగా నాలో కొంత ఆధ్యాత్మిక వృద్ధి, స్వామి పట్ల మరింత అంకితభావం, ప్రేమ ఏర్పడుట గురించి ఈ సంఘటన జరుగుతోందనిపించింది.

గత 22 సంవత్సరాల నుండి స్వామివారి లీలలను చూస్తున్నాను. జటిలమైన సమస్యలను ఎదుర్కొను సందర్భములో ఎన్నో కష్టాలను సహించాను. కాని ఇంతటి

తీవ్రమైన మనస్తాపము కలిగించే బాధలను అనుభవించలేదు. వీటిని భరించే సామర్థ్యము లేక నాకు తెలిసిన స్వామి భక్తులను, నా గురించి స్వామివారిని ప్రార్థించి సహాయపడమన్నాను. శ్రీమాన్ బాలాజీ గారిని ఈ విషయంలో సహాయపడమన్నాను. ఆయన ప్రశ్నలకు స్వామివారు జవాబు ఇస్తుంటారు. నా గురించి స్వామివారిని అడిగి నాతో ఇలా చెప్పారు. ''నేను ఆ సమస్యలకు వెరవక శాంతంగా ఉంటే సరిపోతుందని'' చెప్పారట. మరియు ఇంతవరకు జరిగిన 28 కళ్యాణాల పుణ్యమును స్వామివారికి సమర్పించుమని సలహా ఇచ్చారు. ఆ పుణ్యమును మనవద్ద పెట్టుకుంటే దుష్ట శక్తులు ఆశపడి ఇలాంటి పరిస్థితి కలిగించునన్నాడు.

**తేది 31-10-2022 :** వెంటనే ఆ రోజు స్వామి సన్నిధికి వచ్చి ఇలా ప్రార్థించాను. ''ప్రభూ! తప్పైంది క్షమించమని ప్రార్థించాను. మరియు ప్రభూ నేను రేపటివరకు జీవించుదునో లేదో తెలియదు కనుక ఇప్పుడే ఈ 28 కళ్యాణాల ఫలమును మీ పాదాలకు అర్పిస్తున్నాను స్వీకరించమంటూ ధారపోశాను. ఈ కళ్యాణాలే కాకుండా నేను చేసిన రకరకాల సేవల ఫలమును కూడా స్వామివారికి సమర్పించాను. ఇప్పుడు నేను శూన్యంగా ఉన్నట్లు అనుభూతి చెందాను. ప్రశాంతంగా ఉన్నాను.

## జీవితాన్ని పొడిగించుట

స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి మా శ్రీవేంకటేశం మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురించుదామనుకున్నాను. అదేవిధంగా వీటిని వాట్సాప్, మా వెబ్ సైట్ లాంటి వాటి ద్వారా ఆన్ లైన్ లో ప్రచారము చేయాలనుకున్నాను. వ్రాయుటకు వీలుగా అనుభూతులను ఒకప్రక్క చదువుచున్నాను. మరోప్రక్క సమస్యల వలయంలో ఇరుక్కున్నాను. నా ఆరోగ్య సమస్య, భూ సమస్య, పోలీస్ కేస్, మా వేదాంత్ కుటుంబ గొడవలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాము. శ్వాస తీసుకొనుట కష్టంగా ఉన్నది. హృద్రోగ సమస్యతో మర్నాటి ఉదయాన్ని చూడలేనన్న అనుమానం కలిగింది. వీటినుండి ఉపశమనం కోసం ఎన్నో రకాలుగా శరణాగతి చేశాను. ఆయన చెప్పినట్లు వింటానన్నాను, తప్పులను క్షమించమన్నాను. నేను వ్రాయబోయే స్వామివారి లీలలు ''మరణశయ్యపై ఉన్న వ్యక్తి నిజమే చెప్పును'' అన్న చందంగా వ్రాస్తామని నేను, నా భార్య అనుకున్నాము. కాని ఎలాంటి ఉపశమనం లేకపోయింది. హృదయం ద్రవించసాగింది, భయముచే వణికిపోతున్నాను. చివరికి స్వామివారిని దీనంగా ఒక వరం అడిగాను. ''స్వామివారు నాకు అప్పచెప్పిన సంకల్పమును నెరవేర్చిన తరువాత, అంటే హరినామక్షేత్రం ఏర్పాటు చేసి, కనీసం ఒక సంవత్సరం నడిపిన తరువాత మీ వద్దకు తీసికెళ్ళమని, అంతవరకు వద్దని'' వేడుకున్నాను. మిమ్ములను ఈ జన్మలో తనివితీరా దర్శించి, మీ పాదపూజ చేసి, మీతో రెండు మాటలు మాట్లాడిన తరువాత మాత్రమే నాకు మరణం ఉండునట్లు వరమీయమన్నాను. ఈ ప్రార్థనకు అనుగుణంగా స్వామివారు ఒక చక్కని కలను ఈ క్రింది విధంగా ప్రసాదించారు.

ఈనాడు స్వామివారు ఒకే కలను రెండు భాగాలుగా ప్రసాదించారు. అది తేది 02-11-2022 ఉదయం 4 గంటల నుండి కన్నాను, కాని ఇది అలారం మోగడంతో మధ్యలో చెదిరిపోయింది. మళ్ళీ పడుకున్నాను. ఇప్పుడు ఇదే కల పునరావృతమై రెండవ భాగం వచ్చింది. ఉదయం 5 గంటలకు తిరిగి లేచాను. అంతవరకు ఇది వస్తూనే ఉన్నది.

**తేది 02-11-2022 కల మొదటి భాగం :** అది మా ఊరిలోని పాత ఇల్లు. నేను దానిలోనే నివసిస్తున్నానట. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారు తన వ్యక్తిగత సహాయకునితో కలిసి మా ఇంటికి వచ్చారు. మా ఇంటిలో లోగిలి ప్రక్కన ఉన్న కట్టె తనాబ్ది ప్రక్కన చాప లాంటి ఒక ఆసనముపై విషాద వదనంతో మౌనంగా కూర్చున్నారు. ఆయన పరిచారకుడు నా కోసం వెతుకుచున్నారు. నేను ఆయనను చూచాను. ఆ పరిచారకుడు నాకు మంచి పరిచయస్థుడట. ఇంతలో నేను ఇంటిలో కూర్చున్న జీయర్ స్వామివారిని చూచి నమస్కరించాను. తరువాత మేము జీయర్ స్వామిముందు మాట్లాడలేక, బయటికి వెళ్ళి మాట్లాడుచున్నాము. ఏంటి విషయం? మా ఇంటికి ఇంత తీర్పాటము చేసుకుని ఎందుకు వచ్చారని అడిగాను. అప్పుడు ఆ పరిచారకుడు చెప్పుటకు ముందు సంకోచించి, తరువాత నా ''ఫేస్ బుక్ అకౌంట్'' (లాంటి దానిని) ఇవ్వమని అడిగాడు. అంటే... వారు నా అకౌంట్ ను తీసుకు వెళ్ళుటకు వచ్చారు. అది చాలా బాగున్నది, శ్రీవైష్ణవ సిద్ధాంతం ప్రకారంగా, ఎలాంటి వ్యాపార ధోరణులు లేకుండా, మొత్తం భాగవత తత్త్వంతో ఉన్నది. అది కావాలని అన్నాడు. నేను బాగా ఆలోచించి, ఒకింత బాధ కలిగిన హృదయంతో 'సారీ' నేను దానిని ఇవ్వలేనన్నాను. నేను స్వామివారి లీలలను ప్రచురించబోవుచున్నానని, దానితో పని ఉన్నదని, అది నాకు ఇప్పుడు ఎంతో ముఖ్యం అని అన్నాను. ఒకరకంగా స్వామి సంకల్పం నెరవేర్చుటకు ఇది నాకు అత్యంత అవసరమని చెప్పాను. ఇలా కావాలని వారు, ఇవ్వనని నేను చాలాసేపు వాదించుకున్నాము. ఇంతలో ఈయన స్వామివారి వద్దకు వెళ్ళి విషయం చెప్పారు. కాని స్వామివారు అలాగే కూర్చున్నారు. అక్కడినుండి కదలలేదు. ఎలాగైనా వారికి అది కావాలనే ఉద్దేశ్యంతో ఉన్నారనిపించింది. ఇంతలో అలారం




శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు నా అకౌంట్ కోసం మా ఇంటికి వచ్చుట (లీల 02-11-22)

మ్రోగడంతో కల చెదిరింది.

**కలలో రెండవ భాగం :** మళ్ళీ ఎందుకో పడుకున్నాను. ఇప్పుడు ఈ కల పునరావృతమైంది. ఇప్పుడు శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామివారు మా ఇంట్లో ముందు కూర్చున్న స్థలములో కాకుండా స్థలము మార్చారు. మెయిన్ డోర్ ప్రక్కన గల పిడకల గది ముందు చీకటిలో కూర్చున్నారు. నేను లోనున్న వంటగది నుండి వచ్చేసరికి ఆ విధంగా చీకటిలో ఆ అర ముందు కూర్చొనుటను చూచి లైట్ వేశాను. లైట్ ను చూచి స్వామివారు వెంటనే ఆ అర లోనికి వెళ్ళి కూర్చున్నారు. అంటే... ఆయన లైట్ లో కూర్చోరనిపించింది. వెంటనే లైట్ ఆఫ్ చేశాను. ఆయన బయటకు వచ్చారు, వారిద్దరూ ఏదో మాట్లాడుకున్నారు. చివరికి నేను ఆ పరిచారకునితో ఇలా అన్నాను. ఈ విధంగా నా ఫేస్ బుక్ అకౌంట్ ఎందుకు తీసుకుంటున్నారు, ఇలా ఇంకెవరిదైనా తీసుకున్నారా? అని అడిగాను. అందుకు ఆయన ''ఓ! చాలా మందిది తీసుకున్నామన్నారు''. ఇంతలో జీయర్ స్వామివారు అర నుండి బయటకు వచ్చి, ఎవరూ గుర్తుపట్టకుండా ప్యాంటు, టీషర్ట్ వేసుకున్నారు, వెళ్ళుటకు సిద్ధమైనారు. కల చెదిరింది.

ఈ విధంగా గంటల తరబడి స్వామివారు మా ఇంటిలో కూర్చున్నారు. కానీ నాతో ఏమీ మాట్లాడలేదు. ఎవరికీ తెలియకుండా మామూలు వస్త్రాలు ధరించి వెళ్ళిపోతున్నట్లు అనిపించింది. జీయర్ స్వామివారికి వెలుతురు పడలేదంటే ఆయన కాలుని రూపంలో, నన్ను పర లోకానికి తీసుకు వెళ్ళుటకు వచ్చాడని అర్థం.

ఈ కల కన్నప్పుడు దీని నిజమైన అర్థమును గ్రహించనందున వెంటనే మరుసటి రోజు మరో దానిని దాదాపు ఇదే అర్థం వచ్చేటట్లు ప్రసాదించారు. ఇప్పుడు సరిగా అర్థం చేయించారు.

ఈ కల కూడా నిన్నటి కలకు కొనసాగింపుగనే చెప్పాలి. మొత్తానికి ఈ రెండు కలలు నా జీవితాన్ని మార్చివేసి, స్వామివారి సంకల్పము నెరవేర్చుటకు ఉడుం పట్టులాగా పనిచేయించాయనుటలో సందేహం లేదు. నా జీవితం

ఇంతటితో అయిపోయింది. ఇప్పటినుండి ఒక క్రొత్త జీవితమును లేదా పొడిగింపు జీవితమును స్వామివారు ప్రసాదించారు. ఈ జీవితం మొత్తం స్వామివారి సంకల్పం నెరవేర్చుటకు మాత్రమే వినియోగించాలి తప్ప మరోదానికి కాకూడదని, అత్యంత జాగరూకుడనై ఏమరుపాటు లేకుండా విజయం సాధించి తీరాలనే దృఢ నిశ్చయం దీని ద్వారా లభించింది. ఈ కల ఈ రోజు ఉదయం 4.50 గంటలకు అలారం మ్రోగడంతో చెదిరిపోయింది.

**తేది 03-11-2022 కల:** నేను ఒక రైలులో ప్రయాణిస్తున్నాను. ఆ రైలు ప్రతి బోగీలోను జనాలు క్రిక్కిరిసి ఉన్నారు. వారి వారి స్టేషన్ రాగానే ఆయా స్టేషన్ లో దిగేవారు వాళ్ళంతట వారే బయటకు వచ్చి దిగిపోతున్నారు. లేదా ఒక దివ్య శక్తి వారిని బయటకు త్రోసివేస్తుంది. అలా ఒక స్టేషన్ లో నేను బయటకు త్రోయబడ్డాను. బయటికి వచ్చి చుట్టుప్రక్కల కలయ చూచాను. ఇది నేను దిగే స్టేషన్ కాదనిపించింది. నాకు దిగబుద్ధి కాలేదు. కాని మళ్ళీ లోపలకు వెళ్ళలేను. ఎందుకంటే జనాలు నిండుగా నా వరకు ఉన్నారు. ఒక్క అడుగు కూడా లోనికి వేయలేను. ఏమి చేయాలో తెలియక ఆ రైలు కిటికీకి ఉన్న రాడ్ ను పట్టుకుని వ్రేలాడుచూ రైలుతో వెళ్ళుచున్నాను. ఇంతలో నేను ప్రయాణించే రైలుకు ఎదురుగా, ఇదే పట్టాలపై నుండి ఒక తాటి చెట్టంత ఎత్తుతో అత్యంత నల్లగా ఉన్న బోగీ ఒకటి వచ్చింది. అందులో ఆ రైలు యజమాని వచ్చాడు. దీనిని చూచి నేను ప్రయాణిస్తున్న రైలు ఆగింది. ఆ రైల్ డ్రైవర్ మరియు యజమాని ఏదో మాట్లాడుకున్నారు. ఇంతలో ఎవరో నన్ను లోనికి రమ్మని ఆజ్ఞాపించి, చోటిచ్చారు. నన్ను లోనికి తీసుకెళ్ళి కూర్చోబెట్టి, రైలును తిరిగి ప్రారంభించారు. ఇలా నేను ఆ రైలులో ప్రయాణిస్తున్నాను. అలారం మ్రోగడంతో కల చెదిరింది.

ఒక్క మాటలో దీనర్థం చెప్పాలంటే... నా జీవితం ఇంతటితో ముగిసింది. నేను స్వామివారి సంకల్పం నెరవేర్చి, ఆయన్ను పొందిన తర్వాతనే నా జీవితమును ముగించమని ప్రార్థించినందుకు స్వామివారు నా జీవితానికి పొడిగింపును ప్రసాదించారని భావించాను. మరియు ఈ పొడిగింపు జీవితాన్ని స్వామివారి ఆశయం నెరవేర్చుటకు మాత్రమే




నా స్టేషన్ కాదని తెలిసి రైలుకు వ్రేలాడుచు వెళ్ళుట (లీల 03-11-22)

ఉపయోగించాలని, అన్యథా వాడవద్దని, వృథా చేయవద్దని, దృఢ నిర్ణయం తీసుకున్నాను. మరియు నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కోటి కోటి ప్రణామాలను అర్పించాను.

## ఆత్మ పరిశీలన - ప్రార్థన

**తేది 04-11-2022:** స్వామివారు నా జీవితమును పొడిగించారు. నేను ఈ పొడిగించిన జీవితమును స్వామి సంకల్పమును నెరవేర్చుటకు మాత్రమే వాడాలి తప్ప మరో సంతోషమును పొందుటకై గాని, ఇతరములైన ఏ పని చేయుటకైనా కాని వినియోగించను. అత్యంత భక్తి శ్రద్ధలతో, స్వామినే సర్వదా ధ్యానిస్తూ సంకల్పమును సాధించుట యందే దృష్టి నిలిపి జీవిస్తానని ప్రమాణం చేశాను. కాని నేను ఒక దూది పింజ వంటి వాడినని, పైగా కలియుగంలో నలుగురి మధ్య జీవిస్తున్నాను కావున తగు శక్తిని ప్రసాదిస్తూ, ఎప్పటికప్పుడు ప్రేరేపిస్తూ ఈ పనిని సాధించే విధంగా చేయవలసిందిగా నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థించాను.

## ధైర్యాన్ని ప్రసాదించుట

**తేది 05-11-2022:** ఈ మధ్యన మండల సర్వేయరు మా భూమిని సర్వే చేసి కొన్ని కారణాల వలన మళ్ళీ తేది 09-11-2022 నాడు చేస్తానని నోటీసు ఇచ్చాడు. కాని గొడవ ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. నా వ్యతిరేకి అయిన మా ప్రక్క భూమాయన ఈ సర్వే చేయకూడదని, పోలీసువారిని, కలెక్టర్ ను, తహసిల్దారును, మమ్ములను పార్టీ చేసి హైకోర్టులో రిట్ ఫైల్ చేశాడు. ఈ కేసు తేది 08-11-2022న ఉన్నది. దీనికి నేను మరింత భయపడ్డాను. సర్వే జరుగుతుందా? లేదా...? సమస్య మరింత జటిలమవుతుందన్న బాధతో నిన్న సాయంత్రం మా ఆఫీసులో 6.45 గంటలకు స్వామివారిని దీనంగా ప్రార్థించాను. భయంతో ధైర్యాన్ని కోల్పోయాను. కనీసం ధైర్యాన్నన్నా ఇవ్వమని స్వామివారిని ప్రార్థించాను. ఈ ప్రార్థన చివరి దశలో ఉన్నప్పుడు, నాకు ఎదురుగా ఉన్న స్వామివారి ఫొటో నుండి ఒక శక్తి నా హృదయంలో ప్రవేశించినట్లు అనుభూతి చెందాను. వెంటనే ధైర్యం వచ్చింది. ఇంతకుముందున్న భయము తొలగిపోయింది. ధైర్యంగా ఉండాలి అనే సందేశం స్వామివారు ఇచ్చారు. రాత్రి ఇంటిలో నా భార్యతో ఇదే చెప్పాను. ధైర్యంగా ఉండాలని, ఒకవేళ మహా అయితే కొంత భూమి పోతుందని దానికి దిగులు పడవద్దన్నాను. ఎంత ప్రాప్తం ఉంటే అంతే లభించును కావున చింత వదిలి జీవించాలన్నాను.

మొత్తం మీద సమస్యలు వస్తూ ఉంటాయి, కాని వాటికి బెదరక ధైర్యంగా ఉండమని, అంతా శ్రీవేంకటేశ్వరుడే చూచుకొనుననే నమ్మకంతో జీవించాలి. ఒక ఇనుప ముక్కను అనుకున్న ఆకారం లోనికి మార్చుటకు పలుమార్లు వేడి చేసి సమ్మెట పోట్లు పడితే కాని ఆ ఆకారం పొందనట్లు నా జీవితంలో స్వామివారు రకరకాల కష్టాలను కలుగచేసి ఆయన అనుకున్న స్థితిని చేరేవరకు కలిగిస్తూనే ఉన్నారు. పైగా ఈ కష్టాల్లో నేనున్నానని చెప్పును. పరిస్థితులు మాత్రం విశ్వాసం కలిగించవు. దీనిని ఎదిరించి నిలుచు స్థితిని పొందుటనే స్వామివారు కోరుకొనుచున్నారని అర్థం.

స్వామివారు ఈ ధైర్యాన్ని కేవలం ఒకరోజు మాత్రమే ప్రసాదించి తెల్లవారి ఉపసంహరించుకున్నారు. కాబట్టి మళ్ళీ వ్యామోహం, భయముతో వణికిపోతున్నాను. నేను స్వయంగా సాధన చేసి భయం లేని స్థితికి చేరాలన్నది స్వామివారి అభిమతంగా కనబడ్డది.

## అయోగ్యతను అంగీకరించి స్వామి వారిని పొందుటను వదులుకొనుట

**తేది 07-11-2022:** గత కొన్ని రోజుల నుండి రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నాను. భూ సమస్య, పోలీసు కేసు, కోర్టులు, నా ఆరోగ్య సమస్య, మా కుమారుని సమస్య ఇలా ఒక దానిపై ఒకటి ఊపిరి ఆడకుండా పట్టి పీడిస్తున్నవి. వీటిని తాళలేక స్వామివారిని చాలాసార్లు ప్రార్థించాను. తాను తీర్చుదునని ఒకసారి లడ్డు తినిపించారు. మరోసారి ధైర్యంగా ఉండమని హితవు పలికారు. కాని సమస్య మాత్రం రోజు రోజుకు పెరుగుచున్నది. నాకేమో భయంతో ఆరోగ్యం మరింత క్షీణించింది. గతంలో నా హృదయాన్ని త్వరగా చెకప్ చేసుకోమని మా డాక్టర్ గారు చెప్పారు. కొన్ని స్వామివారి లీలల కారణంగా ఒక 25 రోజుల తర్వాత చేయించుకుందామని నా భార్యతో చెప్పాను. కాని ఈ మధ్యన ఛాతీ నొప్పి ఎక్కువ కాసాగింది. శ్వాస తీసుకొనుటకు ఇబ్బంది పడసాగాను. త్వరగా హాస్పిటల్ కు వెళదామంటే గతంలో నేను చెప్పిన మాటల ప్రకారం నా భార్య తరువాత వెళదామన్నది. దానితో రేపటివరకు జీవిస్తానా? అనే అనుమానం కలిగింది. ప్రతిరోజు నిద్రనుండి లేవగానే నా జీవితంలో ఒక రోజును పొడిగించారని స్వామివారికి కృతజ్ఞతలను తెలుపుతున్నాను. చివరికి ఈ పరిస్థితిని గమనించి ఇలా ప్రార్థించాను. ‘‘నాకు శ్రీవేంకటేశ్వరునిపై సరైన భక్తి, విశ్వాసం లేదు, భక్తుడనేవాడు సమస్యలకు వెరవడు కాబట్టి నాకు యోగ్యత లేదు, నేను అయోగ్యుణ్ణని నిర్ణయించుకున్నాను. కావున మిమ్ములను పొందే అర్హత నాకు లేదు కాబట్టి మిమ్ములను పొందాలనే కోరికను విరమించుకుంటున్నాను’’. నన్ను క్షమించవలసిందని వేడుకున్నాను. కాని మీ సంకల్పము

మాత్రం నెరవేరుస్తానని ప్రమాణం చేశాను. నిజానికి జీవితాంతం, నేను తృప్తి చెందేవరకు, నిస్వార్థంగా, ఏదీ ఆశించకుండా సేవ చేయుటే నా మొదటి సంకల్పము. కాని మిమ్ములను పొందుటన్నది బోనస్సు లాంటిదని, నా ప్రధాన సంకల్పం కాదని వేడుకున్నాను.

ఈ విధంగా స్వామివారిని పొందాలనే కోరికతో ఏ పని, సేవ చేయరాదని నా కర్తవ్యంగా చేయాలని భావించాను. మరియు నేను అయోగ్యుడననే నిజమును ఒప్పుకున్నాను.

## రెండు స్టెంట్స్ వేసి జీవితాన్ని పొడిగించుట

ఇక నా ఆరోగ్యము క్షీణిస్తున్నదని గ్రహించి చివరికి తేది 12-11-2022 నాడు హాస్పిటల్ కు వెళ్ళాము. స్వామివారు చూపెట్టిన కలల ప్రకారం యాంజియోగ్రామ్ చేసి రెండు స్టెంట్స్ వేశారు. ఇలా నా జీవితానికి పొడిగింపు లభించింది. దీనిని ఆపరేషన్ థియేటర్ లో స్క్రీన్ పై చూచిన నా భార్య చాలా భయపడ్డది. అసలు ఈ ఆపరేషన్ వరకు జీవించి ఉండుటే కష్టం అని, అది ఆ శ్రీవేంకటేశ్వరుని కృప వల్లే సాధ్యమైందని డాక్టర్ గారు అన్నారట. అంతటి విపత్కర పరిస్థితులలో జీవించి, స్వామివారు ప్రసాదించిన జీవిత పొడిగింపును స్వీకరించి ఇప్పుడు బ్రతుకుచున్నాను. ఈ పొడిగింపు జీవితాన్ని స్వామి సంకల్పం నెరవేర్చుటకే వినియోగిస్తానని స్వామి పాద పద్మములపై ప్రమాణము చేసి సంకల్పించుకున్నాను. స్వామివారికి కోటి కోటి ప్రణామాలర్పించాను.

## నా భావి జీవితానికి దిశా నిర్దేశం

**తేది 24-11-2022:** ఇప్పటినుండి నా భావి జీవితానికి నాకు నేను ఈ క్రింది విధంగా దిశా నిర్దేశం చేసుకున్నాను.

నాకున్న మొత్తం ఆస్తి శ్రీవేంకటేశ్వరునిదే అనే భావంతో సదా జీవించాలి. ఆస్తి గొడవలలో మనది పోతే అది స్వామివారిదే అనే భావంతో, నాదేమీ పోవట్లేదని భావిస్తూ చింతించకూడదు. నన్ను స్వామివారు, వారి సంకల్పాన్ని నెరవేర్చుటకు, ఈ భూమి మీద చిన్నగుండవెల్లిలో జన్మనిచ్చి, హైదరాబాద్ లో పోషిస్తున్నారు. నా కర్తవ్యం ఆయన సంకల్పమును నెరవేర్చుట తప్ప మరొకటి ఉండకూడదు. అందుకని ఇతరమైన ఆస్తి గొడవలు తలెత్తితే వాటి పైన దృష్టి పెట్టరాదు. ఈ విధంగా జీవిస్తేనే నన్ను నేను సంస్కరించుకున్నవాణ్ణి అవుతాను, యోగ్యతను సాధించగలను. మరియు దృఢమైన మానసిక స్థితి కలిగి ఉండాలని నిర్ణయించుకున్నాను.

ఈ విధంగా భావిస్తూ కొన్ని రోజులు సాధన చేశాను. కాని భూ సమస్య వచ్చినప్పుడు నిగ్రహించుకోలేకపోయాను. నా సాధన, ప్రయత్నం ఫలించలేదు. వ్యామోహమును వదలనందుకు నాలో నేను చింతించాను. క్షమాపణలు కోరాను. హైకోర్టులో కేసు ఉన్నప్పటికీ తేది 09-11-2022 నాడు మండల సర్వేయరు సర్వే చేసి నా భూమిని 35 అడుగులు ఆక్రమించాడని చూపెట్టాడు. కాని నా వ్యతిరేకి సర్వేకు రానందున దాన్ని రద్దు చేసి అందరి సమక్షంలో ఇద్దరి భూమిని మళ్ళీ సర్వే చేయమని హైకోర్టు తీర్మానించింది. సమస్య తీరలేదు. మళ్ళీ సర్వే ఎప్పుడు జరుగునో తెలియదు, అందుకని ఈ మొత్తం భూమిని ఏదో ఒక ధరకు అమ్మితే సమస్య నుండి బయట పడుదుననుకున్నాను. స్వామివారిని ఆజ్ఞ ఇవ్వమన్నాను. కాని వారు ఇవ్వనందున, అమ్మాలనే నా ప్రయత్నం ఫలించనందున, ఈ సమస్యను ఉపయోగించి మరింత సాధన చేయ నిర్ణయించుకున్నాను. ఇలా నేను అభ్యాస వైరాగ్యాల ద్వారా సాధన చేయు పరిస్థితి కల్పించారు.

మరోప్రక్క నా భార్య సురేఖ కూడా ఇదే పరిస్థితి అనుభవించింది. ఆమెకు పిల్లలంటే మహా ఇష్టం. ఉద్యోగ అర్హత ఉన్నప్పటికీ పిల్లల పెంపకం నిమిత్తం ఉద్యోగం చేయలేదు. పిల్లలకు చక్కని ప్రవర్తన అలవాటు చేసింది. కాని ఈ మధ్యన మా పెద్ద కుమారుడు చి|| వేదాంత్ అనవసర విషయాలను సమస్యగా భావించి అల్లరి చేస్తున్నాడు. ఇంట్లో అందరిపై మతి స్థిమితం కోల్పోయిన వ్యక్తి లాగా అరుస్తున్నాడు. ఈ స్థితి ఎంతవరకు వెళ్ళిందంటే ఆరు నెలల కోసం అమెరికా వెళ్ళి వారి ఇంటిలో ఉన్న వారి అత్తమామలను 45 రోజులకే ఇంటినుండి వెళ్ళగొట్టాడు. అత్తమామలతో, భార్యతో గొడవ పెట్టుకుని భయపెట్టేస్తున్నాడు. వాడి గర్జనలు భయానకంగా ఉంటాయి కాబట్టి వాణ్ణి చూచి అందరూ వణికి పోతున్నారు. దానితో నా భార్య సురేఖ బాధపడుచు ఇరు పక్షాలకు సర్ది చెప్పుచున్నది. నా కొడుకు, కోడలు కలిసి జీవించలేమనే స్థితికి వచ్చారు. చివరికి ఒక పక్షము వారు మరో పక్షము వారితో మాట్లాడకూడదనే నిబంధన విధించుకుని కాంప్రమైజ్ అయినారు. అప్పటినుండి మా కోడలుతో సహా వారి పక్షపు బంధువులు మాతో సరిగా మాట్లాడరు, వారి ఫంక్షన్స్ కు పిలవరు కాబట్టి ఇది నా సాధనకు వరంగా భావించాను. ఈ విధంగా నా కొడుకును ఉపయోగించుకుంటున్నాడని మొదట భావించినప్పటికీ ఇది మా కర్మఫలం అనుభవించుటకని తరువాత తెలిసింది.

ఒక సందర్భములో మా వేదాంత్ అత్త మామలు అమెరికాలోని అదే నగరములో కొంచెం దూరములో కొనుక్కున్న మా రెండవ కుమారుని ఇంటికి వెళ్ళినప్పుడు, మా రెండవ కోడలితో ఇలా అన్నారట. ‘‘మీ వద్ద డబ్బులు లేకపోతే మీ మామయ్యను అడిగి మంచి ఇల్లు కొననుంటిరి’’ అన్నదట. ఒకరకంగా మా డబ్బులు సుఖ సౌకర్యాలకు వాడుకోవాలనే

భావంతో మాట్లాడారు. అప్పటినుండి మా వేదాంత్ మనస్సులో వీరిపైన ద్వేషభావం ఏర్పడ్డది. వీరిని హింసించుట, తక్షణమే ఇంటినుండి వెళ్ళిపొమ్మని గొడవ చేయుట మొదలైనది. వీరు సారీ చెప్పినప్పటికీ శాంతించలేదు. మేము నచ్చచెప్పినప్పటికీ ఆ క్షణము కొంత శాంతించి మరుక్షణము రెచ్చిపోయేవాడు. నిజానికి వీడు శాంతించుటకు ప్రయత్నించినప్పటికీ, ఆ ద్వేషభావమును ఎదిరించుటకు వీడి శక్తి సరిపోయేది కాదు. పాములాగా బుసలు కొడుతూ పై పైకి వచ్చేవాడు. ఆ సమయమున ఏమి చేస్తున్నాడు, ఎలా మాట్లాడుతున్నాడు, మంచి చెడు అనే విచక్షణా జ్ఞానమును కోల్పోయేవాడు. వెక్కిరిస్తూ, అనుకరిస్తూ, ఎగతాళి చేస్తూ దూషించేవాడు. వీడిని చూచిన ప్రతివారు భయముతో వణుకుట తథ్యం.

## అనుభూతుల ప్రచురణకు సన్నాహాలు - భద్రుడు గుర్తుకు వచ్చుట

తేది 14-12-2022 నాడు తిరుమలలో స్వామివారి సుప్రభాత సేవానంతరం స్వామివారిని తనివితీరా దర్శించుకున్నాము. స్వామి అనుభూతులను ప్రచురించుటకు ఆశీర్వాదమును, ప్రేరణను ఇవ్వమని ప్రార్థించాను. మరియు తేది 16-12-2022 నాడు భద్రాచలం వెళ్ళి స్వామివారి కళ్యాణం చేశాము. అక్కడ కూడా ఇదే ప్రార్థనను అంటే సంకల్పసిద్ధికి శక్తిని, అనుభూతుల ప్రచురణకు ప్రేరణను ఇవ్వమని ప్రార్థించాను. వెంటనే నాకు భద్రాచలానికి కారకుడైన 'భద్రుడు' గుర్తుకు వచ్చాడు. ఇదే విధంగా నా కారణంగా తిరుమల స్వామివారు చిన్నగుండవెల్లిలో హరినామ క్షేత్రం ఏర్పాటు చేస్తారనే భావన దృఢంగా ఏర్పడ్డది.

చివరికి తేది 30-12-2022 వరకు నేను పొందిన పూర్తి అనుభూతులను చదివినాను. ఇక వ్రాయుట తరువాయి. నా అనుభూతులను ప్రతి భాగాన్ని శ్రీవేంకటేశం మాసపత్రికలో 8-9 పేజీలు వచ్చే విధంగా వ్రాయాలనుకున్నాను. మొదటి, రెండవ భాగాలలో స్వామివారి సంపూర్ణ లక్ష్యమును తెలుపాలనుకున్నాను కాబట్టి 24 పేజీలు ఉండాలనుకున్నాను. మొదటి భాగంలో స్వామివారి సంపూర్ణ లక్ష్యమును, రెండవ భాగంలో 2000 సంవత్సరం నుండి 2023 మార్చి వరకు పొందిన ముఖ్యమైన లీలలను సంక్షిప్తంగా తెలపాలనుకున్నాను. కాని స్వామివారు నాకు కొన్ని వేల అనుభూతులను ప్రసాదించారు. ఒక చెఱువు నీటిని బావి వరకు పరిమితి చేయుట ఎంత కష్టమో ఇన్ని అనుభూతులను 24 పేజీలలో పొందు పరచడం అంతే కష్టంగా మారింది. అందుకని ముఖ్యమైన విషయాలను ఒక క్రమపద్ధతిలో వ్రాసుకొనుట మొదలుపెట్టాను.

## స్వామి ఆశీర్వాదము - మా ఇంటికి రాగలనని తెలుపుట

తిరుమల స్వామివారిని వైకుంఠ ద్వార దర్శనము చేసుకోవాలని తిరుమలకు తేది 08-01-2023 నాడు బయలుదేరాము. ముఖ్యంగా నేను 'తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం' అనే ధారావాహికమును ప్రారంభిస్తున్నాను, అందుకు స్వామివారి ఆశీర్వాదములు తీసుకొనుటకై తిరుమలకు నారాయణాద్రి రైలులో వెళ్ళుచున్నాము. ఆ రోజు రాత్రి ఒక కల వచ్చింది.

**తేది 09-01-2023 లీల :** ఇది ఒక హృదయాంతరంగ భావం. ''నీవు ఆశీర్వాదమును పొందుటకు వస్తున్నావు, సంతోషం'' అనే విధంగా అనుభూతి పొందాను.

తిరుపతిలో అమ్మవారి దర్శనము తరువాత కొండ పైకి వెళ్ళి వైకుంఠ ద్వార దర్శనము రెండు పర్యాయాలు చేసుకున్నాము. ఈ రెండు సార్లు స్వామివారిని దర్శించి, ఆశీర్వాదము ఇవ్వవలసిందిగా ప్రార్థించాను. ''నా జీవితంలో ఇది ఒక అత్యంత ముఖ్యమైన విషయము, మీ ఆశీర్వాదము, ప్రేరణ, శక్తిని ప్రసాదించమని'' ప్రార్థించాను. మరియు వైకుంఠ ద్వారము లోపల ఏ విధమైన కట్టడాలు ఉన్నవి, వాటి పొడవు వెడల్పు మొదలగు విషయాలను పరిశీలించి వ్రాసుకున్నాను.

ఆ రోజు రాత్రి కొండపై నా భార్య సురేఖకు కూడా ఒక కల వచ్చింది. అందులో స్వామివారు మా ఇంటికి వస్తున్నట్లు చూపెట్టారు.

**తేది 10-01-2023 కల :** మేము మా ఇంట్లో ఉన్నామట. సురేఖ వంట గది నుండి పోవుచు ఎందుకో మా పూజ గదిలోనికి చూచిందట. మా పూజ గదిలో స్వామివారి విగ్రహాల పైన, గోడకు శ్రీవేంకటేశ్వరుని ఫోటో ఒకటి ఉంటుంది. కాని ఇప్పుడు ఈ కలలో ఈ ఫోటో గోడకు లేదట. దాని స్థానంలో ఒక చిన్న రంధ్రం బయటకు పొక్కుకుని వచ్చిందట. గ్రుడ్డు నుండి పిల్ల ఏవిధంగా వచ్చునో అట్లు. తరువాత సురేఖ తన పని పూర్తి చేసుకుని మళ్ళీ పూజగది ముందు నుండి వెళ్ళిందట. అప్పుడు ఆ రంధ్రం నుండి ఒక పాము తల బయటకు వస్తున్నట్లు కనబడ్డదట. ఆ పాము అత్యంత నల్లగా జెడ్ బ్లాక్ కలర్ లో ఉన్నదట. ఆ తరువాత ఆమె కిచెన్ లో పని ముగించుకుని మళ్ళీ పూజగది ముందునుండి వెళ్ళిందట. అప్పుడు ఆ పాము జానెడు వరకు బయటకు వచ్చి ఆడుచున్నదట. సురేఖకు ఆ పామును చూడగానే భయము వేయలేదు. కాని ఆశ్చర్యానికి గురైంది. తిరిగి ఆమె బెడ్ రూమ్ లో ఏదో పని నిమిత్తమై వెళ్ళిందట. పని కావించుకుని తిరిగి పూజగదికి వచ్చి చూచిందట. అప్పుడు ఆ పాము మూరెడు




పూజా గదిలో పామును దర్శించుట (లీల 10-01-23)

సైజుతో నేలపై పడి సురేఖను చూస్తున్నదట. అత్యంత జెడ్ బ్లాక్ రంగుతో, ఎలాంటి మచ్చలు లేకుండా ఆ పాము ఉన్నదట. మరియు దానిని చూచిన సురేఖకు ఎలాంటి భయం వేయలేదు. కాని ఆశ్చర్యానికి లోనైంది. పాము వచ్చిందని ఆమె మాతో చెప్పుచున్నదట. కాని మేము దానిని గమనించక, ఆమె మాటలను పట్టించుకోక ఏదో మాట్లాడుకొనుచున్నామట. ఇంతటితో కల చెదిరింది.

ఆ పాము మా ఇంటి పూజగదిలో శ్రీవేంకటేశ్వరుని ఫొటో పెట్టు స్థలములో గోడ నుండి బయటకు వచ్చింది. మరియు ఆ పాము పూజ మందిరంలోని ప్లాట్ ఫాం పై ఉన్నది. ఇది తిరుమలలో తేది 10-01-2023న వచ్చిన కల. మరియు సురేఖకు స్వామివారు ఒక పాము రూపములో కనిపిస్తానని గతంలో ఎన్నోసార్లు చెప్పారు. దీనర్థం – మా ఇంటికి స్వామివారు స్వయంగా వస్తారని ఆశ్వాసన ఇచ్చారని భావించాము. ఇంతకు మించి మాకు ఏం కావాలి?

## తల తిరిగే విధంగా వ్రాయుమనుట

**తేది 28-01-2023 లీల :** ఈనాటి కలలో నేను వ్రాయబోవు ''తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం'' ధారావాహికమును గంభీరంగా, తల తిరిగే విధంగా ఉండాలనే భావన ఉదయం నిద్రలేచే సమయాన వచ్చింది. ఇది కల కాదు. ఒక హృదయాంతర భావన. నేను కూడా ఈ అనుభూతులను రసవత్తరంగా భక్తులకు చదవాలనే ఉత్సుకత కలిగే విధంగా వ్రాయాలనుకున్నాను. పండితులను, పామరులను మరియు విశ్లేషకులను దృష్టిలో పెట్టుకుని వ్రాయాలనుకున్నాను.

## అనుభూతులను వ్రాయుట ప్రారంభించుట

**తేది 01-02-2023 :** జనవరి నెలలో ముఖ్యమైన విషయాలను వరుస క్రమములో వ్రాసుకున్నాను. ఇక ఈ రోజు బుధవారము, భీష్మ ఏకాదశి తేది 01-02-2023 నుండి నా అనుభూతులను వ్రాయుట ప్రారంభించాను. గత రెండు రోజుల నుండి ఎలా ప్రారంభించాలని చింతిస్తూ స్వామివారిని ప్రార్థించాను. నా ప్రార్థనకు జవాబుగా ఈ ఉదయం 5.45 గంటలకు నేను ప్రాణాయామము చేయు సమయాన ఈ రకమైన హృదయాంతర భావం ప్రసాదించారు.

''తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నా ప్రభువు, నేను ఆయన సేవకుడను, నాకు కర్త కర్మ క్రియ స్వామివారే! నేను ఒక పనిముట్టు లాంటి వాడిని'' అనే విధంగా ప్రారంభించమనే ఆలోచన వచ్చింది.

ఈ ప్రేరణకు తగినట్లు స్వామివారిని ప్రార్థించి ప్రారంభించాను.

## ఇతర ఏ రూపాన్ని, ప్రాంతాన్ని ఆశ్రయించ వద్దనుట

తేది 15-02-2023 నాడు నేను నా భార్య కలిసి గుంటూరులోని శ్రీరామనామ క్షేత్రమునకు వెళ్ళి, వారు చేయు అఖండనామ సంకీర్తనను పరిశీలించాము. అక్కడ ఏవిధంగా గత 80-90 ఏళ్ళ నుండి రామనామ స్మరణ కొనసాగిస్తున్నారని తెలుసుకున్నాము. ఇది మా హరినామ క్షేత్రానికి మోడల్ గా ఉంటుందనే ఆలోచనతో వెళ్ళాము.

మరియు తేది 16-02-2023 నాడు ద్వారకా తిరుమలకు వెళ్ళి స్వామివారిని తృప్తి చెందేవరకు దర్శించుకున్నాము. నా సంకల్పం సిద్ధించే విధంగా అనుగ్రహించమని వేడుకున్నాము. తిరిగి సాయంత్రం హైదరాబాద్ వచ్చాము. కాని ఈ రెండు స్థలములలో మేము తృప్తి చెందలేదు. స్వామివారు కూడా ఒక కల ద్వారా ఈ క్రింది విషయమును తెలిపారు.

**తేది 17-02-2023 కల :** ఈ నాటి కలలో అన్యములైన ఇతర ఏ రూపాన్ని, ఏ ప్రాంతాన్ని ఆశ్రయించవద్దని, కేవలం తిరుమల స్వామివారిని, ఆ ఆలయాన్ని మాత్రమే అనుసరించమనే విధంగా కల కన్నాను.

నేను ఒక పురాతనమైన, రాళ్ళతో నిర్మించిన ఒక కోటను ఎక్కి అక్కడి పాడుపడిన ప్రదేశమును అత్యంత జాగ్రత్తగా మేను పులకించిపోయే విధంగా లీలలను చూపమని వేడుకుంటున్నాను. తదేకంగా పరిశీలిస్తున్నాను. కాని ఎలాంటి అద్భుతములను చూడలేదు. నిరాశతో తిరిగి వెళ్ళిపోయాను. ఇంతే కల.

ఇంతవరకు నేను నా అనుభూతుల మొదటి, రెండవ భాగములను చూచాయగా (రఫ్ గా) వ్రాశాను. మొదటి భాగములో నేను గ్రహించినంతవరకు స్వామివారి సంపూర్ణ లక్ష్యాన్ని తెలిపాను. మొదటి రెండు వాక్యాలను స్వామివారు సూచించినట్లు మొదలుపెట్టి 2000 సంవత్సరం నుండి మార్చి 2023 వరకు స్వామివారి లీలలోని రహస్యాన్ని, నేను వేసిన అడుగులను, నా పొరపాట్లను, స్వామివారు సరిదిద్దుట మొదలగునవి తెలిపాను. ముఖ్యంగా ఏవిధంగా పూర్వం భద్రుణ్ణి ఉపయోగించి భద్రాచలాన్ని, ఋషి యాదగిరిని ఉపయోగించి యాదగిరిగుట్టను ఏర్పరచాడో... అదేవిధంగా ప్రస్తుతం నన్ను ఉపయోగించి చిన్నగుండవెల్లిలో హరినామక్షేత్రమును ఏర్పాటు చేయదలచారని వ్రాశాను. కాని ఈ విషయం నేను ఊహించి వ్రాశానే తప్ప స్వామివారు నాతో ఎక్కడా చెప్పలేదు. అందుకని స్వామివారిని ఇలా ప్రార్థించాను. ''ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీరు మీ భక్తుల మాటను నిజం చేస్తారు. పూర్వం ప్రహ్లాదుని మాటను నిజం చేయుటకు రాతిస్తంభం నుండి ఉద్భవించారు. ఇప్పుడు నేను కూడా భద్రాచలం, యాదగిరి గుట్ట క్షేత్రాల లాగా నన్ను ఉపయోగించి ఒక దివ్యదేశమంతటి శక్తివంతమైన క్షేత్రాన్ని ఏర్పాటు చేస్తారని మీ భక్తులతో చెప్పాను. కాబట్టి నా మాటను వమ్ము చేయరాదని'' వేడుకున్నాను. మరియు తేది 09-10-2022 నుండి 10-12-2022 వరకు రెండు నెలల శిక్షణను ప్రత్యేక శిక్షణగా చూపెట్టాను. మరియు మచ్చుకు పాదసేవను ప్రసాదించిన అనుగ్రహమును వ్రాశాను. ఇదేవిధంగా రెండవ భాగంలో స్వామివారు ప్రసాదించిన ముఖ్యమైన అనుభూతుల విధానమును క్లుప్తంగా తెలియజేశాను. దీన్ని కూడా రఫ్ గా వ్రాసి పెట్టుకున్నాను. ఇంతలో స్వామివారు ఈ రెండవ భాగములో ఒక విషయాన్ని మరచావని చెప్పుచూ... ఈ క్రింది విషయాన్ని సూచిస్తూ చదివే భక్తులకు ఒక పజిల్ లాగా ఉండాలంటూ సూచనలిచ్చారు.

## చదివే భక్తులకు పజిల్ లాగా ఉండాలనుట

**తేది 18-02-2023 కల :** ఇందులో నేను మా ఇంట్లోని బెడ్ రూమ్ లో మంచముపై పడుకున్నాను. ఇంతలో మా డ్రైవర్ 'కలీం' వచ్చి ఎంతో ఆప్యాయత, చనువుతో అదే బెడ్ పైన నా ప్రక్కన కాలు మీద కాలు వేసుకుని పడుకున్నాడు. మరియు నా చేతిని తన చేతిలోనికి తీసుకుని, తన కాలుమీద పెట్టుకుని ఆప్యాయతతో నొక్కుచున్నాడు. ఇంతే కల.

దీనర్థం, కేవలం స్వామి లీలలపై శ్రద్ధ పెట్టుచు, మనము చేసే పనికి, ఈ లీలలకు లింకు పెట్టి ఆలోచించినప్పుడే తెలుస్తుంది. లేకుంటే ఏమాత్రం తెలియదు. కలీం మా వద్ద 2003 సంవత్సరం నుండి డ్రైవర్ గా పని చేస్తున్నాడు. నమో వేంకటేశాయ రథమును అతడే నడిపేవాడు. నేను నా అనుభూతులను ప్రచురణ నిమిత్తం వ్రాయునప్పుడు, స్వామివారు చెప్పినట్లు ''రథయాత్రలో అందరూ స్వామి సేవకులను సమానంగా చూడమన్నాడనే'' విషయమును మరచాను. దానిని గుర్తు తెచ్చుటకు ఈ లీలను చూపారు.

మరియు నేను కూడా నా అనుభూతులు చదివిన ప్రతి భక్తుణ్ణి ఇలా కోరాను. ''నేను నా అనుభూతులను యథావిధిగా వ్రాస్తున్నాను. వీటి అర్థమును నా భావంతో సంబంధం లేకుండా మీరు సొంతంగా స్వామివారి ఈ లీలలను విశ్లేషించి దాని నిజమైన అర్థమును గ్రహించగలరని, ఇది మీకు ఒక పజిల్ లాంటిదని'' చెప్పాను. మరియు ఈ అనుభూతులు చదివిన ప్రతి భక్తుణ్ణి ఆశీర్వదించమని కూడా వేడుకున్నాను.

ఇంతవరకు మొదటి మరియు రెండవ భాగపు లీలలు రఫ్ గా వ్రాయుట పూర్తైంది. అనుభూతులు పొందినప్పటి కంటే వ్రాస్తున్నప్పుడు మరింత ప్రభావానికి లోనైనాను. ప్రతి భాగము నాలో ఎంతో పరివర్తన తీసుకు రాగలదనుటలో సందేహము లేదు.

నా దశ : భక్తుల బృందాలకు స్వామి కృప లభించే విధంగా నాకు నేను తయారు కావాలని ఆదేశించారు. హరినామ క్షేత్రం ఏర్పరచుటకు నా జీవితం పొడిగించబడ్డది. ప్రతి కష్టం స్వామివైపు ఒక మెట్టు ఎక్కిస్తున్నది. సాధన కఠినంగా మారింది. ప్రచురణకై అనుభూతులు వ్రాయటం మొదలుపెట్టాను.

**ఈ కాలంలో జరిగిన కళ్యాణాలు :** 28 వ కళ్యాణం నుండి 37 వ కళ్యాణం వరకు మొత్తం 10 కళ్యాణాలు జరిగాయి.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా మిమ్మల్ని భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు

**గోవిందదాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1.హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

## 'హరినామ క్షేత్రం'

# తిరుమల ప్రతిరూప ఆలయ నిర్మాణం

## భక్తులకు విజ్ఞప్తి

**ఓం నమో వేంకటేశాయ**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆజ్ఞచే తిరుమల ప్రతిరూప ఆలయము (వెండి వాకిలి వరకు) చిన్నగుండవెల్లి (సిద్ధిపేట) లో 7 ఎకరముల స్థలములో తేది 02-07-2026 నాటినుండి పని మొదలైనది. దీనిపేరు 'హరినామక్షేత్రం'. భవిష్యత్తులో ఇది ఒక దివ్యదేశం వలె వెలుగొందగలదని స్వామివారు సెలవిచ్చారు. ఈ ఆలయ ప్రాశస్త్యాన్ని బహిర్గత పరచుటకు మరియు భక్తులను ఈ 'హరినామ క్షేత్రము'లో భాగస్వాములుగా చేర్చుటకు, స్వామివారు 2000 సంవత్సరం నుండి ప్రసాదిస్తున్న వేలాది అనుభూతులను మా 'శ్రీవేంకటేశం' మాసపత్రికలో ఏప్రిల్ 2023 నుండి 'దిశా నిర్దేశం' అనే శీర్షికతో ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. మరియు ఇవి www.srivenkatesham.org వెబ్ సైట్ లో తెలుగు, ఇంగ్లీష్ భాషలలో లభ్యమగును.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఎంతో ఇష్టంతో భావితరాలను ఉద్ధరించుటకు, మనకు వారి సేవాభాగ్యములను ప్రసాదించుటకు మరో తిరుపతిగా దీనిని ఏర్పాటు చేయదలచారు. జన్మ జన్మలు వేచి చూసినప్పటికీ ఇలాంటి అవకాశం లభించదు. మరియు మనకు లభించిన ఈ మానవ జన్మ క్షణభంగురము. మనం సంపాదించిన ఆస్తిపాస్తులు, బంధుమిత్రులు ఎవరూ మనతో రారు. కాబట్టి సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి హరినామ క్షేత్ర ఆలయ నిర్మాణం కొరకు శక్తి కొలది విరాళాలు ఇద్దాం. ఈ జన్మను ధన్యం చేసుకుందాం! తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపను పొందుదాం!

### చందా వివరములు

| మహారాజ పోషకులు | రాజ పోషకులు | పోషకులు | మహా దాతలు | దాతలు | విశేష దాతలు |
|---|---|---|---|---|---|
| 50 లక్షల రూపాయలు, ఆ పైన | 25 లక్షల రూపాయలు, ఆ పైన | 11 లక్షల రూపాయలు, ఆ పైన | 1 లక్ష రూపాయలు, ఆ పైన | రూ.11,116/-, ఆ పైన | ఆలయంలో ఒక భాగాన్ని నిర్మించుట |

భక్తులు యథాశక్తి సమర్పించవచ్చును

మీకు అనువైన విరాళమును ఈ క్రింది అకౌంట్‌లో జమచేసిన తరువాత మీ అడ్రస్, చందా వివరాలను ఈ క్రింది నెంబర్‌కు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా తెలియ చేయగలరు. మరియు మీకు తగిన రసీదును రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపించగలము. (5000కు ఎక్కువ పంపినవారికి మాత్రమే రసీదు పంపబడును) Note: We do not accept forein currency.

### BANK ACCOUNT DETAILS

| BANK | NAME | IFSC Code | A/c Number |
|---|---|---|---|
| SBI, Habsiguda | Sri Venkateshwara Maha Mantra Peetham | SBIN0016514 | 45388232753 |
| HDFC, Siddipet | Sri Venkateshwara Maha Mantra Peetham | -- | -- |


**వివరాలకు సంప్రదించగలరు:**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**
ఇంటి నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ,
హైదరాబాద్-500007.

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
9348212354, 9348811223
040-27175050

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**



# మాతృభక్తి పరాయణుడు - వైనతేయుడు

చింతలపాటి శివశంకర శాస్త్రి

సంవత్సరానికి పన్నెండు నెలలు. పన్నెండు మాసములలో ''ద్వాదశస్వపి మా సేషు శ్రావణోఽమేతి వల్లభాః'' శ్రావణం నాకు అత్యంత ప్రీతిని కలిగించేది. ''ద్వాదశ స్వరూపి మాసేషు శ్రావణః శివరూపకః'' అని స్కాందపురాణంలో శివునిచే కొనియాడబడుటయే గాక శ్రావణమాసం శివరూపమేనని నిర్దేశింపబడింది.

శ్రవణా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం శ్రావణమాసం. శ్రవణా నక్షత్రం మహావిష్ణువు జన్మ నక్షత్రం. అందువల్ల శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనది మాసం. ఆధ్యాత్మికంగానూ, సామాజికంగానూ ప్రత్యేకతను సంతరించుకున్న మాసం శ్రావణ మాసం. పరిపూర్ణమైన సుఖములను, సౌఖ్యములను ప్రసాదించు మాసం, నోములను, వ్రతములను కలిగిన మాసం శ్రావణమాసం. అందువలననే ఆహ్లాదకరమైనది.

శ్రావణమాసంలో శుక్లపక్ష పంచమి నాగపంచమి లేదా గరుడ పంచమి అని పిలుస్తారు. గరుడపంచమి శ్రీమహావిష్ణువుకు వాహనమైన గరుత్మంతుడికి ప్రీతికరమైన రోజు. కలియుగ వైకుంఠముగా ప్రసిద్ధి చెందిన తిరుమల క్షేత్రంలో ఈనాడు విశేష పూజలు జరుగుతాయి.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిగా, ఆపద్బాంధవుడిగా, అర్చామూర్తిగా ప్రసిద్ధికెక్కిన శ్రీవేంకటేశ్వర స్వామి కొలువై యున్న తిరుమలకు, గరుత్మంతుడికి విడదీయరాని సంబంధం

ఉంది. తిరుమల సప్తగిరులతో కూడిన క్షేత్రం. సప్తగిరుల పేర్లలో గరుడాచలం లేక గరుడాద్రి అనేది ఒకటి. తిరుమల కొండ గరుడాకారంలో ఉండటం వల్ల 'గరుడాద్రి' అనే పేరు ప్రధానంగా ఉండేదనే కథనం వామన పురాణంలో పేర్కొనబడింది. అంతేకాక వైకుంఠములోని 'వేంకటం' అనే విష్ణుదేవుని క్రీడాపర్వతాన్ని వరాహ విష్ణుమూర్తి ఆజ్ఞమేరకు గరుత్మంతుడు భూమికి తీసుకు వచ్చి సువర్ణముఖి నది ఉత్తర తీరంలో ప్రతిష్ఠింపచేశాడు కనుక దీనికి గరుడాద్రి అనే పేరు వచ్చిందని మార్కండేయ పురాణ కథనం. గరుడుడు అమరలోకం నుండి అమృతమును తెచ్చినది పంచమినాడే కనుక ఈ పంచమిని గరుడపంచమి అని పిలుస్తారు. తల్లికి దాస్యవిముక్తిని కలిగించిన గరుడిని స్మరించుకుంటూ చేసుకునే పర్వం గరుడపంచమి పర్వం. తోబుట్టువులు గల మహిళలు తమ తోబుట్టువులు సుఖసంతోషాలతో, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, గరుత్మంతుని లాగా బలవంతుడైన తనయుడు కలగాలనే అభిలాషతో ఈ వ్రతమును భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు.

బ్రహ్మర్షి, సప్త మహర్షులలో ఒకడు, మరీచి మహర్షి పుత్రుడు, బ్రహ్మదేవుని మనుమడు అయిన కశ్యప ప్రజాపతికి వినత, కద్రువ అనే ఇద్దరు భార్యలు. కశ్యప మహర్షి మహానుభావుత్వం చేత వినతకు ఇద్దరు కుమారులు కలిగారు. వారిలో పెద్దవాడైన అనూరుడు సూర్యునికి రథసారథి అయ్యాడు. రెండవ కుమారుడైన గరుడుడు విష్ణుమూర్తికి వాహనమయ్యాడు. గరుడుడు అమేయ బలపరాక్రమ సంపన్నుడు. దేవేంద్రుని వజ్రాయుధం దెబ్బలను కూడా తట్టుకోగలిగిన శక్తి గరుత్మంతుని రెక్కలకు ఉంది. అందుకే ఆయనను 'సుపర్ణుడు' అన్నారు. అందువలననే దేవేంద్రుని ఓడించి, అమృతాన్ని తెచ్చి సవతితల్లికి ఇచ్చి, కన్నతల్లికి దాస్యవిముక్తి కలిగించాడు. ఈ విధంగా తల్లికి దాస్యవిముక్తి కలిగించిన రోజే శ్రావణ శుద్ధ పంచమి. ఈ శుద్ధ పంచమిని గరుడ పంచమి పర్వదినంగా జరుపుకోవడం ఆచారంగా వస్తోంది.

కశ్యప ప్రజాపతి కద్రువ వినతల కోరిక మేరకు పుత్రకామేష్టి యాగం చేసి అగ్నితేజో సమన్వితులు, మహాబల సంపన్నులు, దీర్ఘదేహులు అయిన వేయి మంది పుత్రులను కద్రువకు వరంగా ప్రసాదించాడు. వినత దక్షప్రజాపతి పుత్రిక. ఈమె కోరిన సన్మార్గ ప్రవర్తకులు, మహాపరాక్రమశాలురు, కద్రువ పుత్రులకన్నా అధిక శక్తి సంపన్నులయిన ఇద్దరు పుత్రులను ప్రసాదించాడు. మొదటి కుమారుడు అనూరుడు. ఊరువులు లేనివాడు. ఇతడు పెద్దవాడైన తర్వాత సూర్యునికి రథసారథిగా నియమితుడైనాడు. రెండవ కుమారుడు గరుత్మంతుడు పక్షులకు రాజు. సర్పజాతికి శత్రువు. ఆయన గొప్పదనమంతా విష్ణుమూర్తిని వాహనరూపుడై సేవించడంలోనే ఇమిడి ఉంది. నిరంతరం స్వామి పాదసేవా పరాయణుడు. అపారశక్తికి, అద్భుత గమనానికి సంకేతంగా ఆ పక్షిరాజును దేవతలు భావిస్తారు. ''వేదాత్మా విహగేశ్వరః'' వేదస్వరూపుడు గరుత్మంతుడు. వైష్ణవులు గరుత్మంతుని ''గరుడాళ్వార్'' అని అంటారు. భగవద్భక్తిపరులైన ఆళ్వార్లు పన్నెండుమంది ఉన్నారు. వారిలో అగ్రగణ్యుడు మధురకవి ఆళ్వారు గరుత్మంతుని అంశతోనే జన్మించాడని శ్రీవైష్ణవ సంప్రదాయం చెబుతోంది. గరుడుడికి వార్క్ష్యుడు, వైనతేయుడు, ఖగేశ్వరుడు, నాగాంతకుడు, విష్ణురథుడు, సుపర్ణుడు, పన్నగాశనుడని అనేక పేర్లున్నాయి.

కద్రువకు నాగులు పుట్టారు. అందు ఆదిశేషువు జ్యేష్ఠుడు. వాసుకి, కర్కోటకుడు, తక్షకుడు, ఐరావతుడు, ఏలాప్రతుడు మొదలైనవారు ముఖ్యులు. ఒకనాటి సాయంకాలం కద్రువ వినతలు పాలసముద్రము గట్టున విహరించుచు అచ్చటయే తిరుగాడుచున్న తెల్లని గుర్రమును చూసి కద్రువ ఈ గుర్రము ఎంత అందముగా ఉన్నది అని పలికింది. అందులకు వినత అవును ఎంతో అందముగా ఉన్నదని పలికింది. దానికి గుర్రము ఎంత తెల్లగా మెరిసిపోతున్నప్పటికీ దాని తోక నల్లగా ఉంది అని కద్రువ అన్నది. అందులకు వినత అదేం లేదు తెల్లగా ఉన్నదని పలికింది. ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. దగ్గరికెళ్ళి చూద్దామని కద్రువ పలికింది. వినత సరేనన్నది. ఒక ఒప్పందం చేసుకుందాం దాని ప్రకారం ఎవరి మాట నెగ్గితే వారికి రెండవ వారు జీవితాంతం దాసిగా ఉండాలి అని కద్రువ అన్నది.

కద్రువ ఇంటికి చేరగానే తనయులందరినీ పిలిచి తనకూ వినతకూ మధ్య జరిగిన వాగ్వాదమును తెలిపి తాము మరునాడు వచ్చేవేళకు ఆ గుర్రపు తోక నల్లగా ఉండునట్లు ఆ తోకకు చుట్టుకుని ఉండండి అని వేడుకొనినది. తల్లి మాటలు విన్న తనయులు అట్లు చేయుట ధర్మవిరుద్ధమని, ఆ పని చేయటానికి సమ్మతించలేదు. అందులకు ఆగ్రహించిన కద్రువ జనమేజయుడు చేసే సర్పయాగమున సర్పములు నశించుగాక అని తనయులను శపించింది. శాపమునకు భయపడిన కర్కోటకుడు తల్లి కోరికను నెరవేర్చటానికి సిద్ధపడ్డాడు.

మరునటిరోజు కద్రువ, వినత సముద్ర తీరమునకు వెళ్ళి గుర్రపు తోకను చూడగా అది నలుపుగా కనిపించింది. దానితో వినతకు దాసీత్వము ఏర్పడి కద్రువకు దాసి అయింది. అప్పటినుండి కద్రువ చెప్పినట్లు వినత పనులు చేయసాగింది.

గరుత్మంతుడు నారదమహర్షి ద్వారా తల్లి దాస్యమును గురించి తెలుసుకుని, ఎంతో విచారించి తన తల్లిని దాస్యము నుండి విముక్తురాలిని చేయవలెనని సంకల్పించుకున్నాడు.

వెంటనే కద్రువ వద్దకు వెళ్ళి తన తల్లిని దాస్యము నుండి విముక్తురాలిని చేయమని ప్రార్థించాడు. అందులకు కద్రువ గరుత్మంతునితో నీవు మహాబలశాలివి. నీ తల్లి మీద నిజంగా నీకు ప్రేమ, గౌరవం, భక్తి ఉంటే వెంటనే పోయి అమృతము తీసుకొనిరా. అప్పుడు నేను మీ అమ్మను వదిలిపెడతానని పలికింది. పెదతల్లి మాటలను విన్న గరుత్మంతుడు తల్లి వద్దకు వచ్చి, ప్రణమిల్లి తనకు, పెదతల్లి మధ్య సంభాషణను వినిపించి అమృతమును తేవడానికి బయలుదేరుతున్నాను. నన్ను ఆశీర్వదించమని పలికి తల్లి ఆశీస్సులు తీసుకుని గంధమాదన పర్వతముపై తపము గావించుకుంటున్న తన తండ్రి కశ్యపుని దర్శించుకుని జరిగిన వృత్తాంతమును చెప్పి ఆశీర్వదించమని కోరాడు. కుమారుని మాటలను విని కశ్యపుడు ఎంతో సంతోషించి నీవు తెస్తానన్న ఆ అమృతము దేవతలకైనా లభించడం కష్టం. ఆ అమృతాన్ని ఇంద్రుడు చాలా జాగ్రత్తగా దాచి యుంచాడు. ఆ అమృతాన్ని గజ కచ్ఛపాలు రక్షిస్తున్నాయి. ఆ రెండింటినీ చంపి నీ ఆకలి తీర్చుకుని యుక్తితో ప్రవర్తించి, కార్యాన్ని సాధించుకుని విజయంతో తిరిగి రమ్మని ఆశీర్వదించి పంపించాడు. తండ్రి మాటలను శ్రద్ధగా విన్న గరుత్మంతుడు తండ్రి ఆశీర్వాదములను తీసుకుని దృఢ నిశ్చయంతో కార్యార్థియై బయలుదేరాడు.

గరుత్మంతుడు అమితమైన ఆనందంతో, ఉత్సాహం ఉరకలు వేస్తుండగా అక్కడినుండి బయలుదేరి సరోవరమును చేరుకుని గజ కచ్ఛపాలను తృప్తిగా ఆరగించాడు. దానితో అతనికి ఎనలేని జవసత్వాలు చేకూరాయి. గరుత్మంతుడు తన రెక్కలను అల్లల్లాడిస్తూ స్వర్గలోకమున అడుగు పెట్టగానే మహోత్పాతాలు బయల్దేరాయి. దేవతలంతరూ భయభ్రాంతులకు లోనయ్యారు. గరుత్మంతుడు దేవతలను పరాజితులను గావించాడు. అమృతకలశము వద్దకు రాగానే ఒక్కమారుగా అగ్నిజ్వాలలు రేగాయి. నదీజలాలను నోటితో తెచ్చి ఆ జ్వాలలను చల్లార్చాడు. కలశం చుట్టూ పదునైన కత్తులతో పరిభ్రమిస్తూ ఒక చక్రం కనిపించింది. సూక్ష్మశరీరమును ధరించి చక్ర రంధ్రముల నుండి కలశమును సమీపించాడు. అక్కడ రెండు భయంకరమైన సర్పములు రక్షణగా కనిపించాయి. అవి బుసలు కొడుతుంటే అగ్నిజ్వాలలు రేగుతున్నాయి. గరుత్మంతుడు సర్పముల నేత్రముల లోనికి తన రెక్కలను అల్లల్లాడించుచు ధూళిని విసిరాడు. ధూళి పడగానే ఆ సర్పములు ఒక్కసారిగా కళ్ళు మూసుకున్నాయి. వెంటనే తన నఖములతో వాటిని చీల్చి అమృత కలశమును తీసుకుని ఆకాశ వీధిలోనికి ఎగిరాడు. అమృత కలశమును తీసుకొని పోతున్న గరుత్మంతుడి మీద ఆగ్రహముతో దేవేంద్రుడు వజ్రాయుధమును విసిరాడు. అది గరుత్మంతుని అలవోకగా స్పృశించింది. ఆ వజ్రాయుధం సైతం అతనిని ఏమీ చేయలేకపోయింది.

మిక్కిలి బలవంతుడైన గరుత్మంతునితో వైరం కంటే సఖ్యమే మేలని భావించిన దేవేంద్రుడు, గరుత్మంతా! నీవు తీసుకువెళ్ళే అమృతమును నాగులకు సమర్పిస్తే వారు మృత్యుంజయులై లోక కంటకులవుతారు అని పలికాడు. గరుత్మంతుడు సమాధానమిస్తూ నా తల్లిని దాస్యము నుండి విముక్తురాలిని చేయడానికి అమృతమును నాగులకు ఇవ్వక తప్పదు. అందువలన నేను అమృతమును వారికి అప్పగించగానే నీవు ఏదోవిధంగా దానిని చేజిక్కించుకుని స్వర్గానికి తీసుకుని పోవచ్చు అని పలికాడు. అందుకు దేవేంద్రుడు ఎంతో సంతోషించాడు.

గరుత్మంతుడు అమృత కలశమును తీసుకొని వచ్చి నాగులతో మీరు కోరిన ప్రకారం అమృతమును తెచ్చాను. మీరు ఆ అమృతమును సేవించవచ్చుననగా నాగులు ఆనందంతో అమృతకలశం ఉన్న చోటుకు వచ్చారు. అక్కడే అదృశ్య రూపంలో ఉన్న దేవేంద్రుడు అమృత కలశమును తీసుకుని స్వర్గానికి వెళ్ళిపోయాడు. తాము అన్నమాటకు కట్టుబడి అమృత కలశాన్ని తెచ్చినప్పటికీ తాము దక్కించుకోలేకపోయామన్న బాధతో నాగులు నిరాశకు లోనయ్యారు. ఏమీ చేయలేక వినతను దాస్యము నుండి విముక్తురాలిని చేశారు. ఈ విధంగా స్వర్గం నుంచి అమృతాన్ని తీసుకుని వచ్చి తల్లికి దాస్య విముక్తం గావించిన రోజే ''శ్రావణ శుక్ల పంచమి''. అంతేకాక గరుత్మంతుడు జన్మించిన రోజు కూడా అదేనని, అందుకు గరుత్మంతుడి ప్రీత్యర్థం వ్రతం చేయడం ఆచారమైనట్లు శాస్త్ర వచనం.

గరుత్మంతుడు వేదస్వరూపుడు. వేదమయుడైన గరుత్మంతుని వ్రతాన్ని ఆచరిస్తే అటు పుట్టినింటికి, ఇటు మెట్టినింటికీ సకల సౌభాగ్యాలు కలగడంతో పాటు స్త్రీల సౌభాగ్యం కలకాలం వర్ధిల్లుతుంది. కావున పంచమినాడు వ్రతాన్ని ఆచరించి తమ సౌభాగ్యాన్ని కలకాలం వర్ధిల్ల చేసుకోవాలని ఆకాంక్షిస్తూ...

**"ఫణిగౌరీ నమోస్తుతే కైలాస నిలయే స్థితే**
**లోక మాతర్నమస్తుభ్యం సౌభాగ్యం దేహిమే సదా"**

అని ప్రార్థిద్దాము. సౌభాగ్యాలతో వర్ధిల్లుదాము.

**"ఓం తత్పురుషాయ విద్మహే సువర్ణ పక్షాయ ధీమహీ**
**తన్నో గరుడః ప్రచోదయాత్"**

సత్సంతాన ప్రాప్తికి, నాగదోష నివారణకు గరుడపూజ విశిష్టమైనదని ఆగమ గ్రంథాలు ఉపదేశిస్తున్నాయి. అట్టి గరుత్మంతుడు మాకు మంచి జ్ఞానాన్ని ప్రసాదించు గాక!

"లోకా స్సమస్తా సుఖినో భవంతు"

# శ్రావణ వరలక్ష్మీ వైభవం

– డా|| దేవులపల్లి పద్మజ

**లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం**
**దాసీ భూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం**
**శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవద్బ్రహ్మేంద్ర గంగాధరాం**
**త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం !!**



దివ్య తేజోవంతమైన కాంతి కిరణాలతో భూమిని పరిపాలిస్తున్న శ్రీమహావిష్ణువు యొక్క అర్థాంగి అవనిపై అడుగడుగునా దర్శనమిచ్చే ఆమె మరో రూపం మనం చలామణిలో నిత్యం మన అవసరాలు తీర్చుకుంటున్న ధనం. ఆ ధనలక్ష్మిని ప్రత్యేక విధానంలో సేవించుకునే పర్వదినం శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం. శ్రావణ మాసం పూర్తి విష్ణు సంబంధ మాసం. కలియుగంలో వెలసిన తిరుమలేశుని జన్మ నక్షత్రమైన శ్రవణం అనుసరించి వచ్చిన మాసం శ్రావణమాసం. ఈ మాసంలోనే ద్వారకానాథుని జన్మతిథి మొదలగు ప్రత్యేక విశేషాంశాలు కలిసిన మాసం మరియు సాక్షాత్తు లక్ష్మీదేవికి ప్రీతికరమైన మాసం. గౌరీ సంబంధ వ్రతములు చేపట్టి నిత్య సుమంగళిగా జీవితాన్ని ప్రసాదించమని ఆ పార్వతీదేవిని అభ్యర్థించే ఈ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చు శుక్రవారం సముద్రరాజు కుమార్తె, శ్రీరంగుని అర్థాంగిగా విష్ణువు మనసులో ప్రతిష్ఠింపబడిన లక్ష్మీదేవిని వరలక్ష్మిగా సమస్త దేవతలు, మానవులు కొలుచుకుందురు. ఈ వ్రతమును సంకల్పించుకునేవారు ముందురోజు ఇల్లూ, వాకిలీ శుభ్రం చేసుకొని, గడపలకు పసుపు కుంకుమలు అద్ది, గుమ్మానికి మామిడి తోరణాలు కట్టి సిద్ధం చేసుకోవాలి. సూర్యోదయానికి ముందే మహాలక్ష్మి ప్రతీ ఇంటికి తిరుగుతూ,ఏ ఇంటి ముంగిట అలికి, ముగ్గులతో అలంకరించి వుంటుందో, ఆ ఇంటిలోనికి ప్రవేశిస్తుందని విష్ణుపురాణంలో చెప్పినట్లు తెలుస్తోంది. అంతులేని ఐశ్వర్యానికి, సిరిసందలకు, పుత్రపౌత్రాభివృద్ధికి, కీర్తి ప్రతిష్ఠలకు, విద్యావ్యాపారాభివృద్ధికి తోడ్పాటు నందించే మహత్తర వ్రతము వరలక్ష్మీ వ్రతము.

**సర్వార్థ సాధనకరీ ధానుర్ధారణీ కామలా**
**కరుణాధార సంభూతా కమలాక్ష శశిప్రియా !!**

భూలోకంలో ప్రతి హైందవ స్త్రీ తప్పక ఆచరించదగిన,

అమ్మ ఆశీస్సులు అందుకొను అవకాశం కలిగినది, శ్రావణ శుక్రవారము వ్రతము. అయితే విధివిధానాలు పాటిస్తూ ఈ శ్రావణమాస శుక్రవారాలు మహాలక్ష్మిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ ప్రత్యేకించి పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారము జరుపుకునే వరలక్ష్మీ వ్రతము అత్యంత ఫలదాయకమైనది.

ఈ వ్రతమును ఆచరించు స్త్రీలు సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి తలకు నువ్వులనూనె రాసుకొని ముఖమునకు, కాళ్లకు, మంగళ సూత్రములకు పసుపు రాసుకొని స్నానాదికాలు ముగించుకొని, పరిశుభ్రమైన వస్త్రము ధరించి పూజ ప్రారంభం చేయాలి. ఈ పూజ చేయు మహిళలు వ్రతము పూర్తియగువరకు నిరాహారముగా నుండి పూజ జరుపవలెను. చక్కటి కలశమును ఏర్పాటు చేసుకోవలెను. ఒక కొబ్బరి కాయను ఎంచుకొని, పసుపురాసి, కుంకుమతో అలంకరించి, రాగి, వెండి, ఇత్తడి, బంగారంతో చేసిన ఏదో ఒక పాత్రను తీసుకుని పవిత్రమైన నీటితో కాని, బియ్యంతో కాని నింపి, దానికి సిద్ధం చేసుకున్న కొబ్బరికాయను అమర్చి, ఆ కొబ్బరిపై క్రొత్త వస్త్రం చుట్టవలెను. కలశమునకు చీర కట్టే అలవాటు ఉన్నట్లయితే, కొంచెం పెద్ద కలశము తీసుకుని, దానిని అలంకరించుకోవచ్చును. మనం గుర్తుంచుకోవలసినది భక్తి ప్రధానము. పూజకు సిద్ధం చేసుకొన్న స్థలంలో వరలక్ష్మిని నిలిపి, యధావిధిని, ఆరోజువున్న మంచి సమయంలో పూజ చేయాలి.

**లక్ష్మీ స్తుష్టిర్మహాధీరా శాంతిరాపూరణేనవా**
**అనుగ్రహా శక్తిరాద్యా జగజ్జ్యేష్ఠా జగద్విధిః !!**

శక్తిని అనుసరించి అష్టోత్తరంతో కాని, సహస్రంతో గాని పూజ చేసుకొనవచ్చును. షోడశ పూజ మాత్రం విధిపూర్వకంగా చేయాలి. లభ్యతను అనుసరించి తొమ్మిది రంగుల పువ్వులు, నవధాన్యాలు ఉపయోగించటం శ్రేష్టము. పూజలో నవ తోరం గ్రంధి పూజ చేయాలి. ఇందులో 9 ముడులు ప్రధానము. ఏదైనా ఒక రకం పువ్వులను ఉపయోగించ వచ్చును లేదా తొమ్మిది రకముల పుష్పములతో చేసుకొనవచ్చును. తోరగ్రంధిని ప్రత్యేక మంత్రముతో అర్చించి ధరించవలెను. వ్రతఫలము సంపూర్ణముగా లభించుటకు, ఆ వరలక్ష్మి అనుగ్రహం సిద్ధించుటకు మూడు తోరములను తయారుచేసుకొని, సాక్షాత్తు అమ్మవారిగా భావించే పుణ్యస్త్రీకి ఒకటి, వరలక్ష్మికి ఒకటి, తాను ఒకటి ధరించవలెను.

**అనంతా వైష్ణవీవ్యక్తా విశ్వానందా వికాసినీ !**
**శక్తిర్విభిన్న సర్వార్తిః సముద్ర పరితోషిణీ**

తోరం ధరించేటప్పుడు పఠించవలసిన మంత్రము

బధ్నామి దక్షిణ హస్తే నవసూత్రం శుభప్రదం పుత్రపౌత్రాభివృద్ధించ దేహిమే రమే.

పూజకు సిద్ధం చేసిన స్థలంలో తమలపాకులోగాని, వెండి పళ్ళెంలో గాని, రాగి పళ్ళెంలోగాని పసుపు గణపతిని పెట్టి, పూజ ప్రారంభించాలి. ''శుక్లాంబర ధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే'' అని ఆదిదేవుని ప్రార్థించి, అనంతరం మహాలక్ష్మిని వ్రతనియమానుసారంగా పూజించి, నైవేద్య, చందన తాంబూలాది సత్కార్య విధులను చేయవలెను. మనకు అందుబాటులోవున్న నైవేద్యాన్ని భక్తితో సమర్పించవచ్చును. ఫలములు, పాయసము, పాలు, తేనె మొదలైనవి సమర్పించవచ్చును. అలాగే పూజావిధిలో వస్త్రం సమర్పించేటప్పుడు పట్టు వస్త్రాన్నే సమర్పించనవసరం లేదు. అందుబాటులోని కొత్త వస్త్రం ఏదైనా సమర్పించవచ్చును. ఆభరణ సమర్పణ విషయంలో కూడా స్వర్ణాభరణముల అవసరం లేదు. వాటి స్థానంలో మంచి పుష్పాలు సమర్పించవచ్చును. విధివిధానం ప్రకారం, భక్తితో, వరలక్ష్మిని పూజించినట్లయితే, సంపదలు, సౌభాగ్యము సిద్ధిస్తాయి.

పూజానంతరము సూతపౌరాణికుడు, శౌనకాది మహర్షులద్వారా పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పిన చారుమతిదేవి కథను చదువవలెను. కథను చదివేటప్పుడు అక్షతలు చేతిలో నుంచుకొనవలెను. తరువాత అక్షతలు అమ్మవారి పాదాలవద్దనుంచి, వాటిని శిరస్సుపై ధరించవలెను. ఆ వరలక్ష్మీదేవికి నవవిధ ప్రదక్షిణలు చేసినట్లయితే, ఒక్కొక్క ప్రదక్షిణకు ఒక్కొక్క ఫలితము సంప్రాప్తిసుంది. మహాలక్ష్మి అనుగ్రహం కోసం ముత్తయిదువులకు వాయనం ఇవ్వవలెను. ఈ క్రింది శ్లోకం చదివిన మంచిది.

**వాయన విధిః ఏవం సంపూజ్య కల్యాణీం వరలక్ష్మీం స్వశక్తతః**
**దాతవ్యం ద్వాదశాపూపం వాయనం పి ద్విజాతయే!!**
**వాయనదాన మంత్రము.**
**ఇందిరా ప్రతిగృహ్ణాతు ఇందిరా వైదదాతిచ,**
**ఇందిరా తారకోభాభ్య మిందిరాయై నమో నమః**

ఈ వాయనంలో పరావర్తనము చెందిన అనగా నానబెట్టిన శనగలు, రెండు పళ్ళు, అరటి పళ్ళు లేక నారికేళం, 5 తమలపాకులు, 2 వక్కలు, పదకొండు రూపాయల దక్షిణ, 5 లవంగాలు, 5 ఏలకులు, గాజులు, కాటుక, పసుపు, కుంకమలు, కలిగినచో చీర లేక జాకెట్టు, సిద్ధం చేసిన తోరంగ్రంధి, పుష్పములు వాయనముగా దానమిచ్చి, వారినుంచి అమ్మవారి తరపున ఆశీర్వచనం పొందవలెను.

**అనంతా వైష్ణవీ వ్యక్తా విశ్వానందా వికాసినీ**
**శక్తిర్విభిన్న సర్వార్తిః సముద్రపరితోషిణీ**

సర్వం సన్మంగళాని భవన్తు –
సర్వం వరలక్ష్మీదేవతార్పణమస్తు




# అష్టావక్ర మహర్షి

ఒకప్పుడు ఏకపాదుడనే బ్రాహ్మణుడు అఖండమయిన తపస్సు చేస్తున్నాడు. ఆయన భార్య సుజాత ఉత్తమ ఇల్లాలు. భర్తకు చాలా సేవ చేసింది. అనేకమంది శిష్యులకు వేదములు, వేదాంగములు చెపుతూ ఉండేవాడు నిరంతరము. కొంతకాలానికి ఆయన భార్య గర్భవతి అయింది. వాళ్ళు సంతోషంగా ఉన్నారు. ఆమె గర్భంలోని శిశువుకు మూడవ మాసం వచ్చింది.

ఏకపాదుడు శిష్యులకు వేదం చెప్పేటప్పుడు రోజుకు 18 గంటలు చెబుతూ, వాళ్ళు వేదం చదివేటప్పుడు చేసే తప్పులను సరిదిద్దుతూ స్వరం చెపుతూ వాళ్ళను విసిగిస్తూ ఉండేవాడు. ఆయన చర్యకు సుజాతాదేవి గర్భంలో ఉన్న శిశువు నవ్వి, ఆయనతో ''ఏమిటీ మూఢత్వం? శిష్యులకు వేదం నేర్పటానికి ఇన్ని గంటలా? ఇన్ని సార్లు చెప్పాలా? నీవే గనుక సరి అయిన గురువువి అయితే, ఒక్కమాటు వాళ్ళకి చెబితే వాళ్ళకు తెలియాలి కదా! వాళ్ళు సరిగా పలకాలి కదా?'' అని తండ్రిని ఆక్షేపించాడట గర్భంలో ఉండగానే.

కడుపులో ఉన్న శిశువు అలా అనేటప్పటికి ఆయనకు కోపం వచ్చింది. ఆయన శాస్త్రవేత్త, వేదాంగములు చదువుకున్నవాడు, తపస్వి. పుట్టకముందే వాడు తనను ఆక్షేపించటమా! దీనినే గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందని అంటారు.

ఆయన కోపంతో ''నా అంతటి వాడిని పాఠం చెపుతూ ఉంటే నువ్వు వక్రభాష్యం చేస్తావా? నువ్వు ఎనిమిది వంకరలు కలిగిన శరీరంతో పుడతావు'' అని శపించాడు ఆ శిశువును (తనకు పుట్టబోయిన కొడుకును).

ఆ కారణం చేత ఆయన పుట్టినపుడు శరీరం ఎనిమిది వంకరలుగా ఉన్నది. అందుకని ఆయనకు 'అష్టావక్రుడు' అని పేరు పెట్టారు. కాని ఆయన పుట్టుకతోనే సమస్త వేదవిజ్ఞానాన్ని నిధిగా కలిగినవాడుగా పుట్టాడు.



ఆయన పుట్టుకకు పూర్వం తల్లి ఏకపాదుడితో, పురిటి సమయంలో పురిటి ఖర్చులకు, తరువాత పిల్లవాడి పెంపకానికి ధనం కావాలి కదా! అందుకని ఆ దేశాన్ని – మిథిలానగరాన్ని ఏలే జనకమహారాజు దగ్గరకు వెళ్ళి ఆయనను అడిగి తెమ్మని కోరింది.

ఏకపాదుడు ధనం కోసం జనకచక్రవర్తి కొలువుకు వెళ్ళాడు. ఆయన ఏకపాదుడిని ''నువ్వు ధనం కోసం వచ్చావు సరే కానీ, నీకు ఉన్న విద్య ఏమిటి? దేనిమీద నీకు అధికారం ఉంది? ఎట్లాంటి విజ్ఞానం ఉంది?'' అని అడిగాడు.

ఏకపాదుడు అందుకు జవాబుగా ''నేను వేద వేదాంగములను చదువుకున్నాను. సంపూర్ణంగా సత్యాన్ని తెలుసుకున్నవాడిని'' అని చెప్పాడు. స్వోత్కర్షగా కొంచెం

గట్టిగా చెప్పుకున్నాడు తనను గురించి.

అప్పుడు జనకుడన్నాడు – ''అలా అయితే నా ఆస్థానంలో ఉన్న వందితో నువ్వు వాదించి మహాపండితుడివి అని ఋజువు చేసుకుంటే, ఇప్పుడు నువ్వు చెప్పిన మాటలన్నీ సత్యములని తేలితే, నువ్వు ఎంత అడిగితే అంత ఇస్తాము'' అన్నాడు. వంది వరుణదేవుడి కొడుకు. జనకుడి ఆస్థాన విద్వాంసుడు. మహాపండితుడు.

వందితో జరిగిన వాదనలో ఏకపాదుడు సమాధానం చెప్పలేకపోయాడు. అంతకుముందు షరతు ఏమిటంటే, ఒకవేళ వందితో వాదించి గెలవలేకపోతే, అక్కడ ఉన్న ఒక చెఱువులో (తవ్వించారు) కూర్చోవాలి. జలమజ్జిత అని దానికి పేరు. ఏకపాదుడు తనను పండితుడని అహంకరించి వచ్చినందుకు శిక్ష అది. అలా ఓడిపోయి జలమజ్జితుడై తిరిగి ఇంటికి పోలేదు. సుజాత పుట్టింటికి వెళ్ళింది చేసేది లేక.

సుజాత తండ్రి పేరు ఉద్దాలకుడు. అష్టావక్రుడు పుట్టిన సమయానికి ఉద్దాలకుడి భార్య కూడా ప్రసవించి, శ్వేతకేతు అనే కొడుకును కన్నది. అంటే శ్వేతకేతు అష్టావక్రుడికి మేనమామ, సుజాతకు తమ్ముడు. వీళ్ళిద్దరికీ ఉద్దాలకుడే విద్యాబోధన చేస్తుండేవాడు. కొడుకుకు, మనుమడికి ఆయన విద్య చెప్పాడు. అయితే పుట్టినప్పటినుండీ తండ్రిని చూడకపోవడం చేత ఉద్దాలకుడిని తండ్రి అని, శ్వేతకేతుని అన్న అని అనుకునేవాడు అష్టావక్రుడు.

ఒకనాడు శ్వేతకేతుకు, అష్టవక్రుడికి జరిగిన సంవాదంలో శ్వేతకేతు అష్టావక్రుడితో ''నీ తండ్రి దగ్గరికి పో. ఇక్కడ మా ఇంట్లో ఎందుకున్నావు?'' అన్నాడు. అప్పుడు అవమానభారంతో, తన తండ్రి వేరే ఉన్నాడని తెలియక తల్లి దగ్గరికి వెళ్ళి, ''అమ్మా! నా తండ్రి ఎవరు? ఎక్కడ ఉన్నాడు?'' అని అడిగాడు అష్టావక్రుడు.

అతడి ప్రశ్నకు సమాధానంగా ఆమె అష్టావక్రుడితో, ''నాయనా! నీకు తెలియదు. నీవు పుట్టటానికి ముందే ధనం కోసమని రాజాస్థానానికి వెళ్ళిన నీ తండ్రి వందితో వాదించి ఓడిపోయి అక్కడ శిక్షననుభవిస్తున్నాడు'' అని చెప్పింది. ''నేను వెళ్ళి తండ్రిని విడిపించుకుని వస్తాను'' అని అష్టావక్రుడు శ్వేతకేతును కూడా తీసుకుని రాజాస్థానానికి వెళ్ళాడు. మళ్ళీ ఇద్దరూ స్నేహంగానే ఉన్నారు.

ఉద్దాలకుడు చెప్పిన జ్ఞానము అమోఘమైనటువంటిది. ఆయన మహా పండితుడు. గొప్ప జ్ఞాని. ఆయన బోధించిన జ్ఞానము, విద్యతో వారు ఆస్థానానికి వెళితే, ద్వారపాలకులు వాళ్ళను అడ్డగించారు. ''రాజాస్థానానికి మీలాంటి పిల్లలు పోకూడదు. లోపలికి వెళ్ళకూడదు. పెద్దలు, బ్రాహ్మణులు, పండితులైనవారు మాత్రమే వెళ్ళాలి. ఏదయినా పాండిత్య విషయం వస్తే సభలో చెప్పాలి అంతే. అదీ వయోవృద్ధులే వెళ్ళాలి. అందుకని లోపలికి పంపటానికి వీలుపడదు'' అన్నారు.

''ఇది ఏమి రాజాస్థానము? వయసు చూచి పండితులనుకునే ఆస్థానమా ఇది!'' అని తిరస్కరించి అష్టావక్రుడు, ''వయసుకు, జ్ఞానానికీ సంబంధం లేదు'' అని రూఢిగా చెప్పాడు. ఆ ద్వారపాలకుడు కూడా పండితుడే. అందుకే వెంటనే ఈయన సామాన్యుడు కాదని గ్రహించాడు. వెంటనే రాజు దగ్గరికి వెళ్ళి ''మహారాజా! పండితులైన ఇద్దరు పిల్లలు తమరి దర్శనానికి వచ్చారు. వాళ్ళను అనుమతిస్తారా?'' అని అడిగితే రాజు సరేనన్నాడు. వెంటనే ద్వారపాలకుడు – అష్టావక్రుడు, శ్వేతకేతులను ఆస్థానానికి తీసుకువెళ్ళాడు.

రాజు వాళ్ళను పలకరించి ''ఏమిటి మీరు పండితులా? మీరు బ్రహ్మచారులా? అని అడిగాడు. వాళ్ళు రాజుతో ''అవును. మేము మీ ఆస్థాన పండితుడైన వందితో వాదించటానికి వచ్చాము'' అన్నారు. ''అలాగా! ఓడిపోతే శిక్ష ఏమిటో తెలుసా?'' అన్నాడు రాజు. ''ఏముంది? జలాశయంలో కూర్చోబెడతారు. అంతేకదా? మాకు తెలుసు'' అన్నాడు అష్టావక్రుడు.

రాజు ఆస్థానంలో అనేకమంది పండితులు, జ్ఞానులు, మునులు, యోగులు ఉన్నారు. ఎనిమిది సంవత్సరాల వయసు కలిగిన అష్టావక్రుడు వందితో వాగ్వివాదానికి దిగాడు. సృష్టిలో ఉండేటటువంటి సత్యములలో వంది ఒకటి చెబితే, దాని పై సత్యాన్ని ఇంకొకటి చెప్పాలి తను. అదీ అక్కడ పందెం. ఒకటి అనే సంఖ్య ఏమేమి చెబుతుంది సృష్టిలో, ఆ పరమసత్యం చెప్పాలి. ఒకటికి చెప్పిన తరువాత, ఆ తరువాత సంఖ్య రెండు. ఈ సంఖ్య సృష్టిలో ఉండే ఏ పరమసత్యములను చెబుతుందో, అది తను చెప్పాలి. దాని తరువాత 3వ సంఖ్య మళ్ళీ అతడు తీసుకుంటాడు. సృష్టిలో ఉండే పరమ సత్యాలేమిటి? – మూడు సంఖ్య వేటిని గురించి చెబుతుంది? ఈ విషయాన్ని అతడు చెప్పాలి. తరువాత నాలుగేదో తను చెప్పాలి. ఈ ప్రకారంగా ఎక్కడయితే ఆ పై సంఖ్య గురించి అవతలివాడు చెప్పలేక ఆగిపోతాడో, అక్కడ అతడు ఓడిపోయినట్లు.

''ప్రజ్వలించేది అగ్ని ఒకటే. సూర్యుడు ఒకడే. శివుడు ఒకడే సర్వవ్యాపి'' అని ఒకటి సంఖ్యకు సంబంధించిన మూడు సత్యాలు వంది చెప్పాడు. అప్పుడు అష్టావక్రుడు రెండు సంఖ్యకు సంబంధించిన రెండు సత్యాలు చెప్పాడు. ''ఇంద్రాగ్నులిద్దరు. నారద పర్వతులిద్దరు. దేవతలైన అశ్వినేయులిద్దరు. సంసార మూలం అయిన భార్యా భర్తలు ఇద్దరు'' అని చెప్పి రెండు సంఖ్య నిరూపించాడు. అవి శాశ్వతములైన సత్యాలు అయి ఉండాలి. ఈ ప్రకారంగా 12వ సంఖ్య వరకు చెప్పుకుంటూ

వెళ్ళారు. 12వ సంఖ్య అష్టావక్రుడు చెప్పాడు. 13 వ సంఖ్య వంది చెప్పలేకపోయాడు. ''జితోస్మి'' (''ఓడిపోయాను నేను'') అన్నాడు వరుణకుమారుడైన నంది.

నీకేం కావాలని అష్టావక్రుడిని జనకమహారాజు అడిగాడు. అష్టావక్రుడు ''నా తండ్రిని విడిపించుకోవటానికి వచ్చాను. ఆయన శిక్షలో ఉన్నాడు. ఇంతకుముందు మీరు నిర్ణయించిన ప్రకారంగా ఈ వందిని ఆ చెరువులో కూర్చోబెట్టి నా తండ్రిని బయటకు పంపించండి'' అన్నాడు. దానికి జవాబుగా వంది ''కేవలం అది ఒక వంక మాత్రమే. ఇలా చాలామంది బ్రాహ్మణులను తీసుకువచ్చి వాళ్ళను వాదనలో గెలిచి, వాళ్ళ మహత్యాన్ని తెలుసుకున్నవాడిని. వాళ్ళకు నిజంగా శిక్ష వెయ్యలేదు. నా తండ్రి అయిన వరుణదేవుడు ఒక మహాయాగం సంకల్పించి చేస్తున్నాడు. దానికి ఋత్విక్కులు దొరకటం లేదు. అందుకని ఇలాగ వీళ్ళను ఆకర్షించి ఓడించి అక్కడకు పంపించి, అక్కడ ఆ యజ్ఞం సక్రమంగా జరిగేటట్లు చూస్తున్నాను. అయ్యా! నీ తండ్రి వరుణదేవుడి యజ్ఞంలో ఉన్నాడు చూడు'' అని చెప్పి ఆయనను పిలిపించి సన్మానం చేశాడు. అందుకు ఫలంగా వందితో ''నిన్ను క్షమిస్తున్నాను'' అన్నాడు అష్టావక్రుడు. 8 ఏళ్ళ పిల్లవాడు వందిని క్షమించి విడిచిపెట్టాడు. ఆ ప్రకారంగా అష్టావక్రుడు లోకవిఖ్యాతుడయ్యాడు.

అష్టావక్రుడు ఇంకా తపస్సు చేసుకున్నాడు. తండ్రి శిక్షణలో వేద వేదాంగాలను, సృష్టిలో చాలా విషయాలను తెలుసుకున్నాడు. వివాహకాలం ఆసన్నమయింది. 16, 17 సంవత్సరములు వచ్చాయి. ఎనిమిది వంకరలతో ఉన్నవాడిని ఎవరు చేసుకుంటారు? ''నన్ను ఎవరు చేసుకుంటారు? నాకు పెళ్ళి ఎందుకు?'' అనుకుని ఒక చెరువు దగ్గరకు వెళ్ళి ఆ నీళ్ళ మీద హాయిగా ఒక చాప వేసుకుని కూర్చున్నాడు అష్టావక్రుడు. సిద్ధుడికి అసాధ్యమయినది ఏముంది? మధ్యలో కూర్చుని ధ్యానం చేస్తున్నాడు.

ఆయన యొక్క జ్ఞానాన్ని, ఉత్కృష్ట తపోబలాన్ని తెలిసినటువంటి ఇంద్రుడు ఆయనకు సేవ చేయటానికి అప్సరసలను పంపించాడు. రంభాది అప్సరసలు వచ్చి ఆయన చుట్టూ నాట్యాలు చేసి ఆయనను రంజింప చేశారు. ''బాగుంది. మీరందరూ ఆడారు, పాడారు, చాలా బావుంది ఇక వెళ్ళండి'' అన్నాడు. ఆయనకేమీ మనస్సు చలించలేదు. వాళ్ళు ఆయనతో ''మీరు చాలా మహాత్ములని ఇంద్రుడు చెప్పాడు. మాకో వరం ఇవ్వగలరా?'' అని అడిగారు. సరే అడగమన్నాడు ఆయన. ''మమ్మల్ని శ్రీమహావిష్ణువే పెళ్ళి చేసుకోవాలి'' అని అడిగారు. విష్ణువు ఈయన చేతిలో ఉంటాడా? ఏదసాధ్యమో అది అడగటం.

''వీళ్ళు నన్ను పరీక్షిద్దామనుకుని చూస్తున్నారు, ఒక్క విష్ణువును తప్ప ఎవరినీ అడగటానికి వీలు లేని వరం అడిగారు'' అని తనలో అనుకుని వాళ్ళతో ''మీరడిగిన వరం ఇస్తున్నాను. మీ కోరిక నెరవేరుతుంది. భవిష్యత్తులో ద్వాపర యుగంలో విష్ణువు శ్రీకృష్ణ పరమాత్మగా అవతరిస్తాడు. ఆ కాలంలో మీరందరూ ఆయనకు భార్యలుగా ఉంటారు. ఆ జన్మలో మీ కోరిక సిద్ధిస్తుంది'' అని వరమిచ్చాడు అష్టావక్రుడు.

వెళ్ళిపోతూ ఆయన వక్రరూపం చూసి ఆక్షేపణగా నవ్వారు చాపల్యం ఉన్న ఆ అప్సరసలు. తనను చూచి నవ్వేటప్పటికి ఆయనకు కోపం వచ్చింది. ''నా దగ్గరే వరం తీసుకుని నన్నే చూచి ఆక్షేపించి నవ్వుతున్నారా? దీనికి ప్రతిఫలంగా ఒక శిక్ష కూడా అనుభవించండి. శ్రీకృష్ణ పరమాత్మ భార్యలుగా మీరు పుట్టిన కాలంలో మీరు ఉండగానే ఆయన అవతారం చాలించి వెళ్ళిపోతాడు. ఆయన భార్యలుగా ఉండే మీరు వైధవ్యమే కాకుండా, సామాన్యమైన నిషాదులు – దొంగల చేతులలో అవమానం కూడా పొందుతారు. ఇదే మీకు శిక్ష'' అని శపించాడు వాళ్ళను.

ఆ కారణం చేతనే కృష్ణపరమాత్మ అవతారం చాలించిన తరువాత, అర్జునుడు కృష్ణుడి యొక్క భార్యలను, అంతఃపుర కాంతలందరినీ తీసుకుని వెడుతుంటే దోపిడీ దొంగలు వచ్చి వాళ్ళ నగలను, ధనాన్ని దోచుకున్నారు. వెంబడి ఉన్న అర్జునుడు కూడా ఏమీ చేయలేకపోయాడు. వాళ్ళను జయించలేకపోయాడు. అస్త్ర శస్త్రాలేవీ జ్ఞాపకం రాలేదు. దానికి కారణం అష్టావక్రుడి శాపమే.

('వీళ్ళు అష్టమహిషులా? వేరేవాళ్ళా?' – అని సందేహం కలగవచ్చు. ఆయనకు అష్టమహిషులే కాక అనేకమంది భార్యలు ఉన్నారు. అయితే ఈ శాపగ్రస్తులైన అప్సరసలు అష్టమహిషులలోని కొందరు కావచ్చు. ఆయన అవతార సమాప్తి తరువాత అష్టమహిషులలో ఒకరు ప్రాయోపవేశం చేశారు. ఒకరు యోగంతో శరీరాన్ని వదిలిపెట్టారు. కొందరు ఈ శాపవశాన అవమానం పాలయ్యారు).

అష్టావక్రుడు తండ్రి దగ్గరకు వెళ్ళి ''తండ్రీ! నాకు ఆజన్మాంతమూ ఉండే బ్రహ్మచర్య దీక్ష ప్రసాదించు. అష్టావక్రుడినయిన నాకు వివాహం ఎలా అవుతుంది?'' అని అడిగాడు. అప్పుడు ఏకపాదుడు ''నాయనా! నీ అష్టావక్రత్వానికి నేనే కారణం. ఏదో క్రోధంలో ఎనిమిది వంకరలతో పుట్టమని నిన్ను శపించాను. నువ్వు తల్లి గర్భంలో ఉండి నన్ను, నా బోధనా పద్ధతిని ఆక్షేపించటం చేత కోపం వచ్చి ఆ పని చేశాను. నీవంటి మహాత్ముడు నా కడుపున పుట్టటం నాకే గర్వకారణం. నా తపోబలంతో నీ అష్టవంకరలు తీరుస్తాను. నువ్వు యోగ్యుడివై, అందమైన శరీరంతో మంచి ఉత్తమురాలైన స్త్రీని వివాహం చేసుకుని సుఖపడవచ్చు'' అని

వరమిచ్చి ఒక నదిని చూపించాడు ఆయన. అతడి తలమీద చెయ్యి పెట్టి ఆశీర్వదించి, ఆ నదిలో స్నానం చేసి రమ్మని, తన తపస్సును ఆ నీళ్ళలో ధారపోశాడు – తండ్రి. ఆ నీళ్ళలో స్నానం చేసి బయటకి వచ్చేటప్పటికి అష్టావక్రుడి శరీరం అష్ట వంకరలు పోయి, సుందరంగా మారింది.

ఆ తరువాత ఆయన వివాహం చేసుకున్నాడు. అయితే ఆయన వివాహం గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. ఆయన వదాన్యుడు అనే ఒక బ్రాహ్మణుడి దగ్గరకు వెళ్ళి, ఆయన కుమార్తె అయిన సుప్రభ అనే కన్యను తనకిచ్చి వివాహం చేయమని అడిగాడు. వదాన్యుడు అంతకు పూర్వమే అష్టావక్రుడి కీర్తి బాగా విని ఉన్నాడు. ఆయన చరిత్ర లోకమంతా తెలుసు. అయినా సరే ఆయన మహత్తు గొప్పదని లోకానికి చాటి చెప్పాలి కాబట్టి – అందులోనూ తన అల్లుడి గొప్పదనం అందరికీ తెలియాలి అనుకుని – అతనికి ఒక పరీక్ష పెట్టాడు. ఆయన అష్టావక్రుడితో ''నీకు నా కుమార్తెను తప్పకుండా ఇస్తాను. నీకంటే యోగ్యుడెవరున్నారు? నువ్వు ఉత్తరదిశగా వెళ్ళి కుబేరుడి నగరం దాకా వెళ్ళి ఆ నగరం చూడాలి. అది దాటి ఇంకా ఉత్తరంగా హిమవత్పర్వత సానువులన్నీ దాటి ఇంకా పైకి వెళ్ళి కైలాసం చేరుకుని పార్వతీ పరమేశ్వరుల దర్శనం చేసుకుని రావాలి. ఆ తరువాత అక్కడ ఉన్న కదంబవనం చేరుకుని అక్కడ రత్నఖచిత సింహాసనంపైన కూర్చుని ఉండే ఒక జగదేక సుందరిని దర్శించి రావాలి. అప్పుడు వెంటనే పెళ్ళి చేస్తాను'' అన్నాడు.

అష్టావక్రుడు అందుకు ఒప్పుకున్నాడు. ఆయనకు ప్రయాణానికి సన్నాహాలంటూ ఏమున్నాయి? అలాగే దండం, కమండలం పట్టుకుని వెళ్ళిపోయాడు. అష్టావక్రుడు వస్తున్నాడని తెలియగానే, కుబేరుడి ఆజ్ఞపై అతడి సేవకులు వచ్చి ఆయనకు ఆహ్వానం పలికారు. సర్వోపచారాలు చేశారు. కుబేరుడు చాలా ధనవంతుడు. సేవకులను, సేవికలను ఇచ్చాడు. వీటికి ఆయన ఏమీ చలించలేదు. అలాగు నిష్ఠగా ఉన్నాడు. అలా ఒక సంవత్సర కాలం గడిపాడు. మనసు ఏమీ చలించలేదు. కైలాసానికి వెళ్ళి దూరం నుంచి పార్వతీ పరమేశ్వరుల దర్శనం చేసుకున్నాడు. అక్కడ నుంచి ఇంకా ఉత్తరానికి ఆకాశమార్గాన వెళ్ళాడు. అక్కడ నీపవనం ఉంది. ఆ మధ్యలో ఒక స్త్రీ కూర్చుని ఉంది. ఆమె పరాశక్తి యొక్క అంశలో ఉంది. ఆమె ఈతడిని బాగా పరీక్షించింది. సమస్త రాజోపచారములు అన్నీ చేసి తనను వరించమని కోరింది. అతడిని గట్టిగా నిర్బంధించింది. ''అది అధర్మం – నేను అలా చేయను. నాకలాంటి కోరిక లేదు. మా దేశంలో నేనొక కన్యకను వరించాను. అక్కడికి వెళ్ళి ఆమెను పెళ్ళి చేసుకోవడం కోసమని నిన్ను చూచి వెళుతున్నాను. నాకు కాబోయే మామగారు పెట్టిన పరీక్ష ఇది. కాబట్టి ఇక్కడ మీతో నాకేమీ సంబంధం లేదు. మీరేమిచ్చినా, ఏమీ ఇవ్వకపోయినా నాకేమీ పర్వాలేదు. నేను వచ్చిన పని అయిపోయింది. వెళ్ళిపోతాను'' అన్నాడు.

ఆయన నియమ నిష్ఠలకు మెచ్చుకుని ఆమె అతడికి వరాలను ఇచ్చింది. ''నీ బోధలు అమోఘమయిన జ్ఞానాన్ని ఇవ్వగలిగిన శక్తివంతములయి ఉంటాయి. నీ బోధలు చదివినవారికి జ్ఞానోదయం అవుతుంది. జగత్ప్రసిద్ధమైన కీర్తిని సంపాదించి నువ్వు జగత్పూజ్యుడవు అవుతావు. బ్రహ్మతుల్యుడిగా నిన్ను పూజిస్తారు. నువ్వు బ్రహ్మజ్ఞానిగా ఖ్యాతి పొందుతావు'' అని చెప్పి ఆవిడ ఆయనను పంపించింది.

ఆయన తిరిగి వచ్చి పెళ్ళి చేసుకున్నాడు. ఏకపాదుడు తన కొడుకు యొక్క కీర్తి విని సంతోషించాడు. సుప్రభ, అష్టావక్రుల వివాహం బాగా జరిగింది. కుబేరాదులు అందరూ వచ్చి ఆశీర్వదించారు. దేవతలు కూడా వారి వివాహానికి వచ్చి ఆశీర్వదించారట.

ఆ తరువాత ఆయన చిరకాలం అనేకమందికి బోధ చేశాడు. 'అష్టావక్ర సంహిత' అనే గ్రంథం అష్టావక్రుడి బోధనలతో నిండి ఉంది. జనకమహారాజు కొలువులో ఆయన చెప్పినటువంటి – సద్వస్తువును గురించినటువంటి, మోక్షవస్తువును గురించిన – విజ్ఞానమంతా ఈ అష్టావక్ర సంహిత అనే పేరుతో ఉంది. అది నిర్గుణమైన బ్రహ్మ వస్తువును ప్రతిపాదిస్తుంది. ఒక మార్గం, గమ్యస్థానం ఏమీ ఉండవని ప్రతిపాదన. ఎందుకు ఉండదు అంటే ''బ్రహ్మవస్తువును చేరటానికి నీవు బ్రహ్మేతర పదార్థమయితే నీవు ఎన్నడూ చేరలేవు. బ్రహ్మేతర పదార్థం కాకపోతే నువ్వు బ్రహ్మవే అన్నమాట. అప్పుడిక చేరటమనేది లేదు'' అని అర్థం.

మిథ్యాభూతమైన శరీరము, మిథ్యాభూతమయినటువంటి మనస్సు, ఇంద్రియములు ఇవేవో మనను బాధిస్తున్నట్లు ఒక భావన. వీటితో సాధనతో మనుష్యుడు ఈశ్వరుడనే గమ్యస్థానానికి చేరుకుంటాడు అనేటటువంటి ఒక కల్పన. అందుకొరకు ఒక మార్గాన్ని కల్పించుకోవటం – ఇవన్నీ కూడా మిథ్య అయినపుడు, సర్వ సాధనలు మిథ్య మాత్రమే అవుతాయి అని మనం ఒకసారి చెప్పుకోవడం జరిగింది. 'అష్టావక్ర సంహిత'లో కూడా గమ్యస్థానాలే లేవని, అంతా బ్రహ్మమయమే అని ఆయన చెప్పాడు.

అనేక వైదిక గ్రంథములకు బోధకునిగా, కర్తగా ఆయనను చెబుతారు. అవన్నీ నశించిపోయాయి, నేడు దొరకటంలేదు. ఆయన గీత, సంహిత మాత్రమే ఉన్నాయి.

**–శివానంద సువిధ ఫౌండేషన్ సౌజన్యంతో**

**(సశేషం)**



# నాగపంచమి

– చిల్లర సీతారామారావు

శ్రావణ శుక్ల పంచమి నాడు నాగపంచమి పర్వమును జరుపుకుంటారు. గాలిని ఆహారముగా స్వీకరించి జీవించే నాగులను ఆరాధించడము అనాది నుండి వస్తున్నది. పురాణేతిహాసాలలో నాగులకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. విష్ణుమూర్తి ఆదిశేషుడు అను నాగును తన శయ్యగా మార్చుకున్నాడు. శివుడు భుజంగములను తన ఆభూషణములుగా చేసుకున్నాడు. విఘ్నేశుడు నాగులను యజ్ఞోపవీతముగా చేసుకున్నాడు. నాగుల జననం కశ్యప ప్రజాపతి, కద్రువల వల్ల జరిగింది.

సాధారణంగా నాగులు రజోగుణ స్వభావం కలిగి ఉంటాయి. వీటికి కోపము చాలా ఎక్కువ. చూసి గాని, చూడకుండా గాని వాటి తోకను తొక్కినట్లయితే అవి వెంటనే కాటు వేస్తాయి. ఇటువంటి పామును ఆప్తులలో చేర్చుకుని పాటలు పాడటం వినోదకరమైన వింత.

"నాగస్వరం పాడితే నాగులకు నిద్ర
పుట్టలోనుంటేను భూములకు ముద్ర
అమావాస పున్నాల మసగలే సుద్ద
పాటిమీదాకొస్తే కక్ష కట్టేను
బూకరించుచు పడగ బుస కొట్టేను
గుడిలో నాగులు కొల్చిన దేవుడు"

నాగులు కృషి సంపదను కృషి నాశక జీవుల నుండి కాపాడుతాయి. జ్యేష్ఠ ఆషాఢ మాసములందు వర్షం ఆరంభమవుతుంది. రైతులు భూమిని దున్ని దుక్కి చేసుకుంటారు. తరువాత విత్తనాలు నాటుతారు. విత్తిన విత్తనాలు పైరై శ్రావణమాసపు అంతానికి పుష్పించి ఫలించడం ప్రారంభిస్తాయి. భూమిలో తిరుగుతూ ఎలుకలు పంటను నాశనం చేస్తాయి. పంటలను నాశనం చేసే ఎలుకలను నాగులు తమ ఆహారముగా స్వీకరించి రైతులకు పరోక్షంగా సహాయపడుతుంటాయి. అందువలననే నాగులను తమ ఆప్త

వర్గములో చేర్చుకొని నాగులకు సలహాలిస్తూ గృహిణులు ఇలా పాడుకుంటారు.

**"పుట్టలో నాగన్న బూచి నాగన్న**
**ఎండలో పడుకోకు వెర్రి నాగన్న**
**కలిగినోరి కోడళ్ళు గర్వవంతూలు**
**కల్లాపి జల్లేరు కాళ్ళ చిమ్మేరు**
**ఎంగిళ్ళు జల్లేరు భంగపుచ్చేరు**
**అటు బోకు నాగన్న చాకిరేవులకు**
**చాకిరేవులలోన చేరి పడుకుంటే**
**సాలిపరుగుడని సంపేరు నాగు**
**అటు బోకు నాగన్న చెరుకు పొలములకు**
**చెరుకు పొలములలోన చేరి పడుకుంటే**
**నల్లచెరుకు అని నరికేరు నాగు"**

నాగులు పాతాళ లోకములో నివసిస్తాయి. నాగుల రాజధాని భోగవతి. సాధారణంగా నాగులు పుట్టలలో ఉంటాయని చెబుతుంటారు. కాని పుట్టల అడుగున భూమికి రంధ్రాలు ఉండి చాలాదూరం సొరంగంలా ఉంటుంది. అక్కడ మాత్రమే నాగులు నివసిస్తుంటాయి.

నాగపంచమి నాడు నాగులను పూజించడానికి రెండు కారణాలు చెబుతుంటారు. ఆదిశేషుడు భూభారాన్ని మోయడాన్ని, తనకు సేవ చేయడం మొదలైనవి విష్ణుభగవానునకు ఆనందము కలిగించాయి. ఆదిశేషుడిని వరమును కోరుకొమ్మని అడిగాడు విష్ణుభగవానుడు. అప్పుడు ఆదిశేషుడు ప్రజలు శ్రావణ శుక్ల పంచమి నాడు నాగులను పూజించేటట్లు వరమును ప్రసాదించమని అడిగాడు. ఆదిశేషుడి ప్రార్థనను మన్నించిన విష్ణుభగవానుడు ఆదిశేషా! నీవు కోరిన కోర్కెను ప్రసాదిస్తున్నాను అని పలికాడు. ఆ రోజు నాగులను పూజించిన వారికి సర్పభయము ఉండదు అని వరము అనుగ్రహించాడు.

క్షీరసాగర మథన సమయంలో వెలువడిన వాటిలో ఉచ్చైశ్రవము ఒకటి. తెల్లని తెలుపు రంగు కలిగిన అశ్వం అది. ఒకసారి కశ్యపుని భార్యలు కద్రువ, వినతల మధ్య ఒక వాదం జరిగింది. అశ్వం తెల్లని తెలుపే కాని తోక మాత్రం నల్లని నలుపు అన్నది కద్రువ. కాదు అశ్వము అంతా తెలుపే అన్నది వినత. దీనిమీద వాద వివాదాలు జరిగాయి. చివరకు ఇద్దరూ పందెం వేసుకున్నారు. ఎవరు ఓడిపోతే వారు గెలిచినవారికి దాసి కావాలని అన్నది ఆ పందెం. కద్రువ తన పంతం నెగ్గించుకోవడానికి కొడుకులను సహాయం అడిగింది. వారు సూక్ష్మరూపం ధరించి గుర్రపు తోకను చుట్టుకుని నలుపు రంగుగా కనిపించాలి. అందుకు కొడుకులు అంగీకరించలేదు. దానితో కద్రువ ఆగ్రహముతో భవిష్యత్తులో పాండవ వంశపు రాజు జనమేజయుడు తలపెట్టే సర్పయజ్ఞములో పడి భస్మమైపోదురు గాక అని కద్రువ కొడుకులను శపించింది. తల్లి శాపమునకు భయపడి కొందరు నాగులు కద్రువకు సాయపడ్డారు. మరికొందరు నాగులు తల్లి శాపమునకు భయపడి వాసుకి నేతృత్వములో బ్రహ్మను కలిసి 'తల్లి శాపము నుండి మమ్మల్ని రక్షించండి' అని ప్రార్థించారు. అప్పుడు బ్రహ్మ యాయవార వంశస్థుడు తపస్వి జరత్కారుడు మీ సోదరికి భర్త అవుతాడు. ఆ దంపతులకు ఆస్తీకుడనే పుత్రుడు కలుగుతాడు. ఆ ఆస్తీకుడే మిమ్ములను రక్షిస్తాడు అని శాప విమోచనం తెలియచేశాడు. అలా బ్రహ్మ పంచమి తిథినాడు నాగులను అనుగ్రహించాడు కాబట్టి ఈ తిథి నాగులకు అత్యంత ప్రియమైనది. ఆ రోజు నాగులను పూజించిన వారికి సర్పముల వలన భయముండదు. ఆ రోజు శక్త్యానుసారం బంగారం, వెండి, కలప, మృత్తిక మొదలగు వాటితో అయిదు ప్రతిమలను చేయించాలి. వాటిని ఆవు పాలతో గాని, పాయసముతో గాని పూజించాలి. సద్బ్రాహ్మణుని భోజనానికి పిలిచి దక్షిణ తాంబూలాదులతో సత్కరించాలి.

సర్పయాగము తరువాత నాగులు ఆర్యుల మధ్య సత్సంబంధాలు నెలకొన్నాయి. నాగులు ఆర్యుల దేవతలను పూజించడం ఆనాటి నుండి మొదలయింది. ఉదయము నిద్ర లేచినప్పుడు, సాయంత్రపు సమయములలో ప్రముఖ నాగులను స్మరించుకోవాలి.

**శ్లో ॥ "అనంతం, వాసుకిం, శేషం పద్మనాభంచ కంబలమ్**
**శంఖపాలం, ధార్తరాష్ట్రం, తక్షకం కాలియం, తథా**
**ఏతాని నవనామాని నాగానాంచ మహాత్మనామ్**
**తస్మై భయ విషం నాస్తి సర్వత్ర విజయీ భవేత్"**

అనే శ్లోకాన్ని పఠించినట్లయితే సర్పభయం ఉండదని, సర్వత్రా విజయం లభిస్తుందని ప్రజల ప్రగాఢ విశ్వాసం.

నాగులు తమ ఆత్మ రక్షణ కొరకే కాటు వేస్తుంటాయి. కారణం లేకుండా అవి ఎవరి జోలికీ పోవు. సర్పజాతికి ప్రత్యక్షముగా గాని, పరోక్షంగా గాని అపకారము చేయకూడదు. పాము పుట్టలను ధ్వంసం చేయడం, వాటిని హింసించడం వంటి చర్యలు నాగదోషం కలగడానికి కారణమవుతాయి. దీనివలన కలిగే పరిణామాలు అశాంతికరం గాను, దుఃఖప్రదంగాను ఉంటాయి.

శ్రావణ శుక్ల పంచమి నాడు నాగులను పూజించాలి. శ్రావణ శుక్ల పంచమి యందు ద్వారమునకు ఇరువైపులా గోమయముతో సర్పాకారములను వేయాలి. వాటిని శాస్త్ర ప్రకారము పెరుగు, గరిక, దర్భ, గంధ, పుష్పహారములతో పూజించాలి. బ్రాహ్మణులను తృప్తి పరచాలి. ఈ విధముగా పూజించినవారికి ఎచ్చటను, ఎప్పుడును సర్పభయముండదు.



నాగపంచమి నాడు స్త్రీలు శిరః స్నానమాచరించి, ఉపవాసముండి, పుట్టల దగ్గరకు వెళ్ళి, నాగదేవతలకు పూజలు జరిపి, పుట్టలలో పాలు పోసి, ప్రదక్షిణ నమస్కారములు చేయాలి. నాగమాత శాపం వలన నాగులకు శరీరం ఎప్పుడూ దహిస్తూనే ఉంటుంది. పుట్టలలో పాలు పోసినప్పుడు ఆ పాలు నాగుల శరీరము మీద పడినప్పుడు వాటికి శాంతి కలుగుతుంది. తమ పుట్టలలో పాలు పోసి శాంతిని కలిగించిన కుటుంబ వాసులను నాగులు సర్వదా రక్షిస్తుంటాయి. పూజా నమస్కారాల తదనంతరం నాగులను ఇలా ప్రార్థించాలి.

**శ్లో ॥ "సర్వే నాగాః ప్రీయంతాం మెయెకే చిత్ పృథ్వీతలే**
**యేచహేలి మరీచిస్థావెఽస్తరే దివి సంస్థితాః**
**యేన దీషు మహానాగా యే సరస్వతి గామినః**
**యేచవాపీ తడాగేషు తేషు సర్వేషు వైనమః**

పృథివి, గగనం, స్వర్గం, సూర్యకిరణం, సరోవరం, వాపీ కూప తటాకములందు సంచరించే నాగులు మమ్ములను కరుణించి రక్షించు గాక. వాటికి సర్వదా నమస్కరిస్తూనే ఉంటాము.

నాగులను పూజించడానికి మంచిగంధం, పసుపు, వేపుడు బియ్యం, చిక్కుడుగింజలు, వేయించిన ఉలవలు మున్నగునవి పూజా ద్రవ్యములు కాగా, దీపారాధన, కర్పూర నీరాజనం, ఫలాలు, భక్ష్యాలు, నైవేద్యాలు మున్నగునవి పూజా కృత్యాలు. ఈ రోజున ఉడకబెట్టిన పదార్థములను తినాలి. నాగపూజ అయిన తరువాత ఇంటి పెద్ద పండుగ పుట్టు పూర్వోత్తరాలను కుటుంబీకులకు తెలియజేస్తాడు. నాగులకు సంబంధించిన కథలు చాలా ఉన్నాయి. అందులో ఒక కథను స్మరించుకుందాం.

పూర్వకాలంలో ఒక రైతు ఉండేవాడు. ఒకసారి ఆ రైతు పొలములో నాగలితో దున్నుతుండగా నాగలి మొన తగిలి బొరియలో ఉన్న నాగు పిల్లలు హతమయినాయి. నాగమాత తిరిగి వచ్చి తునా తునకలయిన తన పిల్లల శరీర ఖండాలను చూచింది. ఆమెకు దుఃఖముతో పాటు ఆగ్రహము కూడా కలిగింది. ఆ ఆగ్రహముతో రైతు ఇంటికి వెళ్ళి నిదురలో ఉన్న ఆ కుటుంబ సభ్యుల నందరినీ కాటు వేసి సంహరించింది. అయిననూ ఆ నాగమాత కోపము చల్లారలేదు. పొరుగూరిలో ఉన్న రైతు కూతురిని కూడా సంహరించుదామని పొరుగూరికి వెళ్ళింది. నాగమాత వెళ్ళే సమయానికి రైతు కూతురు ఆదిశేషుడిని పూజిస్తూ ఉంది. నాగమాత పూజ పూర్తయ్యే వరకు ఉంది. తరువాత నైవేద్యమును స్వీకరించింది. దానితో కోపము తగ్గిపోయింది. రైతు కూతురికి ఎదురుపడి నీ పుట్టింటి వారినందరినీ చంపేశాను అని చెప్పింది. ఆ వార్త విని రైతు కూతురు చాలా దుఃఖించింది. తన పుట్టింటి వారినందరినీ రక్షించమని నాగమాతను ప్రార్థించింది. ఆమె ప్రార్థనను మన్నించి నాగమాత అమృతం ఇచ్చింది. ఆ అమృతంతో రైతు కూతురు తన పుట్టింటి వారిని కాపాడుకుంది.

నాగదేవతలను పూజించే గృహములందు అరిష్టములుండవు. వంశవృద్ధి కలిగి, సుఖ శాంతులతో, ఆయురారోగ్యములతో చిరకాలం మనగలుగుతారు.

శ్రావణ శుక్ల పంచమినాడు వినత తనయుడు గరుత్మంతుడు తన తల్లి దాస్య నివారణ కొరకు స్వర్గం నుండి అమృతమును తెచ్చి సవతి తల్లి కద్రువకు ఇచ్చాడు. కనుక పంచమిని గరుడ పంచమి అని కూడా పిలుస్తారు. నాగపంచమి నాడు భూమిని దున్నరాదు. తవ్వరాదు. చెట్లు నరకరాదు. ఫలాలను, కాయలను కోయరాదు. పూజల ద్వారా సంతృప్తి చెంది మానవులకు శుభములను కలిగించు నాగులను ప్రార్థించుకుంటూ, వాటి ఆశీస్సులతో ఫలవంతమైన జీవితాన్ని పొందుదాము.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 421. బర్హి బర్హ విభూషణాయ నమః

నెమలి పింఛము అలంకారముగ గలవాడు – కృష్ణుడు.

నెమలి పింఛము విభూషణముగా గల్గినవాడు అగు కృష్ణునిగ జన్మించిన విష్ణువు యొక్క అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 422. పార్థ కౌరవ సంధాన కారిణే నమః

కౌరవ పాండవుల మధ్య రాయబారము నిర్వహించి, వారికి సంధి కూర్చుటకై ప్రయత్నించిన వాడు కృష్ణుడు. కుంతికి పృథ అను పేరు కలదు. పృథ యొక్క పుత్రులు పార్థులు. పార్థులనగా కుంతి యొక్క పుత్రులైన ధర్మరాజు, భీముడు, అర్జునులు. కాని పార్థ శబ్దము అర్జునునికే రూఢి అయింది.

రాజ్య భాగమునకై కౌరవ పాండవుల మధ్య యుద్ధము తప్పదని తెలిసియు ''అయినను పోయి రావలయు హస్తినకున్'' అని వారికి సంధి కూర్చుటకై ప్రయత్నం చేసినాడు కృష్ణుడు.

కృష్ణుని తర్వాతి అవతారపురుషుడైన వేంకటేశునకు నమస్కారము.

## 423. దుశ్శాసనాంతకాయ నమః

దుష్టములగు శాసనములను అంతమొందించినవాడు కృష్ణుడు.

దుష్టములగు శాసనములు చేయువారు దుష్టులగు రాజులు వారిని అంతమొందించినవాడు కృష్ణుడు.

దుశ్శాసనాంతకుడైన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.

ఈ నామమునకు దుశ్శాసనుని (దుర్యోధనుని తమ్ముడు) వధించిన వాడు భీముడు అని అర్థము చెప్పవచ్చును. కాని ఇచట భీముని ప్రసక్తి అసంగతం అవుతుంది.

## 424. బుద్ధాయ నమః

మహా యోగులచే తెలియబడువాడు – విష్ణువు.

త్రిపురాసురుల స్త్రీల మానభంగము చేయుటకై బుద్ధావతారమును ధరించినవాడు – విష్ణువు. ఈ బుద్ధుడు కృతయుగంలోని వాడు. కలియుగంలోనివాడు గౌతమబుద్ధుడు. ఇతడు విష్ణువు యొక్క అవతారము కాదు. వైష్ణవుల దశావతారములలో బుద్ధుడు లేడు. ముగ్గురు రాములు ఉన్నారు. పరశురామ, శ్రీరామ, బలరాములు.

బుద్ధునిగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 425. విశుద్ధాయ నమః

నిర్మలుడు, నిష్పాపుడు, నిష్కళంకుడు అయినవాడు విష్ణువు.



**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**



అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము



విశుద్ధుడైన విష్ణుదేవుని అర్చావతారము అయిన వేంకటేశునకు నమస్కారము.

## 426. సర్వజ్ఞాయ నమః

యః సర్వజ్ఞః స సర్వవిత్ అని ముండకోపనిషత్తు. సర్వం యదయమాత్మా అని సాక్షిగా చూస్తున్నవాడు విష్ణువు అని బృహదారణ్యకోపనిషత్తు.

అన్నియు తెలిసినవాడు సర్వజ్ఞుడు. విష్ణువు.

సర్వజ్ఞుడు అని శివునికి పేరు కలదు. ''సర్వజ్ఞ నామధేయము శర్వునకే'' అని శ్రీనాథుని ప్రయోగము. సర్వజ్ఞః సర్వహృదయైక నివాసః అని శివస్తుతి.

గౌతమ బుద్ధుని పేర్లలో ఒకటి సర్వ విషయ జ్ఞాత.

సర్వజ్ఞః సుగతో బుద్ధో అని అమర నిఘంటువు. సర్వజ్ఞుడు = విష్ణువు, శివుడు, బుద్ధుడు.

## 427. క్రతుహింసా వినిందకాయ నమః

గౌతమబుద్ధుడు యజ్ఞములలో జరిగే పశు హింసను పాప కార్యమని నిందించినాడు. విష్ణుని తొమ్మిదవ అవతారము. క్రతు హింసా వినిందకుడైన బుద్ధునిగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము. యజ్ఞో వై విష్ణుః యజ్ఞమే విష్ణువు. విష్ణువు యజ్ఞ స్వరూపుడు.

దశావతారములలో బుద్ధావతారము ఒకటి. వైష్ణవుల దశావతారములలో బుద్ధుడు లేడు. ముగ్గురు రాములు – పరశురామ – శ్రీరామ – బలరాములు ఉన్నారు.

క్రతు హింసను నిందించిన బుద్ధునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 428. సర్వశాస్త్ర విశారదాయ నమః

సర్వశాస్త్రములందు ప్రవీణుడు. ఉత్తమోత్తమ విద్వాంసుడు. సర్వ శాస్త్రజ్ఞుడు. భగవంతుడగు విష్ణువు. సర్వశాస్త్ర విశారదుడయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 429. నిర్వికారాయ నమః

వికారములు చెందక ఎల్లప్పుడు ఏకరూపుడై ఉండువాడు. విష్ణుదేవుడు.

నిర్వికారుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

విష్ణుదేవుడు బుద్ధావతారమున త్రిపురాసురుల భార్యలు బిగియార కౌగలించుకొన్నను నిర్వికారముగా నున్నాడు.

## 430. నిర్మమాయ నమః

మమకారము లేనివాడు. సర్వజన సముడు భగవంతుడగు విష్ణువు.

భగవాన్ కృష్ణుడు శత్రు మిత్రుల యందు సమ దృష్టి గలిగి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసినాడు.

నిర్మముడైన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము.




**గత సంచిక తరువాయి**

అంతకుముందు వదిలిన బాణాలు – జలాలు వెల్లువలై పారాయి. చెలియలి కట్ట దాటలేదు – వెనక్కి వెళ్ళాయి. అదొక యోజన దూరం వెళ్ళాలి. ఎపుడూ లేని రీతిలో సముద్రం వెనక్కి పోయింది. అంటే సముద్రుడు పారిపోతున్నాడన్నట్లుంది. ధనుష్టంకారానికి ప్రకృతి స్పందించింది. పారిపోతున్న సముద్రునిపై బ్రహ్మాస్త్రం ప్రయోగించలేదు రాముడు. అది అధర్మం కదా. అంతలో సముద్ర మధ్యంలో సముద్రాధి దేవత లేచాడు. ఉదయాద్రిపై కనిపించే సూర్యునిలా కనిపించాడు.

స్నిగ్ధ వైఢూర్య కాంతుల శరీరంతో తేజరిల్లుతున్నాడు. రక్తమాల్యాంబరాలు ధరించాడు. పద్మపత్ర నేత్రుడు. సర్వపుష్ప మాలాలంకృతుడు. వక్షఃస్థలంలో ముత్యాలహారం. ఒంటిపేట హారానికి మధ్యలో ఒక రత్నం. అది కౌస్తుభమణికి తోబుట్టువు. గైరికాది ధాతువులతో మెరిసే హిమవత్ పర్వతంలా కనిపించాడు.

ఆయన చుట్టూ గంగ సింధు నదులు తిరుగుతున్నాయి. ధనుర్ధారి యైన రాముణ్ణి చూసాడు సముద్రుడు. నడిచాడు. వచ్చాడు. 'రామా' అని పిలిచాడు. తలపై దోసిలి దాల్చాడు. అంటున్నాడు.

భూమి, వాయువు, ఆకాశం, జలం, తేజస్సు (పంచ భూతాలు) తమ మర్యాదని అతిక్రమించవు. అది వాటి సహజ స్వభావం. నేను అగాధంగా ఉన్నాను. నన్నెవరూ దాటకుండా ఉన్నాను. అగ్నిదేవుడు చల్లగా ఉంటాడా? అలాగే అగాధంగా ఉన్నాను నేను. రామప్రభూ నీకు నిజం చెబుతాను. నాలో పెద్ద పెద్ద జల జంతువులున్నాయి. కోరికతో కాని, లోభంతో కాని, భయంతో కాని నేను స్తంభించలేను. అయినా నా చేతనైన సాయం చేస్తాను. నాలోని మొసళ్ళు, తిమింగలాలు ఇత్యాదులు బాధ పెట్టకుండా చూస్తాను. మీరు సముద్రం దాటవచ్చు. అయితే ఆవలి తీరం చేరాలంటే సేతువు నిర్మించాలి. దానికి దారి చూపుతాను.

విన్నాడు రాముడు. ''ఓ నదీపతీ! నా బాణం అమోఘం. తిరుగు లేనిది. అది బ్రహ్మాస్త్రం. ఇపుడెక్కడ వదలాలి. చెప్పు''.

బదులిస్తున్నాడు సముద్రుడు. ఒక ప్రదేశం ఉంది. అది ద్రుమకుల్యం. మనోహరమైంది. నాలో ఉత్తర దిశలో ఉంది. అనేకులు దస్యులు (దొంగలు), అభీరులు (గొల్లవాళ్లు) ఉన్నారక్కడ. వాళ్లు మహా భయంకరులు. భయంకర కార్యాలు చేస్తుంటారు. మహా పాపాత్ములు. అక్కడి స్వాదు జలాలు తాగుతుంటారు. వాళ్ల స్పర్శ నేను సహించలేకున్నాను.

రాఘవా! ఆ దివ్య శరాన్ని వారిపై ప్రయోగించు అన్నాడు.

విన్నాడు రాముడు. బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అది మండుతోంది. పిడుగులా శబ్దించింది. ద్రుమకుల్య ప్రదేశంలో పడింది. అక్కడి పాపాత్ములు భస్మమయ్యారు. దాని దెబ్బకి మహాధ్వని ఏర్పడింది. ఆ అస్త్రం రసాతలం చేరింది. అక్కడొక పెద్ద బావిగా ఏర్పడింది. అదే వ్రణకూపం అని ప్రసిద్ధికెక్కింది. అది ఎడారిగా మారింది. అక్కడి భూమికి వరమిచ్చాడు రాముడు. స్వాదుజలాలు ఎండిపోవు. అక్కడి పశువులకి మేత దొరుకుతుంది. నెయ్యి, పాలు, కందమూల ఫలాలు, తియ్యని తేనెలు, ఓషధులు దొరుకుతాయి – అది రాముని వరం. సంతోషించాడు సముద్రుడు. అంటున్నాడు రామునితో. ''శాంతుడా! నీ సేనలో నలుడు ఉన్నాడు. వాడు విశ్వకర్మ పుత్రుడు. ధైర్యశాలి. మహోత్సాహి. వాడు సేతువు నిర్మించగలడు. ఆ వంతెన కదలకుండా నిలుపుతాను'' – అంతర్ధానమైనాడు సముద్రుడు.

విన్నాడు నలుడు. లేచాడు. రామునికి నమస్కరించాడు. రామా! సముద్రుడు చెప్పింది నిజం. నా తండ్రి అనుగ్రహంతో సేతువు నిర్మిస్తాను. మందర పర్వతం మీద ఉంది నా తల్లి. విశ్వకర్మ వరమిచ్చాడు. తనలాంటి కొడుకు పుడతాడన్నాడు. ఆ విశ్వకర్మ ఔరసపుత్రుణ్ణి నేను. శిల్పవిద్యలో నా తండ్రి అంతటివాణ్ణి. సముద్రుడు చెప్పాడు. నాకు గుర్తు చేసాడు. నాకు నేను గొప్పలు చెప్పరాదు కదా. రామా! లోకంలో దండోపాయం శ్రేష్ఠమైంది. కృతజ్ఞత లేని వాళ్ల దగ్గర క్షమని చూపరాదు. సామ దానోపాయాలు పని చేయవు. సగర చక్రవర్తి వల్ల సముద్రుడు ఏర్పడ్డాడు. ఆ ఉపకారం మరచాడు సముద్రుడు. శిక్షిస్తాను అన్నావు. ఆ భయం పట్టుకుంది. లేచి వచ్చాడు. సేతు నిర్మాణానికి లేచి వచ్చాడు. నేనిపుడే నిర్మాణానికి పూనుకుంటాను అన్నాడు నలుడు.

## సేతువు

రామాజ్ఞ అయ్యింది. వేల వానరులు వచ్చారు. సంతోషించారు. గంతులేసారు. మహారణ్యంలోకి పోయారు. మద్ది, ఇనుమద్ది, చంద్ర, తాటి ఇంకా ఎన్నో రకాల చెట్లను పెళ్లగించారు. సముద్రంలో పడేసారు. కొన్ని వేళ్లతో, కొన్నిటిని వేళ్లు లేకుండా తెస్తున్నారు. పడేస్తున్నారు. మహా శిలల్ని పెరికారు. బండ్లమీద చేర్చారు. తెచ్చారు. సముద్రంలో పడేస్తున్నారు. కొందరు నూలుతాడు పట్టారు. కొందరు కొలబద్దలు పట్టారు. రాళ్లని సరి చేస్తున్నారు కొందరు. ఎక్కువ



తక్కువలు లేకుండా సమం చేస్తున్నారు కొందరు. పది యోజనాలు వెడల్పుగా కడుతున్నాడు నలుడు. కొన్ని రాళ్లని పచ్చగడ్డితో కడుతున్నాడు.

మొదటి రోజు 14 యోజనాలు. రెండో రోజు 20 యోజనాలు. మూడో రోజు 21 యోజనాలు. నాల్గో రోజు 22 యోజనాలు, ఐదవ రోజు 23 యోజనాలు. మొత్తం నూరు యోజనాల పొడవు. సువేలాద్రి హద్దుగా సేతు నిర్మాణం పూర్తయింది.

ఆ సేతువు ఆకాశం లోని స్వాతీ పథంలా కనిపించింది. అది రమణీయంగా ఉంది. కాంతిమంతంగా ఉంది. మిట్టపల్లాల్లేవు. వంకర టింకర్లు లేవు. సముద్రానికి పాపిటిలా ఉందా సేతువు. గంధర్వులు, సిద్ధులు, పరమర్షులు చూసారు. అలా వారధి కట్టడం – ఎవ్వరూ మనసులో ఊహించి ఉండరు. అంత త్వరగా నిర్మించ గలరని ఊహించి ఉండరు. అందుకే అది అద్భుత సేతువు. సర్వప్రాణి కోట్లు చూసాయి. ఆశ్చర్యపడ్డాయి.



గద పట్టాడు విభీషణుడు. శత్రువులు వస్తే చంపాలని సిద్ధమైనాడు. సుగ్రీవుడు అంటున్నాడు రామునితో. మీరు చాలా దూరం నడవాలి. అందుకు నీవు హనుమని అధిరోహించు. లక్ష్మణుడు అంగదుణ్ణి అధిరోహిస్తాడు. వాళ్లిద్దరూ ఆకాశ గమనులు. మిమ్మల్ని మోసుకెళ్తారు. రాముడు ధనుర్ధారుడైనాడు. సుగ్రీవ లక్ష్మణులతో అగ్రభాగాన పోయాడు. కొందరు వానరులు ఇరుప్రక్కల నడిచారు. కొందరు నీళ్లలో పడి లేచారు. అంతమంది దాటలేరు. అందుకు కొందరు తీరాన ఆగారు. కొందరు గరుత్మంతునిలా ఎగిరారు. ఆకాశంలో పోతున్నారు. అందరూ సింహనాదాలు చేస్తున్నారు. ఆ కోలాహల ధ్వనులకి సముద్ర ఘోష వినిపించలేదు.

అందరూ ఆవలి గట్టు చేరారు. ఫల మూలాలు, మంచినీరు దొరికే చోటు చూసారు. అక్కడ విడిది చేసారు. ఆ సముద్రం మీద సేతువు అద్భుతం. దుష్కరం. చూసారు దేవతలు, సిద్ధులు, చారణులు, మహర్షులు. దిగి వచ్చారు. మంగళ జలాలు తీసుకున్నారు. రాముణ్ణి సమీపించారు. వేర్వేరుగా రాఘవుణ్ణి అభిషేకించారు. అంటున్నారు ఇలా. నరోత్తమా! నీవు శత్రువుల్ని జయిస్తావు. ఈ భూమండలాన్ని కలకాలం పాలిస్తావు – అది వారి ఆశీర్వాదం.

## శకునాలు

కొన్ని శకునాలు చూసాడు రాముడు. అవి అప్పటికప్పుడు పుట్టుకొస్తున్నాయి. సౌమిత్రిని అక్కున చేర్చుకున్నాడు. తమ్ముడా చూడు శకునాల్ని. లోకానికి వినాశం దాపురించినట్లుంది. భవిష్యత్తు భయావహస్థితిని చేరుతుంది. జనక్షయాన్ని సూచిస్తున్నాయి. అకస్మాత్తుగా గాలి కలుషితమవుతోంది. దుమ్ము రేగుతోంది. భూమి కంపిస్తోంది. పర్వత శిఖరాలు వూగుతున్నాయి. చెట్లు నేలకూలుతున్నాయి. మేఘాల్లో పెద్ద చప్పుళ్ళు పుడుతున్నాయి. కర్ణకఠోరంగా అరుస్తున్నాయి తోడేళ్లు. పరమ దారుణంగా ఉంది సంధ్యాకాలం. సూర్యుని లోంచి నిప్పుకణాలు రాలుతున్నాయి. మృగాలు, పక్షులు సూర్యునికెదురుగా పోతున్నాయి. క్రూరంగా దీనంగా అరుస్తున్నాయి. భయం పుట్టిస్తున్నాయి. చంద్రకాంతి మాసిపోయింది. చంద్రుని చుట్టూ పరివేషం (గాలిగూడు) వేసింది. అది ఎర్రని కాంతితో ఉంది. మధ్య ఎర్రదనం రెట్టింపుగా ఉంది. సూర్యునిలో నల్లమచ్చ కనబడుతోంది. అది యుగాంతాన్ని సూచిస్తోంది. కాకులు, గద్దలు, రాబందులు కింద తిరుగుతున్నాయి. నక్కల కూతలు అతి భయంకరంగా ఉన్నాయి.

లక్ష్మణా యుద్ధం జరుగుతుంది. రాక్షసులు, వానరులు పరస్పరం కొట్టుకుంటారు. చస్తారు. రక్తంతో, మాంసంతో భూమి బురద బురద అయిపోతుంది. మనం ఇపుడే లంక పైకి దాడి చేయాలి.

## రామసేతు

ఒకప్పుడు ధనుష్కోటి నుంచి శ్రీలంకలోని తలైమన్నార్

వరకు రాతి వంతెన ఉండేది. అది 3 కి.మీ వెడల్పు, 30 కి.మీ పొడవు. అదే పాంబన్ బ్రిడ్జి. ఆడమ్స్ బ్రిడ్జి అన్నారు ఆంగ్లేయులు. అప్పటి మద్రాస్ నుంచి కొలంబోకు ప్రయాణ సౌకర్యాలుండేవి. 22-11-1964 లో వచ్చిన పెను తుఫాన్ కు ఆ బ్రిడ్జి కొట్టుకుపోయింది. రాముడు శరణాగతి చేసిన దర్భశయనం పత్తా లేకుండా పోయింది. దాదాపు 18 వేల మంది చనిపోయారు. అది అప్పటి అంచనా. మన దేశంలో తూర్పు కనుమల్లో మలయ పర్వతం ఉంది. అది శ్రీలంక వరకు వ్యాపించి ఉండేది. సముద్రం లంఘించిన హనుమ ఆ మలయ పర్వతం మీద దిగాడు. ఖండాంతర చలనం (continental drift) వల్ల ఆ పర్వతం కొంతభాగం సముద్రంలో మునిగిపోయిందన్నారు.

లోతు తక్కువగా ఉన్నచోట నలుడు వారధి నిర్మించాడు. అక్కడ ఇసుక దిబ్బలు ఎక్కువగా ఉండేవి. 30-35 అడుగుల లోతులో అవి ఉండేవి. అవి క్రమంగా గట్టిపడి సున్నపురాళ్ల గుట్టలైనాయి. వాటిమీద నానావిధ వృక్షాల కాండాలు వేసారు వానరులు. పెద్ద బండరాళ్లు వేసారు. ఆ రాళ్లు నీటిపై తేలుతూ ఉండేవి. వాటిని కదలకుండా చేసాడు నలుడు. ఆ వారధిని నలసేతు అన్నారు. అదే రామసేతు అన్నారు.

ధనుష్కోటి ప్రాంతం ఇపుడు జాలర్ల గ్రామమైంది. చేపలు పట్టడం వారి జీవనోపాధి. వారి వలల్లో ఆ తేలియాడే రాళ్లు పడుతుంటాయట. ఆ సేతు బంధనం తాత్కాలికమే. 17,50,000 సంవత్సరాల క్రితం నిర్మింపబడింది అన్నారు. అది ఎపుడు సముద్రంలో మునిగిపోయిందో తెలియదు. మళ్లీ దాన్ని నిర్మించాలని ప్రయత్నించారు. కాని ఎల్.టి.టి.ఇ వారి వల్ల సాధ్యం కాలేదు. ఆ మధ్య నీటిలో మునిగిన ఆ సేతువు కూల్చివేయాలని ప్రయత్నాలు సాగాయి. కాని రామభక్తుల ఆందోళనతో ఆ ప్రయత్నాలు ఆగిపోయాయి.

యోజనం అంటే మైలులో నాల్గవ భాగం. ఆ లెక్క ప్రకారం యోజనం 350 మీటర్లు. నూరు యోజనాలన్నప్పుడు 35,000 అంటే 35 కి.మీ అని అర్థం. దాని ప్రకారం చూస్తే శ్రీలంక 35 కి.మీల దూరంలో ఉంటుంది. అంతేకాని 800 కి.మీ కాదు. ధనుష్కోటి నుంచి అంటే దర్భశయనం నుంచి లంక 35 కి.మీ లోపలే ఉండాలి. ఈ విషయాలన్నీ నాసా వారి విశ్లేషణ. నెట్ లో చూడవచ్చు. సుగ్రీవుని నేతృత్వంలో వానర భల్లూకసేన వ్యవస్థితమైంది. అది నక్షత్ర కాంతులతో మనోహరంగా ఉంది. శరత్కాల పున్నమిలా ఉంది. లంకలోని భేరీ మృదంగ నాదాలు వినపడ్డాయి. విన్నారు వానర భల్లూక యోధులు. సహించలేకపోయారు. సింహనాదాలు చేసారు. అవి ఆ నాదాల్ని అణగదొక్కాయి. లంకా పట్టణ వాసులకి వినపడ్డాయి.

## సేనా విభాగం

లంకను చూసాడు రాముడు. మనసులో సీతమ్మ మెదిలింది. దుఃఖించాడు. నిట్టూర్చాడు. తేరుకున్నాడు. లంకా పట్టణ వైభవాన్ని చెప్పాడు తమ్మునికి. అవి నాలుగు శ్లోకాలుగా వర్ణించాడు వాల్మీకి. తర్వాత సేనలు విభజించాడు. అంగదుడు నలునితో సేన మధ్యభాగంలో ఉండాలి. ఋషభుడు సేనకు దక్షిణ భాగంలో ఉండాలి. సేనకు ఎడమ భాగంలో గంధమాదనుడు ఉండాలి. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి – ఈ ముగ్గురూ సేన కుక్షి స్థానంలో ఉండాలి. వెనక భాగంలో ఉండాలి సుగ్రీవుడు. నేను, లక్ష్మణుడు ముఖస్థానంలో ఉంటాం. అలా గరుడవ్యూహంలో నిలిచేట్లు సేనలు విభజించాడు రాముడు. మేఘాలతో ఆవృతమైన ఆకాశంలా ఉంది అపారమైన సేన.

ఇక శుక రాక్షసుని విడిచిపెట్టండి – అన్నాడు రాముడు సుగ్రీవునితో.



బంధ విముక్తుడైనాడు శుకుడు. క్షణాల్లో రావణుని చేరాడు. చూసాడు లంకాధిపతిని. నీ రెక్కలు ఏవి? చపలచిత్తులు వానరులు. వారి చేతికి చిక్కావా? అన్నాడు నవ్వుతూ. చెబుతున్నాడు శుకుడు.

మహారాజా! ఇక్కడినుండి వెళ్లాను. నీ సందేశం వినిపించాను సుగ్రీవునికి. నన్ను చూసారు వానరులు. చటుక్కున వచ్చారు. పట్టారు. నేల మీద పడేసారు. నన్ను నోరెత్తనీయలేదు. ఎందుకు కొడతారని అడగనివ్వలేదు. రెక్కలు విరిచారు. చావబాదారు. ఆ వానరులు తీక్షణ స్వభావులు. కోపిష్ఠులు. **(సశేషం)**



# జయదేవుని గీత గోవిందము

– డా॥ మారేపల్లి భువనేశ్వరి, 9550241921

గత సంచిక తరువాయి

మదన మహీపతి కనక దండ రుచి కేసరకుసుమ వికాసే ।
మిళిత శిలీముఖ పాటల పటల కృత స్మర తూణ విలాసే ॥ 4 ॥

ప్రతిపదార్థం: మదన మహీపతి = మన్మథుడనే రాజు యొక్క; కనక దండ రుచి = బంగారు కాడలు/ కర్రల కాంతితో (బంగారు గొడుగు కాడల వలె); కేసర కుసుమ వికాసే = నాగకేసర పూల వికాసము కలిగినది; మిళిత శిలీముఖ = తుమ్మెదలతో నిండిన (శిలీముఖం అంటే తుమ్మెద మరియు బాణం అని రెండర్థాలు); పాటల పటల = కలిగొట్టు (పాటలీ) పూల సమూహము చేత; కృత స్మర తూణ విలాసే = మన్మథుని యొక్క అమ్ములపొది (తూణీరము) వలె ప్రకాశిస్తున్నది.

విశేషాలు

రాజలాంఛనాల వర్ణన: కవి ఇక్కడ మన్మథుడిని ఒక సామాన్య వ్యక్తిగా కాక, 'మహీపతి' (రాజు) గా వర్ణించారు. రాజుకు ఉండే రెండు ముఖ్యమైన లాంఛనాలను ప్రకృతిలో దర్శించారు:

1. ఛత్రం (గొడుగు) = నాగకేసర పూలు.
2. ఆయుధశాల (అమ్ములపొది) = కలిగొట్టు పూలు.

శిలీముఖ – శ్లేషాలంకారం: ఇందులో 'శిలీముఖ' అనే పదం చాలా కీలకమైనది. దీనికి 'తుమ్మెద' అని ఒక అర్థం, 'బాణం' అని మరొక అర్థం. కలిగొట్టు పువ్వు గరాటు ఆకారంలో ఉండి అమ్ముల పొదిలా ఉంటే, అందులోకి వెళ్ళే తుమ్మెదలు బాణాల్లా కనిపిస్తున్నాయని కవి చమత్కారం.

రంగుల మేళవింపు: నాగకేసరాలలోని బంగారు రంగు, కలిగొట్టు పూల లేత ఎరుపు/పసుపు రంగు కలిసి వనానికి ఒక దివ్యమైన శోభను ఇస్తున్నాయి. ఇవి "బంగారు కామలతో కూడిన గొడుగుల్లా" ఉండటం ఈ శ్లోకంలోని ప్రధాన ఆకర్షణ.

ప్రాస మరియు లయ: "వికాసే – విలాసే" వంటి అంత్యప్రాసలు ఈ చరణానికి చక్కని సంగీత లయను చేకూర్చాయి.

తాత్పర్యం: వికసిస్తున్న నాగకేసర పువ్వులు మన్మథుని బంగారు దండలు గాను, తుమ్మెదలతో చుట్టు ముట్టబడిన పాటలీ పువ్వుల గుత్తులు అతని అమ్ముల పొదిగాను కనిపిస్తాయి.

మన్మధరాజుకు పట్టిన బంగారు గొడుగులా ఉన్న నాగకేసర పుష్పాలు (నాగమల్లి పూలు) గమ్మత్తయిన పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. పాటలీ పుష్పాలపై గుంపులుగా వాలిన తుమ్మెదలు, మన్మధుడి అంబుల పొదిలా కనిపిస్తున్నాయి.

వికసించిన మొగలి పూలు, తెల్లటి కరుణ వృక్షాల పూలు, మన్మధుడి 'కుంతలమనే' ఆయుధం లాగ, విరహుల గుండెలు రగులుస్తున్నాయి.

నాగకేసరాలు కల్గిన పూలు చూశావా! మన్మథుడనే మహారాజు బంగారంతో చేయించిన గొడుగు కర్రలా మెరుస్తూ వుంటాయి. ఈ కేసర కుసుమాలు బృందావనం నిండా వికసించి వున్నాయి. వనమంతా కుప్పలుకుప్పలుగా పాటలీపుష్పాలు రాలిపడి ఉన్నాయి. వాటిలోని తేనెకోసం తుమ్మెదలు కమ్ముకొంటుంటే ఆ దృశ్యం ఎలావుందో తెలుసా?

వియోగం అనుభవిస్తున్న వాళ్ళ మీద యుద్ధం ప్రకటించి బయల్దేరిన మన్మథుడి అమ్ముల పొదిలా వుంది. పూలు అమ్ముల పొదిలా వుంటే పైన కమ్ముకున్న తుమ్మెదలు నా కళ్ళకు మన్మథుని బాణాలే అనిపిస్తున్నాయి.

రాధా! ఇదంతా వసంతకాలం మహిమ! కృష్ణుడు



బృందావనంలో ఇలాంటి వసంతకాలంలో క్రీడిస్తున్నాడు. హాయిగా! ఆనందంగా!

భావార్థం - మన్మథుడనే రాజుకు పట్టిన బంగారు కామలతో ('కామ' అంటే ఇక్కడ గొడుగు యొక్క కాడ లేదా పట్టుకునే కర్ర అని) గూడిన గొడుగుల్లా నాగకేసర పుష్పాలు ప్రకాశిస్తుండగా, తుమ్మెదలనే బాణాలతో కూడిన మన్మథుని అమ్ముల పొదివలె కలిగొట్టు పుష్పాలు (సాధారణంగా వీటిని 'పాదిరి' లేదా 'పాటలీ' పూల రకంగా భావిస్తారు) వికసించి వుండగా సొంపు మీరిన వసంతకాలపు అరణ్యాలలో శ్రీకృష్ణుడు విహరిస్తున్నాడు.

**విగళిత లజ్జిత జగదవలోకన తరుణ కరుణ కృతహాసే ।**
**విరహి నికృంతన కుంత ముఖాకృతి కేతక దంతురితాశే ॥ 5 ॥**

ప్రతిపదార్థం: విగళిత లజ్జిత = సిగ్గు విడిచిన (లేదా తొలగిన లజ్జ కలిగిన); జగద్ అవలోకన = లోకాన్ని చూస్తున్న; తరుణ కరుణ = అప్పుడే వికసించిన తెల్లని గోరింట (కురవక) పూల చేత; కృత హాసే = చేయబడిన చిరునవ్వు కలిగినది (అంటే చిరునవ్వులు చిందిస్తున్నట్లున్నది); విరహి నికృంతన = విరహంతో ఉన్నవారిని సంహరించే (బాధించే); కుంత ముఖాకృతి = ఈటె (కుంతము) యొక్క మొన వంటి ఆకారం కలిగిన; కేతక = మొగలి పూల చేత (కేతకీ పుష్పాలు); దంతురిత ఆశే = దిక్కులన్నీ నిండి ఉన్నది (లేదా దిక్కులన్నీ రంపంలా పదునుగా ఉన్నది).

విశేషాలు : గోరింట పూలు - చిరునవ్వులు: 'కరుణ' లేదా 'కురవక' వృక్షం వసంతంలో తెల్లని పూలతో వికసిస్తుంది. ఆ వికాసం ఎంత స్వచ్ఛంగా ఉందంటే, యువతుల దంత ధావళ్యం (తెల్లని పళ్ళు) కనిపించేలా ఇచ్చే చిరునవ్వులా ఉందని కవి భావన.

మొగలి పూలు - ఈటెలు (కుంతములు): మొగలి రేకులు పొడవుగా, అంచులలో రంపంలా పదునుగా ఉంటాయి. అందుకే కవి వాటిని 'కుంతము' తో పోల్చారు. విరహ వేదనలో ఉన్నవారికి ఈ పూల తీక్షణత మరియు సుగంధం ప్రాణాంతకంగా అనిపిస్తుందని ఇక్కడ కవి చమత్కారం.

శబ్ద సౌందర్యం: ఈ శ్లోకంలో 'త', 'క', 'ర' అక్షరాల ప్రాస (విగళిత, లజ్జిత, అవలోకన, కుంత, కేతక, తరుణ, కరుణ, దంతురిత) చదవడానికి ఒక విధమైన గంభీరతను, వేగాన్ని ఇస్తుంది. "కృతహాసే - దంతురితాశే" వంటి అంత్యప్రాసలు వినడానికి ఎంతో మధురంగా ఉంటాయి.

తాత్పర్యం: వసంత ఋతువు యొక్క ప్రచండ ప్రభావానికి ప్రపంచమంతా సిగ్గులేనిదైపోయినట్లుంది. ఇది చూసి, కరుణామయమైన లేత చెట్లు పూత పూయాలనే నెపంతో నవ్వుతున్నాయి. చూడండి! విలపించే ప్రేమికుల హృదయాలను చీల్చే ఈటెల ఆకారంలో ఉన్న మొగలి పువ్వులు నలుదిక్కులా ప్రకాశవంతంగా వికసిస్తున్నాయి, వాటితో ఏకం కావడానికి దిక్కులు కూడా ఆనందంతో ఉప్పొంగిపోతున్నాయి.

తెల్లగా విరగబూసిన కరుణవృక్షాలు, విరహంతో బాధపడే

మనుషుల్ని చూపి "వీళ్ళు ఇంత సిగ్గు లేకుండా మదనవేదన పడ్తారేమిటా!" అని నవ్వుకొంటున్నాయి. అవును మరి... పువ్వులకు విరహం పడే అవసరం వుండదు కదా! ఎందుకంటే, భార్యావంతులైన మగపువ్వులు ఇలా పుష్పవతుల్ని మోసగించి దూరంగా తిరగవు! పువ్వులు మనుషులంటే అందుకే అంత హేళనగా నవ్వుకుంటున్నాయి!

వికసించిన మొగలిపువ్వుల మొనదేలిన సన్నని కొనలు వియోగం అనుభవిస్తున్న మదవతుల హృదయాలను చీల్చడానికి మన్మథుడు ఏర్పరచుకున్న 'కుంత' అనే ఆయుధంలా వున్నాయి. బృందావనం మొగలిరేకులతో దట్టంగా అలుముకొందా! అనిపిస్తోంది. వసంతకాల మహిమ! శ్రీకృష్ణుడు బృందావనంలో జవరాళ్ళతో క్రీడిస్తున్న కాలం...

భావార్థం - సిగ్గువీడి మదనోన్మదంతో లోకాన్ని చూస్తున్న తరుణుల చిరునవ్వుల్లా కరుణ పువ్వులు ఒప్పుచుండగా, విరహంతో బాధపడే వారి హృదయాలకు వాడి ఈటెల్లా ఉన్న మొగలి పువ్వులు పది దిక్కులా వెల్లివిరిసి ఉన్న ఈ వసంతంలో వనంలో శ్రీకృష్ణుడు విహరిస్తున్నాడు.

**మాధవికా పరిమళ లలితే నవ మాలతి జాతి సుగంధౌ ।**
**ముని మనసామపి మోహనకారిణి తరుణా కారణ బంధౌ ॥ 6 ॥**

ప్రతిపదార్థం - మాధవికా = మాధవీ లత (బండి గురువింద) యొక్క; పరిమళ = సుగంధము చేత; లలితే = మనోహరమైనది; నవ మాలతి = కొత్తవైన మొల్ల పూల (మల్లె జాతి) యొక్క; జాతి = జాజి పూల యొక్క; సుగంధౌ = మధుర పరిమళము కలిగినది; ముని మనసామ్ అపి = (ఇంద్రియాలను జయించిన) మునుల మనస్సులను సైతం; మోహన కారిణి = మోహపెట్టేది (చలింపజేసేది); తరుణ = యవ్వనవంతులకు (స్త్రీ పురుషులకు); అకారణ బంధౌ = ఎటువంటి కారణం లేకుండానే మేలు చేసే బంధువు వంటిది (ఈ వసంత కాలము).

విశేషాలు - సుగంధ త్రయం: కవి ఇక్కడ మూడు రకాల పూల పరిమళాలను మేళవించారు.

మాధవి = దీని వాసన చాలా గాఢంగా ఉంటుంది.

మాలతి = ఇది సుకుమారమైన మల్లె వాసన.

జాతి = ఇది ప్రశాంతతను ఇచ్చే జాజి పూల వాసన. ఈ మూడింటి కలయిక వల్ల వనమంతా ఒక అద్భుతమైన అత్తరు గదిలా మారిందని కవి భావన.

మునుల మనసు - మన్మథ ప్రభావం: సాధారణంగా మునులు బాహ్య ప్రపంచపు ఆకర్షణలకు లొంగరు. కానీ, వసంతకాలపు ప్రకృతి వైభవం వారిని సైతం పరవశానికి గురిచేస్తుందని చెప్పడం ద్వారా, ఈ కాలం యొక్క ప్రభావాన్ని కవి అత్యున్నత స్థాయికి తీసుకెళ్ళారు.

అకారణ బంధువు: లోకంలో బంధువులు ఏదో ఒక కారణం (రక్త సంబంధం) వల్ల ఆప్తత చూపిస్తారు. కానీ వసంతకాలం ఎటువంటి కారణం లేకుండానే, కేవలం తన ఉనికితో అందరికీ ఆనందాన్ని ఇస్తుంది కాబట్టి దీనిని 'అకారణ బంధువు' అని పిలవడం ఒక గొప్ప కవితా చమత్కారం.

శబ్ద సౌందర్యం: "పరిమళ లలితే - మాలతి సుగంధౌ" మరియు "మోహనకారిణి - అకారణ బంధౌ" వంటి పదాలలోని లయబద్ధత, పాడేటప్పుడు ఒక ఉయ్యాల ఊగినట్లుగా ఉంటుంది.

తాత్పర్యం: వసంత ఋతువు పూల మకరందం, మల్లెపూల పరిమళం మైమరపిస్తాయి. వసంతకాలంలో మహర్షుల మనసులు సైతం కలత చెంది, హఠాత్తుగా అయోమయానికి గురవుతాయి. వసంతం యువతకు నిస్వార్థ స్నేహితుడు.

గురివింద తీగలు అల్లుకున్న మామిడి చెట్లతో, మాలతీ, మాధవీ పూల వాసనలు గుబాళిస్తుండగా, మునులను సైతం లొంగ దీయగల పరిమళం అంతటా వ్యాపించి ఉంది.

యమునా నదీ జలాలతో పవిత్రమయిన ఆ బృందావనంలో, కృష్ణుడు ప్రియురాండ్లతో కలిసి,

ఆనందంగా ఆడుతూ, పాడుతూ విహారం చేస్తున్నాడు. ఆ ప్రదేశానికి పోదాం రావమ్మ, రాధా!

సఖీ! మాధవికాపుష్పాలు పరిమళం ఎంత లలితంగా వుంటుందో నీకూ తెలుసు. ఆ నవమాలికల జాతి సుగంధం వనమంతా అలుముకొంది. కొత్త మొగ్గలు మరింతగా పరిమళిస్తున్నాయి. కృష్ణుడు అక్కడ విహరిస్తున్నాడు కదా!

ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే మునిపుంగవులే ఈ వసంతం ధాటికి తట్టుకోలేకుండా వున్నారు! యవ్వనవంతులకైతే ఈ వసంతం అకారణ బంధువులా వుంది! పక్కన "తోడు" వున్నప్పుడు కదా! వసంతాన్ని అనుభవించగలిగేది. తోడు లేనిది రాధ ఒక్కటే! కృష్ణుడికేం, హాయిగా విహరిస్తున్నాడు. వసంతానికి అందుకేనేమో! అంత వైభవం.

భావార్థం - పుష్పించిన బండి గురువింద పువ్వుల (సాహిత్యంలో దీనిని 'మాధవీ లత' అని పిలుస్తారు) వాసనతో కూడి కొత్త మల్లెల పరిమళం అంతటా వ్యాపిస్తూ ఉండగా మునుల మనస్సులను కూడా మోహపెట్టి తరుణులకు అకారణబంధువుగా ఉన్న ఈ వసంతంలో అరణ్యంలో శ్రీకృష్ణుడు విహరిస్తున్నాడు.

**స్ఫురదతిముక్త లతా పరిరంభణ ముకుళిత పులకిత చూతే ।**
**బృందావన విపినే పరిసర పరిగత యమునా జల పూతే ॥ 7 ॥**

ప్రతిపదార్థం - స్ఫురత్ = ప్రకాశిస్తున్న/మెరుస్తున్న; అతిముక్త లతా = మాధవీ లత (బండి గురువింద తీగ) యొక్క;

పరిరంభణ = ఆలింగనము (కౌగిలింత) చేత; ముకుళిత = మొగ్గలు తొడిగిన (లేదా కళ్ళు మూసుకున్నట్లున్న); పులకిత = పులకించిపోయిన; చూతే = మామిడి చెట్టు కలిగినది; బృందావన విపినే = బృందావనమనే అడవిలో; పరిసర = చుట్టుపక్కల; పరిగత = ప్రవహిస్తున్న; యమునా జల = యమునా నది నీటి చేత; పూతే = పవిత్రం చేయబడినది.

విశేషాలు - ప్రకృతిలో ప్రేమ: సాహిత్యంలో మామిడి చెట్టును 'నాయకుడి'గా, మాధవీ తీగను 'నాయిక'గా భావిస్తారు. తీగ చెట్టును అల్లుకోవడాన్ని కవి 'పరిరంభణ' (కౌగిలింత) అని, చెట్టుకు మొగ్గలు రావడాన్ని 'పులకిత' (గగుర్పొడవడం) అని వర్ణించడం ఒక అద్భుతమైన మానవీకరణ.

బృందావన పవిత్రత: బృందావనం కేవలం ఒక అడవి మాత్రమే కాదు, అది యమునా నది జలాలతో నిరంతరం పునీతమవుతున్న దివ్యధామం. "యమునా జల పూతే" అని అనడం ద్వారా ఆ వాతావరణంలోని ఆధ్యాత్మిక పవిత్రతను జయదేవుడు గుర్తుచేశారు.



శబ్ద సౌందర్యం: ఈ శ్లోకంలో 'త' మరియు 'ప' అక్షరాల ప్రాస (స్ఫురత్, అతిముక్త, పరిరంభణ, ముకుళిత, పులకిత, పూతే) వినడానికి ఎంతో లయబద్ధంగా ఉంటుంది. ముఖ్యంగా 'ముకుళిత-పులకిత' అనే పదాలు పదచిత్రాలను సృష్టిస్తాయి.

తాదాత్మ్యం: ప్రకృతిలోని చెట్లు, తీగలే ఇంతటి ప్రేమతో పులకించిపోతుంటే, ఇక గోపికల మరియు రాధాదేవి మనసుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోమని కవి ఇక్కడ ధ్వనింపజేస్తున్నారు.

తాత్పర్యం: బృందావనంలోని వనాలలో ఉన్న మామిడి చెట్లు, అల్లకల్లోలంగా పాకే మధ్దవి (మాధవీ) తీగల ఆలింగనానికి పులకించిపోవడంతో, కొత్తగా చిగురించిన మొగ్గలతో నిండిపోయాయి. ఆ వనాల ప్రక్కనే ప్రవహించే యమునా నది యొక్క స్వచ్ఛమైన జలాల్లో శ్రీహరి గోపికలతో ఆప్యాయంగా ఆడుకుంటున్నారు.

రాధా! మామిడిచెట్లని పెనవేసుకొని మాధవీలతలు గాలికి కదుల్తుంటే ఏమనిపిస్తోందో తెలుసా? అకస్మాత్తుగా ప్రియుడు వచ్చి కౌగలించుకుంటే ఒళ్ళంతా పులకరింత కలుగుతుందే! అలా గాలికి కదిలే ఆ మాధవీలత కూడా మామిడిచెట్టుని కావులించుకొని పులకరిస్తోందేమోననిపిస్తోంది. వసంతంలో మామిడిచెట్ల వైభవం ఎంత గొప్పగా వుంటుందీ...

యమునాజలాలతో పునీతమైన బృందావన వసంతంలో హాయిగా విహరిస్తున్నాడు కృష్ణుడు. అయినా నాకో సందేహం! రాధా! ఆ బృందావనం నీలాంటి వియోగులకు కాక సమాగమ సమూహాలకే చోటిస్తుందేమోనని!

'బృంద' అంటే కామం నిండినవారు అని. 'అవనం' అంటే రక్షించడమే! కృష్ణ సమాగమ అవకాశం దొరికిన వారికే ఆ బృందావనంలో చోటుంటుందేమో!

కృష్ణుడు అక్కడే వున్నాడు. రాధా నువ్వే, స్వామి దరిచేరాలి! చేతనత్వం లేని లతలూ, మొక్కలే పరిరంభణపులకితలౌతుంటే, నీ విషయం ఇంక వేరే చెప్పాలా! రాధా! పద!

భావార్థం - బాగా పుష్పించిన బండి గురువింద తీగలు తమ్ము అల్లుకోవడము వల్ల పులకించినట్లుగా చిగురాకులతో కూడిన మామిడి చెట్లతో, సమీపంలో ప్రవహిస్తున్న యమునా నదిలోని జలాలచేత పవిత్రమైయున్న బృందావనంలోని అరణ్యంలో శ్రీకృష్ణుడు యువతులతో విలాసక్రీడలు చేస్తున్నాడు.

**శ్రీ జయదేవ భణితమిద ముదయతి హరి చరణ స్మృతి సారమ్ ।**
**సరస వసంతసమయ వనవర్ణన మనుగత మదన వికారమ్ ॥ 8 ॥**

ప్రతిపదార్థం - శ్రీ జయదేవ భణితమ్ ఇదమ్ = శ్రీ జయదేవ కవి చేత చెప్పబడిన (రచించబడిన) ఈ కావ్యం; ఉదయతి = ఉదయిస్తున్నది / ప్రకాశిస్తున్నది; హరి చరణ స్మృతి సారమ్ = శ్రీహరి (కృష్ణుని) పాదపద్మాల ధ్యానమే సారముగా కలిగినది; సరస వసంత సమయ = రసమయమైన వసంత కాలంలోని; వన వర్ణనమ్ = వన సౌందర్య వర్ణనను; అనుగత మదన వికారమ్ = అనుసరించి వచ్చే మన్మథ వికారాలను (శృంగార భావాలను) కలిగినది.

విశేషాలు - భక్తి - శృంగారాల మేళవింపు: జయదేవుడు తన కావ్యం కేవలం శృంగార వర్ణన మాత్రమే కాదని, దీని అంతరార్థం 'హరి చరణ స్మృతి' (భగవంతుని స్మరణ) అని ఇక్కడ స్పష్టం చేశారు. బాహ్యంగా ప్రకృతి వర్ణనగా అనిపించినా, అది జీవాత్మ (రాధ) పరమాత్మ (కృష్ణుడు) కోసం పడే తపనను సూచిస్తుంది.

శబ్ద సౌందర్యం: 'స' మరియు 'ర' అక్షరాల ప్రాస (సరస, వసంత, సమయ, సారమ్, స్మృతి) ఈ చరణానికి ఒక ప్రశాంతమైన ముగింపును ఇస్తుంది. "భణితమిదమ్ - సారమ్" మరియు "వర్ణనమ్ - వికారమ్" అనే అంత్యప్రాసలు పదాలను వినడానికి శ్రావ్యంగా మారుస్తాయి.

వసంతం మరియు మన్మథ వికారం: వసంత కాలం రాగానే ప్రకృతిలో మార్పులు రావడం సహజం. ఆ మార్పులను (మదన వికారాలను) భగవంతుని వైపుకు మళ్ళించడమే ఈ కావ్యం యొక్క విశిష్టత. అందుకే దీనిని 'మధుర భక్తి' కి నిదర్శనంగా చెబుతారు.

తాత్పర్యం: ఈ శుభప్రదమైన, రసభరితమైన గీతం శ్రీ జయదేవుని ద్వారా పరిపూర్ణంగా వ్యక్తమైంది. కృష్ణుని విరహ వేదనలో రాధ మునిగి ఉన్నప్పుడు ఆమెలో కలిగే శృంగారపరమైన విపరీతాలతో వసంత ఋతువులోని వన వర్ణన నిండి ఉంది. రాగ పరివర్తనలతో అల్లుకొని ఉన్న ఈ వసంత ఋతువు, శ్రీహరి పద్మ పాదాల స్మరణను మేల్కొలుపుతుంది.

హరిచరణ స్మృతిసారమై, ఆయన పాదధ్యానమే ధ్యేయమై, ఆయన పద ధ్యానమే సారమై ఈ సంసార బంధాల నుంచి విముక్తిని కలిగిస్తాయి. సరస వసంత సమయంలో బృందావనాన్నీ, అక్కడ జరిగే శృంగారాన్నీ, ఆ అవకాశం దొరకని వారికి అది కలిగించే వేదననీ వర్ణించిన శ్రీజయదేవుడి గీతాలు సర్వోత్కృష్టంగా వుంటాయి!

భావార్థం - మన్మథ వికారాన్ని కలిగించే వసంతకాలంలో శ్రీహరి పాదాలను సంస్మరిస్తూ మనస్సులో తోచిన మధురభావాలతో కూడిన ఈ వన వర్ణనను జయదేవకవి రచించాడు.

**దర విదళిత మల్లీ వల్లి చంచత్పరాగ**
**ప్రకటిత పట వాసైర్వాసయన్కాననాని ।**
**ఇహ హి దహతి చేతః కేతకీ గంధ బంధుః**
**ప్రసర దసమబాణ ప్రాణవద్గంధవాహః ॥ 8 ॥**

ప్రతిపదార్థం - దర విదళిత = కొంచెం వికసించిన (మొగ్గలు విచ్చుకుంటున్న); మల్లీ వల్లి = మల్లె తీగల యొక్క; చంచత్ పరాగ = కదులుతున్న పరాగ రేణువుల చేత; ప్రకటిత పట వాసైః = వస్త్రాలకు అద్దే సుగంధ చూర్ణం వలె; వాసయన్ కాననాని = అడవి అంతటినీ సుగంధభరితం చేస్తూ; ఇహ హి దహతి చేతః = ఇక్కడ (ఈ వసంతంలో) మనస్సును దహిస్తోంది; కేతకీ గంధ బంధుః = మొగలి (గేదంగి) పూల పరిమళానికి చుట్టమైన (ఆ వాసనను మోసుకొస్తున్న); ప్రసరత్ అసమబాణ ప్రాణవత్ = విజృంభిస్తున్న మన్మథుడి (అసమబాణుడు) ప్రాణం వలె ఉన్న; గంధవాహః = గాలి (మలయ మారుతం).

విశేషాలు - పట వాసము: పూర్వకాలంలో వస్త్రాలకు మంచి వాసన రావడం కోసం సుగంధ చూర్ణాలను చల్లేవారు. ఇక్కడ మల్లె పూల పరాగ రేణువులు అడవి అనే వస్త్రానికి సహజమైన సుగంధాన్ని అద్దుతున్నాయని కవి వర్ణన.

గాలి 'దహించడం': సాధారణంగా గాలి చల్లదనాన్ని ఇస్తుంది. కానీ విరహంలో ఉన్నవారికి అది మన్మథ తాపాన్ని పెంచుతుంది. అందుకే కవి ఇక్కడ 'దహతి' (కాల్చుతోంది) అనే పదాన్ని వాడారు. ఇది విరహ వేదన యొక్క తీవ్రతను సూచిస్తుంది.

కేతకీ గంధ బంధుః: మొగలి పూల వాసన చాలా గాఢంగా, మత్తు కలిగించేలా ఉంటుంది. ఆ వాసనను మోసుకొచ్చే గాలిని మొగలి పువ్వుకు 'బంధువు' గా జయదేవుడు పేర్కొనడం ఆయన కవితా చమత్కారానికి నిదర్శనం.

శబ్ద సౌందర్యం: ఈ శ్లోకంలో 'ప' మరియు 'గ' అక్షరాల ఆవృత్తి (పరాగ, ప్రకటక, పట, ప్రాణ, గంధ, గంధవాహ) చదవడానికి ఒక రకమైన గంభీరమైన లయను, వేగాన్ని ఇస్తుంది. జయదేవుని వర్ణనలో ప్రకృతి కేవలం జడపదార్థం కాదు, అది మన్మథుడికి సహాయపడే ఒక సజీవ శక్తి.

తాత్పర్యం: కొత్తగా వికసించిన మల్లెపూల నుండి రాలిన సన్నని పుప్పొడితో గాలి అడవిని పరిమళభరితం చేస్తుంది, అది ప్రేమ పరిమళాన్ని వీస్తుంది, అది తాకిన ప్రతి హృదయాన్ని వేధిస్తుంది.

అప్పుడే విరిసే మల్లెల పరిమళాలను, గేదంగి (కేతకీ) పూల పరిమళాలను మోసుకొస్తున్న వసంత గాలి, మన్మథుడి ప్రాణ వాయువులా ఉంది. మావి చిగురులు తిన్న కోకిలా రావాలు, మకరందం త్రాగిన గండు తుమ్మెదల ఝుమ్కారాలు, బాటసారుల మనసులో, తమ ప్రియురాళ్ళ తలపులను రేపుతూ, ఆరాటపెడుతున్నాయి. ఇట్టి వసంతంలో, అనేక నారీమణుల మధ్య సమీపంగా, క్రీడిస్తున్న కృష్ణుడిని, రాధకు చూపిస్తూ, చెలికత్తె, ఇలా అంటున్నది.

అరవిరిసిన మల్లెతీగల వెలుగు, పుష్పొడి దుమారం రేపిందా అన్నట్లు వనమంతా పరిమళాలు అలుముకొనేలా చేస్తోంది వసంతం! కేతకీ పుష్ప పరిమళం దీనికి తోడై నలుదిక్కులా సువాసనలు వెదజల్లి పరిమళిస్తోంది. వసంతానికి ఇంత వైభవం ఎక్కడిదీ? పరిమళ భరితమైన ఈ మలయ

మారుతాలలో ప్రాణశక్తి మన్మథుడే. సుగంధవాహకమైన ఈ పిల్లగాలులు విరహ వియోగుల్ని దహించి వేస్తున్నాయి.

భావార్థం - అప్పుడప్పుడే వికసిస్తున్న మల్లె తీగల నుండి వెలువడే పరాగ రేణువులనే సుగంధ చూర్ణాన్ని చల్లుతూ, వసంతకాలపు గాలి అడవి అంతటినీ సువాసనలతో నింపుతోంది. మొగలి పూల పరిమళంతో నిండిన ఈ గాలి, మన్మథుడికి ప్రాణవాయువులా ఉండి, విరహంతో ఉన్న వారి హృదయాలను దహిస్తోంది.

ఉన్మీలన్మధు గంధ లుబ్ధ మధుప వ్యాధూత చూతాంకుర
క్రీడత్కోకిల కాకలీ కలరవై రుద్గీర్ణ కర్ణ జ్వరాః ।
నీయంతే పథికైః కథం కథమపి ధ్యానానుధాన క్షణ
ప్రాప్త ప్రాణసమా సమాగమ రసోల్లాసై రమీ వాసరాః ॥9॥

ప్రతిపదార్థం - ఉన్మీలత్ = అప్పుడే వికసిస్తున్న; మధు గంధ = పూతేనె సుగంధానికి; లుబ్ధ = ఆశపడిన (ఆకర్షించబడిన); మధుప = తుమ్మెదల చేత; వ్యాధూత = కదిలించబడిన/వణకించబడిన; చూతాంకుర = మామిడి చిగుళ్ళ యందు; క్రీడత్ = విహరిస్తున్న/ఆడుకుంటున్న; కోకిల = కోకిలల యొక్క; కాకలీ కలరవైః = మధురమైన ధ్వనుల (కుహూ రావాల) చేత; ఉద్గీర్ణ కర్ణ జ్వరాః = చెవులకు జ్వరం పుట్టినట్లుగా (బాధాకరంగా) ఉన్నవారు; నీయంతే పథికైః = బాటసారుల (పథికుల) చేత గడపబడుతున్నాయి; కథం కథమపి = అతి కష్టమ్మీద (ఎలాగోలా); ధ్యాన అనుధాన = ధ్యానం మరియు అనుసంధానం ద్వారా; క్షణ ప్రాప్త = క్షణకాలం పాటు పొందిన; ప్రాణసమా సమాగమ = ప్రాణసమానురాలైన ప్రియురాలి కలయిక వల్ల కలిగే; రసోల్లాసైః = ఆనందముతో; అమీ వాసరాః = ఈ (వసంతకాలపు) రోజులు.

విశేషాలు - కర్ణ జ్వరం: సాధారణంగా కోకిల కూతను అందరూ ఇష్టపడతారు. కానీ, జయదేవుడు ఇక్కడ విరహుల బాధను వర్ణించడానికి దానిని 'జ్వరం' తో పోల్చారు. అంటే, ప్రియురాలు పక్కన లేనప్పుడు ప్రకృతిలోని ఏ అందమైన శబ్దమైనా చెవులకు సూదుల్లా గుచ్చుకుంటుందని భావం.

మానసిక సమాగమం: విరహులు ఈ కాలాన్ని ఎలా గడుపుతున్నారు? ప్రత్యక్షంగా ప్రియురాలిని కలుసుకోలేరు కాబట్టి, కళ్ళు మూసుకుని ఆమెను ధ్యానిస్తూ, ఊహల్లో ఆమెను కౌగిలించుకుంటూ ఆ 'రసోల్లాసం'తో ప్రాణాలను నిలుపుకుంటున్నారు. దీనిని ప్రాచీన సాహిత్యంలో 'భావ సమాగమం' అంటారు.

శబ్ద సౌందర్యం: ఈ శ్లోకంలో 'క' మరియు 'ధ' అక్షరాల ప్రాస (చూతాంకుర, కోకిల, కాకలీ, కలరవైః, కర్ణ, కథం కథమపి) వినడానికి ఎంతో లయబద్ధంగా ఉంటుంది. ముఖ్యంగా 'కథం కథమపి' (ఎలాగోలా/అతి కష్టమ్మీద) అనే పదం వారు పడుతున్న ఇబ్బందిని ధ్వనింపజేస్తుంది.

ప్రకృతి - ఒక విరోధి: ఇక్కడ ప్రకృతి బాటసారులకు విరోధిలా మారింది. తుమ్మెదల వల్ల కదిలే మామిడి చిగుళ్ళు, కోకిల పాటలు అన్నీ వారి మన్మథ తాపాన్ని పెంచుతున్నాయి.

తాత్పర్యం: తేనె కోసం తేనెటీగలు వెతుకుతున్నప్పుడు కదిలే మామిడి రెమ్మలపై కోకిలల జతకట్టే శబ్దాలు, వికసిస్తున్న మొగ్గల సువాసనలు ఒంటరి ప్రయాణికుల చెవులలో జ్వరాన్ని రేకెత్తిస్తాయి. తమ ధ్యానంలో పరమాత్మను తలచుకుంటూ, క్షణప్రాప్త ప్రాణంలా వారు ఎలాగోలా బ్రతికి ఉంటారు.

మనుషులకైతే పుష్పపరిమళాలు ఉద్దీపకంగా ఉంటాయి. కానీ, తుమ్మెదలకు పుష్పాలలోని మధుపరిమళాలు మరింత ఉద్దీపన కలిగిస్తాయి కాబోలు! అంతకంతకు పెరుగుతున్న మధు గంధానికి ఈ మధుపాలు అంటే, తుమ్మెదలు చెట్టుచుట్టూ కమ్ముకొని, చూతాంకురాలు అంటే లేమావి చిగుర్లు తింటూ ఆనందంగా గడిపే కోయిలల్ని ఇబ్బంది పెడుతున్నాయి. కోయిలలకు తుమ్మెదలు ఇబ్బందే మరి!

హాయిగా పంచమ స్వరంలో కమ్మగా పాడుకొనే కోయిలలకి ఈ తుమ్మెద బాధ ఎక్కువై అమిత మైన కోపంలో నిషాద కాకలీ స్వరాలతో కూయడం మొదలు పెట్టాయట! తుమ్మెదలు గోలచేసి కోయిలలకు కర్ణజ్వరాన్ని తెచ్చిపెట్టి ఎంత బాధపెట్టాయో గదా! వసంతమాసం కారణంగా విరహ వేదన పడుతున్న వియోగులకి కోయిలల ఈ కాకికూతలు మరింత బాధని కలిగించసాగాయి.

పాపం! వియోగులకేమో ప్రాణసమమైన ప్రియుని సమాగమంపైనే ధ్యాస నిలిచి ఉంటుంది. అంత లోనే ఏవేవో పగటి కలలు! ప్రియుడు దరిచేరినట్లు! కౌగిలిలో ఒదిగినట్లు! ఊహలో అయితేనేం, క్షణకాలం పొందిన సమాగమరసం కల్పించిన ఉత్తేజ ఉద్దీపనలతోనే, ఎట్లాగో ఈ వియోగులు రోజులు గడిపేస్తున్నారు.

భావార్థం - వసంత కాలంలో వికసించే పూల మకరంద పరిమళానికి ఆకర్షితమై, తుమ్మెదలు మామిడి చిగుళ్లను కదల్చుతున్నాయి (వ్యాధూత చూతాంకుర). ఆ మామిడి చిగుళ్లపై కోయిలలు ఆటలాడుతూ చేసే మధురమైన కూతలు (క్రీడత్కోకిల కాకలీ కలరవై), విడిపోయి ఉన్న ప్రేమికులకు (పథికైః) చెవులలో జ్వరం పుట్టించినట్లుగా (కర్ణ జ్వరాః - అంటే వినడానికి ఎంతో బాధగా/ఉద్వేగంగా) ఉన్నాయి.

అటువంటి వసంత కాలపు రోజులను, దూరంగా ఉన్న బాటసారులు (పథికైః), తమ ప్రాణసమానమైన ప్రియురాలిని ధ్యానం చేసుకుంటూ, ఆనందాన్ని పొందుతూ, ఎంతో కష్టమ్మీద (కథం కథమపి) గడుపుతున్నారు (నీయంతే).

**(సశేషం)**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## భవిష్యోత్తర పురాణాంతర్గతం

గత సంచిక తరువాయి

### జనకుని విచారము

శౌనకుడు సూతమహర్షిని ''మహాత్మా! సర్వశాస్త్రవిశారదా! పుణ్యాన్ని పెంపొందింపజేసే మాహాత్మ్యాన్ని నేను నీనుండి వినగోరుచున్నాను. ఇంతకుముందు మీరు హస్తిగిరీశుడైన శ్రీరంగని మాహాత్మ్యాన్ని, జగన్నాథుడైన విష్ణువుయొక్క సాటిలేని మాహాత్మ్యాన్ని చెప్పారు. ఇప్పుడు వేంకటేశుని మాహాత్మ్యాన్ని వినగోరుచున్నాను. కావున దయతో తెలియజేయండి'' అని అడిగాడు.

అప్పుడు సూతమహర్షి శౌనకాది మహర్షులకు ఈ విధంగా చెప్పనారంభించాడు - ఓ మహర్షులారా! మీరు చక్కగా అడిగారు. మహాతేజశ్శాలియైన వ్యాసమహర్షి నుండి పూర్వం నేను విన్నది విన్నట్టుగా వేంకటేశ్వరుని చరిత్రను మీకు చెబుతాను. మీరు సావధాన మనస్కులై వినండి.

పూర్వం పరమధార్మికుడు, సత్యసంధుడు, సర్వశాస్త్రకోవిదుడు, కోపరహితుడు, భగవంతుని అనుగ్రహానికి ముఖ్యపాత్రుడైనవాడు జనకుడనే రాజర్షి ఉండేవాడు. అతడు మమకారరహితుడు, నిత్యతృప్తుడు, నిరహంకారి, ఆత్మదృష్టి కలవాడు. ఆయనకు కుశకేతుడనే సోదరుడున్నాడు (కుశధ్వజుడు) ఆ కుశధ్వజునికి త్రైలోక్యసుందరులైన ముగ్గురు కుమారులు. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

జనక మహారాజుకు లక్ష్మీదేవియే 'జానకి' అనే కుమార్తెగా అవతరించింది. ఆయన తన సోదరునిచే రాజ్యపాలన చేయిస్తున్నాడు. కుశధ్వజుడు అన్నగారి ఆజ్ఞమేరకు పెద్దలయందు భక్తితో రాజ్యపరిపాలన చేస్తున్నాడు.

ఒకానొకప్పుడు జనక మహారాజు తన మనస్సులో ఇలా అనుకున్నాడు- 'నాకు ఎప్పుడూ సుఖమే కలగాలి'. ఒకప్పుడు కూడా దుఃఖం కలుగకూడదు. నేను నా కళ్ళతో కష్టాన్ని, దుఃఖాన్ని చూడలేను. ఎప్పుడూ సుఖాన్నే చూస్తాను. సాధుసమ్మతం కాని ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీహరి రాజ్యమత్తుడైన జనకమహారాజుకు దుఃఖాన్ని చూపించాడు.

ఒకనాడు దురదృష్టవశాత్తు కుశధ్వజుడు మరణించాడు. అతని భార్య రాజ్యాన్ని, పుత్రులను విడిచి భర్తతో సహగమనం చేసి పతిసాలోక్యాన్ని చెందింది. బిడ్డలతో సుఖంగా ఉండవలసినవారు గతించగా చూసి సోదరునియందు వాత్సల్యం కల జనకమహారాజు ఇలా విలపించాడు –

'అమ్మా! పిల్లల్ని, జానకిని, వృద్ధుడనైన నన్ను వదలి ఓ

పుణ్యాత్ములారా! నీ భర్తతోపాటు ఎక్కడికి వెళ్ళావు? తల్లీ! నాకు ఎనభై వేల సంవత్సరాల వయస్సు వచ్చింది. ఇంతకాలం, ఇప్పటివరకు నాకు దుఃఖమంటే ఏమిటో తెలియదు. నీ వియోగం వలన ఇప్పుడు దుఃఖం సంప్రాప్తమైంది' అని మనసులో మరల మరల విచారించాడు.

పిల్లలందరూ చిన్న వాళ్ళగుట వలన వారికి తానే శ్రాద్ధకర్మలు నిర్వర్తించాడు. తల్లిలేని ఆ పసిబిడ్డలను ఎత్తుకుని తన ఒడిలో కూర్చోబెట్టుకొని 'బిడ్డలారా! మీకెంత కష్టం వచ్చింది? చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకున్నారు. తల్లి లేని మిమ్మల్ని నేను చూడలేకపోతున్నాను' అని జనక మహారాజు మిక్కిలి విచారగ్రస్తుడై రాచకార్యాలను వదలి దుఃఖితుడై అన్నపానాదులను, భోగాలను, నిద్రను వదలి కృశిస్తూ ఉన్నాడు.

అంతట ఆయన పురోహితుడు, వామదేవుని తమ్ముడు అయిన శతానందుడు దైవవశాత్తు ఆయన దుఃఖాన్ని పోగొట్టడానికి అక్కడకు వచ్చాడు. తన వద్దకు వచ్చిన ఆ పురోహితుని చూచి రాజు ఆయన్ని పూజించాడు. ఆ తరువాత ఆ మునిశ్రేష్ఠుడు కృష్ణాజినంపై ఆసీనుడయ్యాడు. అపుడు కుశల ప్రశ్నలు అడిగిన తరువాత జనక మహారాజు గౌతమమహర్షి పుత్రుడైన శతానందునితో ఇలా అన్నాడు.

మహాప్రాజ్ఞా! శతానందా! నేను ముసలివాడనయ్యాను. పిల్లలు చిన్నవాళ్ళు. పెళ్ళి కావలసిన కన్యకలు చాలామంది ఉన్నారు. బంధువులంతా చనిపోయారు. రావణుడు, ఇంద్రజిత్తు మొదలైన శత్రువులు చాలామంది ఉన్నారు. మిక్కిలి వృద్ధుడను, అసహాయుడను అయిన నేను వాళ్ళతో యుద్ధమెలా చేస్తాను? రావణాసురుడు ఎందుకో రాత్రింబవళ్ళు వస్తున్నాడు. ఓ మునివర్యా! ఇప్పుడు నా గతి ఏమిటి? నాకు జ్ఞాననేత్రం లేకపోవడం వలన అతని రాకకు కారణమేంటో నేనెరుగను. నా బాధకు ఇదొక కారణం.

ఇంకొక కారణం చెబుతాను వినండి. మిక్కిలి సౌందర్యవతియైన సీతకు తగిన సుందరుడైన పురుషుడు ఎలా లభిస్తాడు? ఓ ద్విజోత్తమా! మీరే చెప్పండి! ఇక మూడవ కారణం చెబుతాను వినండి. నా పుత్రులు దీర్ఘాయుష్మంతులు కావాలి. నా కుమార్తెలు, వారి భర్తలు కూడా దీర్ఘాయుష్మంతులు కావాలి. వారంతా ఒకే దేశాధిపతికి కోడళ్ళు కావాలి. నా అల్లుళ్ళు నలుగురు ఒకేరాజు కుమారులు కావాలి.

పురోహితా! నా రాజ్యం స్వయంగా ఎలా అభివృద్ధి చెందుతుంది? వీటన్నిటికి ఉపాయాన్ని తెలియజేయమని అడిగాడు. అంతట శతానందుడు ఇలా అన్నాడు - మహారాజా! భూలోకంలో ఒక విశేషముంది. నీ బిడ్డలకు కల్యాణ సౌఖ్యాన్ని ప్రసాదించేది, శత్రువులను నశింపజేసేది ఆ పర్వతం.

ఆ వైకుంఠ పర్వత మాహాత్మ్యం ఇంతకు ముందెప్పుడో జరిగింది. భవిష్యత్తులో జరుగబోతుంది. కలియుగంలో దాన్ని కీర్తిస్తే పుణ్యం వస్తుంది. సకల దుఃఖాలు పోతాయి. సర్వశుభాలు కలుగుతాయి. ధనాన్ని కోరేవారికి ధనాన్నిస్తుంది. పుత్రులను కోరేవారికి పుత్రులను ప్రసాదిస్తుంది. రోగాలతో బాధపడే వారి రోగాలను పోగొడుతుంది. జ్ఞానులకు జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. దీని మాహాత్మ్యాన్ని వినడం వలనే సర్వలోకేశ్వరుడైన బ్రహ్మదేవుడు బ్రహ్మపదవిని పొందాడు. నీలకంఠుడైన పరమశివుడు దీన్ని వినడం వలనే గరళం త్రాగి కూడా సుఖంగా ఉన్నాడు.

ఈ కథాశ్రవణం వలన ఇంద్రుడు స్వర్గాధిపత్యాన్ని పొందాడు. లోకపాలకులు తమ తమ పదవులను పొందారు. పెక్కుమాటలెందుకు? ఈ వేంకటాచల మాహాత్మ్యం అనంతమైన ఫలితాన్ని ఇస్తుంది. కావున దానిని వినండి అని శతానందుడు చెప్పగా జనక మహారాజు శతానందునితో 'మహాత్మా! ఆ వైకుంఠగిరి మాహాత్మ్యాన్ని కలియుగంలో దాని భవిష్యచ్చరిత్రను తెలియజేయండి' అని అడిగాడు.

అప్పుడు శతానందుడు 'మహారాజా! ఈ పర్వతానికి కృతయుగంలో వృషాద్రి అని, త్రేతాయుగంలో అంజనాచలమని, ద్వాపర యుగంలో శేషశైలమని, కలియుగంలో వేంకటాచలమని నాలుగు యుగాల్లో నాలుగు పేర్లు ప్రసిద్ధమైనాయి' అని చెప్పాడు.

**కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయామంజనాచలమ్ ।**
**ద్వాపరే శేషశైలేతి కలౌ శ్రీవేంకటాచలమ్ ॥**
**నామాని యుగభేదేన శైలస్యాస్య భవన్తి హి ॥**

భవిష్యోత్తర పురాణం, అ.1, శ్లో. 36, 37.

అది విని జనక మహారాజు శతానందునితో 'మహామునీ! ఈ పర్వతానికి నాలుగు యుగాల్లో నాలుగు పేర్లున్నాయి అని చెప్పారు. గురుదేవా! నాలుగు యుగాల్లో ఈ పర్వతానికి నాలుగు పేర్లు రావడానికి కారణమేమిటో వివరంగా నాకు చెప్పండి. ముందుగా కృతయుగంలో ఈ పర్వతానికి వృషాద్రి అని పేరెలా వచ్చిందో తెలియజేయండి' అని అన్నాడు.

వృషభాచలనామ నిష్పత్తి

అప్పుడు శతానందుడు జనకునికి ఈ విధంగా చెప్పనారంభించాడు. పూర్వం వృషభుడనే రాక్షసుడు ఈ శేషపర్వతాన్ని ఆక్రమించుకొని భయంకర కృత్యాలు చేస్తూ ఇక్కడ తపస్సు చేసుకునే మునులను బాధించేవాడు. ఆ మునులంతా అతని వలన తపోభంగం కాగా భక్తులకు అభయప్రదుడు, హృషీకేశుడు, సకల జగత్తుకు ఉత్పత్తికారకుడు, సర్వప్రాణులను సృష్టించినవాడు అయిన శ్రీనివాసుని శరణు వేడారు.

శ్రీహరి వారి ప్రార్థనను మన్నించి ఆ మునుల ఎదుట ప్రత్యక్షమయ్యాడు. ఆ మునులందరూ భగవంతుని అనేక విధాల స్తుతిస్తూ ఆయనకు తమ బాధలను ఈ విధంగా విన్నవించుకున్నారు -

'ఓ పుండరీకాక్షా! ఇక్కడ వృషభాసురుడనే దుష్టరాక్షసుడు క్రూరకర్మలు చేస్తూ మా తపస్సుకు భంగం కలిగిస్తూ మమ్మల్ని బాధిస్తున్నాడు. ఓ పురుషోత్తమా! మమ్మల్ని ఆ రాక్షసుల బాధలనుండి భయం నుండి కాపాడి రక్షించు' అని వారంతా ప్రార్థించగా వాసుదేవుడు 'అలాగే' నని కోపంతో ఆ దుష్టరాక్షసుని తరిమేశాడు.

మహావీరుడైన ఆ రాక్షసుడు తుంబురుతీర్థంలో మూడు పూటలా స్నానంచేసి పవిత్రమైన, దివ్యమైన భయంకరాకృతితో కూడిన అధోముఖంగా ఉన్న నారసింహ సాలగ్రామ శిలను 'ప్రతిరోజూ ఆరాధిస్తాను' అని నిశ్చయించుకొని నిత్యం పూజిస్తూ ఉన్నాడు. మహారాజా! ఆ విధంగా ప్రతిరోజు పూజిస్తు, పూజ పూర్తయిన తరువాత కత్తి తీసుకొని తన శిరస్సును ఖండించి దానినే పుష్పంగా ఆ నారసింహుడికి సమర్పించేవాడు. కాని వెంటనే అతని శిరస్సు మరల యథాతథంగా వచ్చేది.

ఈ విధంగా ఐదువేల సంవత్సరాలు గడిచాయి. ఆ తరువాత ఒకనాడు అరవిందాక్షుడు అయిన శ్రీనివాస భగవానుడు ఆ శిలలో అంతర్యామిగా ఉన్న పరాత్పరుడు, సత్పురుషులకు శరణ్యుడు అయిన భగవంతుడు ఆ వృషభాసురునికి ప్రత్యక్షమయ్యాడు. ఆ రాక్షసుడు హృషీకేశుని దర్శించిన వెంటనే స్పృహ కోల్పోయి ఆయనకు సాష్టాంగపడ్డాడు.

కొంతసేపటికి మరల స్పృహవచ్చి లేచి నిలబడి కేశవునితో ఇలా అన్నాడు - 'కేశవా! అనంతా! గోవిందా! శ్రీనివాసా! దేవదేవా! నేను మోక్షాన్ని గాని స్వర్గాన్ని గాని బ్రహ్మలోకాన్ని గాని కోరను. జగత్ప్రభూ! నాకు నీవు యుద్ధభిక్షను ప్రసాదించు. శ్రీహరీ! నీ అవతార వైభవాన్ని విన్నాను. నీ పరాక్రమాన్ని గురించి విన్నాను.

ఓ పురుషోత్తమా! ఇప్పుడది నిజమని నిరూపించు వృషభాసురుడు ఇలా పలుకగా దేవదేవుడు అయిన శత్రుమర్దనుడు, శ్రీహరి దానిని విని మందస్మిత వదనంతో యుద్ధ దుర్మదంతో ఉన్న ఆ రాక్షసునితో 'అలాగే' అన్నాడు.

ఆ వృషభాసురునికి, శ్రీనివాసునికి మధ్య అద్భుతమైన యుద్ధం జరిగింది. వారిద్దరు ఒకరినొకరు అనుకరిస్తూ యుద్ధం చేశారు. దేవతలంతా దాన్ని ఆశ్చర్యంతో తిలకించారు. ఆ రాక్షసుని యుద్ధకౌశలం చూసి భగవంతుడు ప్రశంసించాడు. 'ఓ రాక్షసరాజా! ఇక నా పౌరుషాన్ని, బలాన్ని చూపిస్తాను చూడు' అని చెప్పి గరుత్మంతుని భయంకరాకృతిని చూపించాడు. తాను కూడా విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. వేయిభుజాలు, వేయి ఆయుధాలతో అలంకృతుడైన, నాశరహితుడైన వాసుదేవుని, ఆయన మాయను, గరుత్మంతుని చూచి ఆ రాక్షసుడు దేవతల్ని కూడా మోహింపజేసే తన మాయను ప్రయోగించాడు.

ఆ రాక్షస మాయను జయించే శక్తి కలిగి ఉండి కూడా శ్రీహరి అతనిని 'చాలా బాగుంది. బాగుంది' అని ప్రశంసించాడు. ఆ తరువాత 'ఒరే రాక్షసా! ఇప్పుడు పండిన పండును చెట్టు నుండి రాల్చునట్లుగా ఈ సహస్రార చక్రంతో నీ శరీరము నుండి నీ శిరస్సును వేరు చేస్తాను' అనగానే వృషభాసురుడు ఆ దేవదేవునికి సాష్టాంగపడి నమస్కరించి జగత్ప్రభువైన ఆ పరాత్మరుని ఈ విధంగా స్తుతించాడు –

'చక్రపాణీ! నీకు నమస్కారము. నీ సుదర్శన చక్రమాహాత్మ్యాన్ని నేను విన్నాను. నీ చక్రముచే సంహరించబడినవానికి ముక్తి లభిస్తుంది. ఇందుకు సందేహం లేదు. పూర్వం కీర్తిమంతుడనే రాజు ఈ చక్రంచేత నిహతుడై గొప్ప కీర్తిని పొందాడు. ప్రభూ! నేను నీ చక్రము చేత చంపబడి నీ వైకుంఠానికే వెళతాను' అని చెప్పి వృషభాసురుడు శ్రీహరి పాదాలను స్పృశించాడు.

'ఈ పర్వతం నా పేరుతో ప్రసిద్ధి చెందుగాక!' అని భగవంతుని వరమడిగాడు. శ్రీహరి 'అలాగే అగుగాక' అని చెప్పి సుదర్శన చక్రాన్ని వదిలాడు. అది అతని శిరస్సును ఖండించింది. అతడు మృతి చెందాడు. అందువల్ల ఈ పర్వతం కృతయుగంలో వృషభాద్రిగా ప్రసిద్ధి చెందింది.

**వరం యయాచే వృషభః 'శైలో మదభిధోస్త్వితి' ।**
**తస్మా ద్వృషభశైలోయం కృతేఖ్యాతిముపేయివాన్ ॥**
– భవిష్యోత్తర పు. అ.1 శ్లో. 64, 66

## త్రేతాయుగంలో అంజనాద్రిగా ప్రసిద్ధి

అంతట జనక మహారాజు శతానందుని 'మహాత్మా! త్రేతాయుగంలో ఈ పర్వతానికి అంజనాద్రి అని పేరెలా వచ్చిందో చెప్పండి' అని అడిగాడు. అప్పుడు శతానందుడు ఇలా చెప్పాడు -

పూర్వం కేసరి భార్య పద్మములవంటి నేత్రములు కల అంజనాదేవి సంతానము లేక బాధపడుతూ మతంగముని వద్దకు వచ్చింది. ఆయనకు నమస్కరించింది. సంతానము లేని బాధతో కృశించిన ఆమె కళ్ళవెంట నీరు కారుస్తూ ఆ కన్నీరు తన శరీరాన్ని తడుపుతుండగా ఆ మహర్షిని ఇలా అడిగింది -

'ఓ మునిశ్రేష్ఠా! సంతానం లేని నా గతి ఏమిటి?' అని విలపించగా మతంగ మహర్షి ఆమెతో ఇలా అన్నాడు - 'దేవీ! పంపానదికి తూర్పుదిక్కున ఏబది యోజనాల దూరంలో నారసింహాశ్రమం ఉంది. దానికి దక్షిణంవైపు నారాయణగిరిలో స్వామి తీర్థానికి ఉత్తర దిక్కున క్రోసు దూరంలో 'ఆకాశగంగ'

అనే ప్రసిద్ధమైన తీర్థముంది. నీవు సుఖంగా అక్కడికి వెళ్ళు. కల్యాణీ! నీవు ఆ తీర్థంలో స్నానంచేసి పన్నెండు సంవత్సరాలు తపస్సు చెయ్యి. ఆ పుణ్యం వలన నీకు మంచి గుణవంతుడైన కుమారుడు కలుగుతాడు' అని చెప్పాడు.

అది విని అంజనాదేవి నారాయణాద్రికి వెళ్ళింది. అక్కడ స్వామి పుష్కరిణిలో స్నానంచేసి అక్కడి అశ్వత్థ వృక్షానికి ప్రదక్షిణం చేసి వరాహస్వామికి నమస్కరించి ఆ పుష్కరిణిలోని పవిత్ర తీర్థాన్ని స్వీకరించి ఆకాశగంగా తీర్థానికి చేరి అక్కడ తపస్సు చేయడానికి ఉపక్రమించింది.

మతంగు మహర్షిని స్మరించుకొని భర్త అనుమతి తీసుకొని ఆహారాన్ని వర్జించి ఉపవాసం చేస్తూ భౌతిక భోగాలన్నింటిని విసర్జించి వ్రతదీక్షతో శుచియై నిర్మలచిత్తంతో తన శరీరాన్ని కర్రవలె దృఢంగా నిలిపి తపస్సు చేయసాగింది.

ఇలా ఒక సంవత్సరం కాగా మహాబలవంతుడైన వాయుదేవుడు ప్రతిరోజూ ఒక పండును తెచ్చి ఆమె తినుటకై ఇచ్చేవాడు. ఇలా ఉండగా ఒకరోజు వాయుదేవుడు ఒక ఫలమునందు తన వీర్యాన్నుంచి ఆ ఫలాన్ని ఆమె దోసిటిలో ఉంచాడు. ఆకలిగొన్న ఆమె అది మామూలు ఫలమనుకొని దానిని భుజించింది. రాజా! ఆ తరువాత ఆమె గర్భవతి అయింది. వాయుదేవుని వలన ఆమె గర్భం ధరించిందని మునులంతా సంతోషించారు. పదినెలలు నిండిన తరువాత ఆమె పుత్రరత్నాన్ని ప్రసవించింది. పాపరహితులైన ఆ మునులంతా ఆ పిల్లవానిని హనుమంతుడని అన్నారు. అంజనాదేవి తపోవ్రతమాచరించి ఇక్కడ పుత్రుని కన్నది కావున ఈ పర్వతం 'అంజనాద్రి' గా ప్రసిద్ధి చెందింది.

**అంజనావ్రతమాస్థాయ పుత్రంప్రాప గిరీశ్వరే ।**
**తస్మాదంజన శైలోయం లోకే విఖ్యాత కీర్తిమాన్ ॥**
– భ.పు. అ.1, శ్లో. 81

## ద్వాపరయుగంలో శేషాచలమని ప్రసిద్ధి

జనక మహారాజు అది విని శతానందుని 'మహాత్మా! అంజనాద్రి అనే పేరు ఈ పర్వతానికి కలగడానికి మీరు చెప్పిన కారణాన్ని వినుట వలన నాకు చాలా సంతోషం కలిగింది. మునీంద్రా! ఈ పర్వతానికి ద్వాపరయుగంలో శేషశైలమనే పేరు ఎలా వచ్చిందో దయతో తెలియజేయండి' అని అడిగాడు. అప్పుడు శతానందుడు ఇలా చెప్పసాగాడు–

పూర్వం శ్రీమహావిష్ణువు వైకుంఠనగర ద్వారానికి ఆదిశేషుణ్ణి కాపలాగా నియమించాడు. భగవంతుని మనోభావాన్ని మరియు భవిష్యత్తులో వాయుదేవుని వలన జరుగబోయే కార్యాన్ని తెలుసుకొని ఆదిశేషుడు జాగ్రత్తగా కుతూహలంతో భగవంతుని ఆదేశం మేరకు వైకుంఠ ద్వార రక్షణ చేస్తున్నాడు.

దేవాదిదేవుడైన భగవానుడు రమాదేవితో అంతఃపురంలో క్రీడిస్తున్నాడు.

మహారాజా! ఆ సమయంలో ఒకసారి అనుకోకుండా అత్యవసర పనిమీద వాయుదేవుడు భగవంతుడైన జనార్దనుని దర్శనార్థమై వచ్చాడు. ఆదిశేషుడు అతనిని ద్వారంలో బంగారుకర్రతో అడ్డగించాడు. అప్పుడు వాయుదేవుడు కోపంతో 'ఓరీ! మూర్ఖా! నన్నెందుకు అడ్డగిస్తున్నావు? నాకు చాలా అత్యవసరమైన పని ఉన్నది'. అనగా శేషుడు వాయువుతో 'నేను శ్రీ మహావిష్ణువు ఆజ్ఞాపాలకుడను కావున నీవు అంతఃపురంలో ప్రవేశించడానికి వీలు లేదు' అన్నాడు.

ఆ మాటలు విని విశ్వప్రాణరూపుడైన వాయుదేవుడు ఇలా అన్నాడు– 'ఓరీ మూర్ఖుడా! పూర్వం ద్వారపాలకులుగా నియమించబడిన జయవిజయులను మునులు శపించారు. వాళ్ళు నీవలె అహంకారంతో ప్రవర్తించటంవల్ల మునుల శాపానికి గురై రావణ, కుంభకర్ణులుగా రాక్షసులై పుట్టారు. నీవది మరిచావా?' వాయుదేవుడు ఈ విధంగా పరిహసించగా సర్పరాజు అతనిని తీవ్ర పదజాలంతో నిందిస్తూ విషాన్ని గ్రక్కుతూ ఇలా మండిపడ్డాడు –

ఓరీ! నీవేదో పెద్ద పెద్ద మాటలాడుతున్నావే! నీకు బ్రతుకుమీద ఆశ లేదా? లోకంలో జనులు మోహాంధులై కాలగతిలో మృత్యువు సమీపిస్తున్నా తెలుసుకోలేకపోతున్నారు. నీవు కూడా ఆవిధంగా బుద్ధిలేని వానివలె అజ్ఞానంతో వ్యర్థంగా వాదరుతున్నావు. బలంలోగాని, జ్ఞానంలోగాని, వైరాగ్యంలో గాని విష్ణుభక్తుల్లో నాతో సమానమైనవాడు లేడు. నేనెల్లప్పుడు స్వామివారి అంతఃపురంలోనే ఉంటాను. ఆ శ్రీహరికి అతి సమీపంగా ఉండటం వలన ఆయన నన్ను పుత్రునికంటె ఎక్కువ ప్రేమతో చూస్తారు. లోకహితం కోరి జగత్ప్రభువు మేలుకోరి లక్ష్మీనారాయణులు నన్ను ఇక్కడ ద్వారపాలకునిగా నియమించారు' అన్నాడు.

అంతట వాయుదేవుడు ఇలా అన్నాడు – 'పిల్లి లోపల ఉన్నప్పటికీ బయట ఉన్న ఏనుగుతో సమానం కాదు కదా! రత్నపాన్పుపై శయనించిన రాజును సేవించే సేవకుడు ఆ పాన్పుపై కూర్చున్నంతమాత్రాన అతడు రాజపుత్రునికంటె గొప్పవాడవుతాడా? రాజకుమారుడు అతనికంటె తక్కువవాడవుతాడా? శేషుడా! చెప్పు.

ఈ విధంగా వారిరువురు వాదించుకుంటూ ఉండగా గరుడధ్వజుడైన శ్రీమహావిష్ణువును లక్ష్మీదేవి మేల్కొల్పింది. వెంటనే ఆయన లేచి 'ఆదిశేషా! నీవలా అరుస్తున్నావెందుకు? పరవురుషుడెవడైనా వచ్చాడా?' అని అడుగగా సర్పరాజు ఇలా అన్నాడు –

మలయాద్రిపై నివసించే వాయుదేవుడు మిక్కిలి గర్వితుడై వేళకాని వేళ వెంటనే అంతఃపురంలో ప్రవేశించటానికి ప్రయత్నిస్తున్నాడు. దురహంకారుడైన ఇతడు అనరాని మాటలంటున్నాడు' అని శేషుడు చెప్పగా అందరి మనసుల్లోని భావాలను ఎరిగిన శ్రీహరి తన భావాన్ని తన చేష్టలద్వారా తెలియజేస్తూ ద్వారం వద్దకు వచ్చాడు.

ఆ వెంటనే వాయుదేవుడు వేదగోచరుడు, పురాణ పురుషుడు అయిన శ్రీహరికి సాష్టాంగ నమస్కారం చేసి ఆయన్ను స్తుతించాడు. అప్పుడు పద్మనేత్రుడైన శ్రీహరి వాయువును చూచి ఇలా అన్నాడు - 'పుత్రా! మిక్కిలి గౌరవనీయుడైన ఆదిశేషునితో నీవెందుకు పోట్లాడుతున్నావు?' అని ఈ విధంగా శ్రీహరి పలుకగా రెండు కర్ణపుటములతో ఆ వాగమృతాన్ని గ్రోలి వాయుదేవుడు మిక్కిలి భక్తియుక్తుడై మిన్నకున్నాడు.

అంతట ఆదిశేషుడు భగవంతునితో 'స్వామీ! నేను చాలా సమర్థుడను. బలంలో కాని, జ్ఞానంలో గాని నీ ప్రేమకు పాత్రుడగుటలో కాని, భూలోకంలోగాని, స్వర్గలోకంలో గాని, బ్రహ్మలోకంలో గాని నాతో సమానమైనవాడు లేడు' అన్నాడు. ఆదిశేషుని మాట విని శ్రీహరి నవ్వుతూ చాలా బాగుంది' అని మెచ్చుకొని ఆ సర్పరాజుతో ఇలా అన్నాడు -

## వాయుశేషుల బలపరీక్ష

కేవలం మాటలలో ఆడంబరం పనికిరాదు. నీ పౌరుషాన్ని క్రియలో చూపించాలి. మీయిద్దరి బలా బలాలను ఇంద్రుడు మొదలైన దేవతలందరూ పరీక్షిస్తారు. ఇక్కడికి ఉత్తరదిక్కున మేరుపుత్రుడైన పర్వతం ఉన్నది. నీవు నీ శరీరమనే తాడుతో దాన్ని బంధించు. నీవు నీ బలాన్నంతటిని ఉపయోగించి దృఢంగా ఆ పర్వతాన్ని పట్టి ఉంచు. నాయనా! నీవు విషజ్వాలలు కక్కుతూ బుసలు కొడుతూ నీ బలాన్ని ప్రదర్శించు' అని ఆజ్ఞాపించాడు.



హృషీకేశుని మాటవిని సంతోషంతో శరీరం ఉప్పొంగగా ఆ సర్పరాజైన ఆదిశేషుడు ఆనందాద్రిని తన శరీరమనే తాడుతో బంధించి కదలకుండా పట్టి పెట్టాడు. ఆ తరువాత వేగవంతులలో శ్రేష్ఠుడైన వాయుదేవుని రమ్మని పిలిచాడు. అదిచూచి వాయుదేవుడు ఆ పర్వతాన్ని సమీపించాడు. వాసుదేవుని ఆజ్ఞతో దేవతలందరు చూస్తుండగా తనయందు భగవంతునికి గల వాత్సల్యాతిశయాన్ని మనసులో తలచుకొని వాయుదేవుడు బలగర్వితుడై ఆ పర్వతాన్ని కదిలించడానికి మహావేగాన్ని చూపాడు.

కాని ఆ పర్వతాన్ని ఆదిశేషుడు చుట్టి పట్టి ఉండడం వలన అది కొంచెం కూడా కదలలేదు. అంతట వాయుదేవుడు కోపంతో ఇంకా మహావేగంతో విజృంభించాడు. అయినా పర్వతం కదలలేదు ఈ విధంగా మహాబలశాలులైన వాయుశేషులిద్దరూ పరస్పరం తమ బలప్రదర్శనలో పోటీపడుతుండగా ప్రపంచమంతా తారుమారైంది. లోకమంతా హాహాకారాలు మిన్నుముట్టినాయి.

అప్పుడు బ్రహ్మాది దేవతలు వాయుదేవుని తన బలాన్ని ఉపసంహరించమని వేడుకొన్నా ఆయన వినలేదు. అంతట సర్పరాజు భగవంతుడి అభిప్రాయాన్ని తెలుసుకొని దేవతలను సంతోషపరుస్తూ తన పడగల మధ్యలో కొంచెం పట్టును సడలించాడు. అప్పుడు వాయుదేవుడు మహావేగంతో వీచాడు. వెంటనే చిటికెనవేలు దూరేంత సందు వదలగా వాయుదేవుడు ఆ పర్వతాన్ని మహావేగంతో తాకాడు. ఆ వేగానికి ఆదిశేషునితోపాటు ఆ పర్వతం దక్షిణ దిశగా అనేక లక్షల యోజనాల దూరంలో పడింది.

అంతట మేరువు మహాబలుడైన వాయుదేవుని స్తుతించి 'స్వామీ! నా బిడ్డయైన ఈ పర్వతాన్ని రక్షించండి' అని ప్రార్థించాడు. అది విని వాయుదేవుడు మేరుపుత్రుడైన ఆనందాద్రిని రక్షించాడు. దానిని సువర్ణముఖరీ నదికి ఉత్తర తీరంలో నిలిపాడు. ఆ పర్వతరాజాన్ని ఆదిశేషునితోపాటు అక్కడ ఉంచాడు. అప్పుడు దేవతలంతా వాయుదేవునితో ఆదరంగా ఇలా అన్నారు -

'వాయుదేవా! ఈ పర్వతం ఆదిశేషుని అంశతో పుట్టింది. శ్రీహరి ప్రేరణచేత ఆయన నివసించుట కొరకు ఈ పర్వతం పుట్టింది. నీవు దీనిని ఈ బలపరీక్ష నెపంతో ఈ సువర్ణముఖరీ తీరానికి తీసుకువచ్చావు. మీ సంవాదం నెపంతో శేషుడు దీనిని తన స్వస్థానం నుండి పెకలించాడు. మహామాయాస్వరూపుడైన భగవంతుడు ఈ విధంగా నీకు మోహం, భ్రమ కలిగించాడు. **(సశేషం)**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ

ధారావాహికం



గత సంచిక తరువాయి

## స్వర్ణ రథోత్సవం

ఆరవరోజు సాయం సంధ్యా సమయంలో అస్తమిస్తున్న సూర్యకిరణాలు ప్రసరిస్తుండగా, దివ్యకాంతులీనుతున్న స్వర్ణరథంలో ఇరువురు దేవేరులతో కలిసి మలయప్ప స్వామివారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు నేత్రానందం కలిగిస్తారు. పోయిన బ్రహ్మోత్సవాల్లో తన ప్రియ భక్తుడు వాయుపుత్రునిపై ధనుర్బాణాలు ధరించి, అయోధ్యాధీశునిగా, కటి-వరద హస్తాలతో కలియుగ దైవంగా స్వామి దర్శనమిచ్చారు.

బ్రహ్మదేవుని శూన్యరథం, గజ-అశ్వ-వృషభాదులు యథావిధిగా స్వర్ణ రథోత్సవంలో కూడా పాల్గొంటాయి. దాస భక్తుల నృత్యాలతో, భజన బృందాల కోలాహలంతో మాడవీధులు కడు రమణీయతను సంతరించుకుంటాయి.

స్వర్ణం అంటే ''మిక్కిలి ప్రకాశించేది'' అని వ్యుత్పత్తి. బంగారం మహా శక్తివంతమైన లోహం. ఈ లోహం శరీరాన్ని తాకుతుంటే దేహంలో రక్తప్రసరణ చక్కగా జరుగుతుంది. అనేకానేక ఔషధోత్పత్తుల్లో స్వర్ణం వినియోగించబడుతుంది. ఆర్థిక ఇబ్బందుల్ని అధిగమించడంలో యుగ యుగాల నుంచి ఈనాటివరకు, స్వర్ణం పాత్ర వెలకట్టలేనిది. బంగారాన్ని తాకట్టు పెట్టో లేదా తెగనమ్మో, కష్టాల కడలి నుండి గట్టెక్కడం సత్యహరిశ్చంద్రుని కాలం నుండి, ఆధునిక జగత్తులో కూడా మనం చూస్తూనే ఉన్నాం. వర్తక, వాణిజ్య వినిమయాలకు సువర్ణ నాణాలను వినియోగించే సాంప్రదాయం, కలియుగారంభం నుండి, ఈ మధ్య కాలం వరకూ ఉండేది. పద్మావతీ పరిణయం సందర్భంగా శ్రీనివాసుడు కుబేరుణ్ణుంచి అప్పుగా తీసుకుంది సువర్ణ ముద్రికలే.



స్వర్ణం లభ్యమయ్యేది భూమి నుంచే. భూదేవి సాక్షాత్తు శ్రీవారిలో భాగం. శ్రీవారి ఇల్లు బంగారం. ఆనందనిలయ గోపురం బంగారుమయం. ధ్వజస్తంభం బంగారు తాపడం చేయబడింది. ఇంటిలోని పాత్రలు బంగారువి. సింహాసనం బంగారుది. ధరించేది మేలిమి బంగారు నగలు. రాజాధి రాజుల

నుండి సామాన్యుల వరకూ భక్తులందరూ స్వామివారికి హుండీలో సమర్పించేది కనకమే.

సకల సంపదలకు, ధన కనకాదులకు ఆధిపత్యం వహించేది శ్రీదేవిగా పిలవబడే లక్ష్మీదేవి. ఆమె కూడా శ్రీవారిలో భాగమే. బంగారంతో ఇంత ప్రగాఢమైన అనుబంధం కలిగిన శ్రీవారు ఇరువురు దేవేరులతో కలిసి స్వర్ణ రథంలో ఊరేగుతుండగా చూచి తరించటం ఓ అలౌకిక, ఆధ్యాత్మికానుభూతి.

దేవేరులతో స్వామివారు స్వర్ణరథంపై ఊరేగే ఈ స్వర్ణరథోత్సవం శ్రీవారి మహోన్నతిని, సార్వభౌమత్వాన్ని, శ్రీపతిత్వాన్ని, భూదేవీనాథత్వాన్ని సూచిస్తుంది.

స్వర్ణ రథోత్సవంలో, కళ్యాణకట్ట సంఘం వారు సమర్పించిన బంగారు గొడుగును రథంపై అలంకరిస్తారు. కేవలం మహిళా భక్తులు మాత్రమే తేరును లాగటం ఈ స్వర్ణ రథోత్సవ ప్రత్యేకత.

ఈ రథోత్సవాన్ని ''సువర్ణ రంగడోలోత్సవం'' అని కూడా వ్యవహరిస్తారు. ఉయ్యాలసేవ ఈ రథోత్సవంలో అంతర్భాగం కావడం వల్ల, బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు సాయంత్రం జరిగే ఉయ్యాలసేవ స్వర్ణరథ వాహనం నాడు జరగదు.

స్వర్ణ రథోత్సవ దర్శనం ద్వారా శ్రీదేవి కరుణతో సమస్త భోగభాగ్యాలు, అష్టైశ్వర్యాలు, భూదేవి కరుణతో భూ సంపద, కనక, మణిమయాదులు, నవరత్నాలు, ధాన్యసంపద, పశుసంపద, శ్రీవారి కరుణతో సర్వసుఖాలూ, శుభాలు చేకూరుతాయి.

## గజవాహనం

బ్రహ్మోత్సవాల్లో ఆరవనాటి రాత్రి గజేంద్ర మోక్ష ఘట్టానికి గుర్తుగా జరిగే ''గజవాహనసేవ''లో మలయప్పస్వామివారు ఒక్కరే గజరాజుపై ఊరేగుతారు.

పూర్వకాలమునందు చతురంగ బలాలలో గజబలం ఒకటి. ''గజం'' అంటే విశ్వాసానికి సంకేతం. రాజులకు పట్టాభిషేకం కావించేటప్పుడు వారిని గజాధిష్ఠితులుగా చేసి ఊరేగిస్తారు. ఓ విశిష్ట వ్యక్తిని ఘనంగా సత్కరించాలంటే, వారిని ''గజారోహణ'' చేయించే సాంప్రదాయం నేటికీ ఉంది. పూర్వం రాజుల శక్తి సామర్థ్యాలను, సేవా పాటవాన్ని గజబలంతో సూచించేవారు. ఎన్ని ఎక్కువ ఏనుగులుంటే అంత ఎక్కువ సైన్యబలం ఉన్నట్లు లెక్క. ఏనుగు కుంభస్థలం లక్ష్మీనివాసంగా అభివర్ణింపబడుతుంది.

తిరమల ఆలయ నిర్మాణంతో కూడా గజరాజులకు ప్రత్యక్ష సంబంధం ఉంది. ఆలయ నిర్మాణం జరిగేటప్పుడు ఆలయ మండప స్తంభాలను క్రిందనే చెక్కించి వందలాది ఏనుగుల ద్వారా కొండపైకి చేర్చేవారు. మైళ్ళదూరం పైకి ఎక్కుకుంటూ వెళ్ళి ఆలయ కుడ్యాలకు వాడిన టన్నులకొద్దీ బరువైన అత్యంత భారీ రాతి ఇటుకలనూ, పైకప్పుకు ఉపయోగించే రాతి పలకలనూ, శిల్పస్తంభాలనూ గజరాజులు భద్రంగా కొండపైకి చేర్చాయి. ఒక్క వేయికాళ్ళ మండపానికే ''వేయి'' స్తంభాలుండేవంటే, మొత్తం ఆలయ నిర్మాణానికి ఎన్ని స్తంభాలను వినియోగించారో ఊహించుకోవచ్చు.

అంత శ్రమకోర్చి, శ్రీవారి ఆలయానికో రూపం ఇచ్చిన గజరాజుల ఋణం ఏమిచ్చి తీర్చుకోగలం?

అంతేకాదు. తిరుమలను దర్శించుకున్న వందలకొద్దీ రాజులనూ, వారి పరివారాలనూ ఏనుగు అంబారీలే సురక్షితంగా పైకి చేర్చేవి.

స్వామివారితో నిత్యం పాచికలాడే, వారి ప్రియభక్తుడైన ''హాథీరాం బాబా'' ను అప్పటి పాలకులు ఏవో నిందారోపణలపై ఖైదు చేయగా, శ్రీవారు ఏనుగు రూపంలో వచ్చి, రాత్రికి రాత్రే బండెడు చెరుకుగడలను పిప్పి చేసి అతణ్ణి రక్షించి, ఆ పాలకులను కూడాపరమ భక్తులుగా మార్చిన చరిత్ర మనందరికీ చూచాయగా తెలుసు (వివరంగా ముమ్ముందు తెలుసుకుందాం) అందుకే ఆయన హాథీరాంగా పిలువబడ్డాడు.

అంతటి ప్రశస్తి గాంచిన గజరాజుపై శ్రీనివాసుడు ఊరేగుతూ ఉంటే అత్యద్భుతమైన దృశ్యం ఆవిష్కరింపబడుతుంది.

గజేంద్రమోక్ష పురాణాన్ననుసరించి ఒకనాడు జలక్రీడలాడుతూ మొసలికి పట్టుబడ్డ గజేంద్రుడు దానితో చాలాకాలం పోరాడి, కడు దయనీయ స్థితిలో శ్రీమహావిష్ణువును ఇలా ప్రార్థించాడు.

**లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్**
**నీవే తప్ప నితఃపరం బెరుగ మన్నింపందగున్ దీనునిన్**
**రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!**

గజేంద్రుని ఆక్రందన విన్న శ్రీమహావిష్ణువు, ''సిరికిన్ జెప్పకన్'', అంటే సమక్షంలోనే ఉన్న శ్రీమహాలక్ష్మికి సైతం చెప్పకుండా, హుటాహుటిన అలవైకుంఠపురం వీడి, మొసలిని సంహరించి, గజరాజును కాపాడాడు. భక్తులను కాపాడాలనే విష్ణుమూర్తి ఆత్రుత అలాంటిది మరి.

సంసారం ఒక సరస్సు. మొసలి కర్మకు సంకేతం. ప్రతి భక్తుడు గజేంద్రుడు. సంసారసాగరంలో కొట్టుమిట్టాడుతూ, ''కర్మ'' అనబడే మొసలి కోరలకు చిక్కి శరణు వేడిన వారికి కర్మ బంధాల నుండి విముక్తిని ప్రసాదించేవాడు శ్రీవేంకటేశ్వరుడు. ఎంతటి బలం కల ఏనుగైనా మావటివాని అంకుశానికి ఏ విధంగా లొంగిపోతుందో, అదేవిధంగా, మానవుడు ఎంతటి బలవత్తరమైన ప్రాపంచిక విషయాల్లో

చిక్కుకున్నా, శ్రీవారు నైపుణ్యం కలిగిన మావటివానిలా ఆ భవబంధాలను తొలగించగలరు.

గజరాజులు ప్రతిరోజు శ్రీవారి వాహన సేవల్లో వాహనం ముందు ప్రత్యక్షంగా పాల్గొంటూనే ఉంటాయి. తమ పూర్వీకుడైన గజేంద్రుణ్ణి రక్షించినందుకు గాను తమ కృతజ్ఞతను ప్రదర్శించే అవకాశం, ''స్వామివారు తమపై ఎప్పుడెప్పుడు అధిరోహిస్తారా!'' అని ఆ మత్తేభాలు ఆశగా ఎదురు చూస్తుంటాయి. బ్రహ్మోత్సవాల్లో గజవాహనం నాడు గజరాజులకు ఈ పరమాద్భుతమైన అవకాశం లభిస్తుంది. తమ జాతిలో ఏ ఒక్క ఏనుగుకు ఆ అదృష్టం లభించినా జాతి మొత్తానికి సంతోషదాయకమే కదా! స్వామి శరణాగత వాత్సల్యానికి గజవాహనసేవ ఓ ప్రత్యక్ష తార్కాణం. భక్తితో ప్రార్థిస్తే, గజేంద్రుణ్ణి రక్షించినట్లు మనని కూడా శ్రీవారు రక్షిస్తారని గజవాహన సేవ ద్వారా వ్యక్తం అవుతుంది.

తాళ్ళపాక అన్నమయ్య గజవాహన వైభవోత్సవాన్ని ఇలా మనోహరంగా వర్ణించాడు –

**చొల్లపు జుట్టుతోడి చుంగుల రాజసముతో**
**వెల్లివిరిగా నేగి వెలదులు గొలువ**
**వీపు గుచాలు మోపి వెలది కౌగిలించగా**
**నేపున నేనుగు నెక్కి విదె దేవుడు**
**చేపట్టి యాపె చేతులు బిగ్గె బట్టక**
**పై పై వీధుల వెంట బరువు దోలీని**

మూడు వాహనోత్సవాలతో అత్యంత ప్రత్యేకతను సంతరించుకున్న ఆరవరోజు బ్రహ్మోత్సవాలు ముగిశాయి (మిగిలిన అన్ని రోజులూ రెండు వాహనసేవలు మాత్రమే జరుగుతాయి).

ఆరవరోజు ఉత్సవ కార్యక్రమం ఈ విధంగా ఉంటుంది –

- **హనుమంత వాహనం : ఉ.9-11 గం.**
- **స్వర్ణ రథోత్సవం : సా. 4-6 గం.**
- **గజవాహనం : రా.8-10 గం.**

## సూర్యప్రభ వాహనం

బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు ఉదయం సప్తగిరీశుడు ఒక్కరే – ఏడు గుర్రాలు పూన్చిన రథంపై, ఏడంతస్తుల కనకపు సింహాసనాన్ని అధిష్ఠించి, వజ్రకవచధారియై; బాలభానుడు తన లేలేత కిరణాలతో నమస్కారాలు సమర్పిస్తుండగా మాడ వీధుల్లో ఊరేగుతూ ''సూర్యమండలం మధ్యనున్న నారాయణమూర్తిని నేనే'' – అని భక్తులకు సందేశమిస్తారు.

''ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తీ నారాయణః'' అంటే ''సూర్యమండలం మధ్యలో ఉన్న శ్రీమన్నారాయణుడు ఎల్లప్పుడూ ధ్యానింపదగినవాడు'' అని వేదశ్రుతి.



అందుకే హిందూ సాంప్రదాయంలో ప్రతిరోజూ ఉదయం సూర్యనమస్కారాలు, సూర్యోపాసన చేసే సంస్కృతి ఉంది. గాయత్రీ మంత్రంతో సూర్యనారాయణుణ్ణి ఆరాధిస్తాము. సూర్యుడు తేజోనిధి. నిత్యం కంటికి కనిపించే ప్రత్యక్షదైవమైన సూర్యనారాయణుడు ప్రకృతికి, జీవులకు చైతన్యప్రదాత. వర్షాలు, వాటివల్ల కలిగే పాడి పంటలు, చంద్రుడు అతని షోడశ కళల వల్ల వృద్ధిచెందే ఔషధులు, అన్నీ సూర్యప్రసాదితాలే. సూర్యుడు కర్మసాక్షి.

నేడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారిని తట్టుకునే రోగనిరోధక శక్తి, లేలేత సూర్యకిరణాల ద్వారా లభించే ''విటమిన్ డి'' లో మెండుగా ఉంటుందని వైద్యులు, శాస్త్రవేత్తలు చెపుతున్నారు. మయూరాదులు, సాంబుడు వంటి భక్తులు సూర్యోపాసన చేతనే శారీరక అనారోగ్యం నుండి విముక్తులైనట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది.

**"ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్!!"**

శ్రీమహావిష్ణువుకు సూర్యుడు కుడికన్నుగా, చంద్రుడు ఎడమనేత్రంగా చెబుతారు. అందుకే విష్ణుమూర్తి దివారాత్రాలకు (పగలు, రేయి) అధిపతి.

రాజవంశాలలో సూర్యవంశం ప్రథమం. శ్రీమహావిష్ణువు పుత్రుడు బ్రహ్మతో మొదలైన సూర్యవంశంలో ముప్ఫయ్యెనిమిదవ తరానికి చెందినవాడు శ్రీరామచంద్రుడు బ్రహ్మకు మరీచి, అతనికి కాశ్యపుడు, అతనికి సూర్యుడు జన్మించారు. రామ-రావణ సంగ్రామంలో శ్రీరామచంద్రుడు ''ఆదిత్య హృదయం'' పఠించి, తన పూర్వజుడు, వంశనామ కారకుడు అయిన సూర్యనారాయణుని ఆశీస్సులు పొంది, తద్వారా రావణసంహారం గావించాడు.

సూర్యుడు నమస్కార ప్రియుడు. మనకు అంతులేని ఫలాలు ప్రసాదించినా, ఏ ప్రతిఫలం ఆశించడు. మనం త్రికరణశుద్ధిగా చేసే నమస్కారానికే ఆయన సంతృప్తి చెందుతాడు. ''ఆరోగ్యం, కవిత్వం, విద్య, ఐశ్వర్యం, సంతానం – ఇవన్నీ సూర్యదేవుని అనుగ్రహం వల్ల సిద్ధిస్తాయి'' అని సూర్యశతకం తెలియజేస్తుంది. సూర్యోపాసన, చక్షురోగ (కంటి సంబంధిత వ్యాధులు) నివృత్తి గావిస్తుందని యజుర్వేదంలోని చాక్షూషోపనిషత్తు విదితపరుస్తుంది. చర్మరోగస్తులు సైతం సూర్యనారాయణుని పూజించి బాధా విముక్తులవుతారు.

ఇప్పుడు ఓసారి మలయప్పస్వామివారు అధిరోహించిన వాహనాన్ని దగ్గర్నుంచి దర్శించుకుందాం. జపాకుసుమాలు ధరించిన స్వామి వాహనానికి, గరుత్మంతుని అన్నగారైన ''అనూరుడు'' సారథ్యం వహిస్తున్నాడు. రథాన్ని లాగుతున్న ఏడు గుర్రాలను ఏడు ఛందస్సులుగా పరిగణిస్తారు. గాయత్రి, బృహతి, ఉష్ణిక్, జగతి, త్రిష్టుప్, అనుష్టుప్, పంక్తి అనేవి ఆ ఛందస్సుల పేర్లు. విష్ణు సహస్రనామంలో ''అనుష్టుప్ ఛందః'' అని పఠిస్తాం. ''అనుష్టుప్ అనబడే ఛందస్సులో వ్రాయబడినది'' అన్నమాట.

అనూరుడు అంటే ''ఊరువులు (తొడలు) లేకుండా జన్మించినవాడు'' అని అర్థం. సూర్య రథసారథి అయిన అనూరుడు; తన తమ్ముడూ, విష్ణుమూర్తి వాహనమైన గరుత్మంతుని వద్దకు వచ్చాడు.

ఆహా, ఏమి ఆ అపూర్వ సంగమము!

ఒకరేమో జగతి కాలచక్రాన్ని నిర్ధారించే సూర్యదేవుని రథానికి సారథి. మరొకరేమో జగద్రక్షకుడైన శ్రీమన్నారాయణుని ముల్లోకాలను విహరింపచేసే వాహనము.

ఇంతటి ధన్యులైన ఇద్దరు పుత్రరత్నాలను కన్న ''వినత'' చేసుకున్న పూర్వజన్మల పుణ్యఫలం ఎంత గొప్పదో కదా!

సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుని దర్శనం భక్తులకు పూర్ణ ఫలాన్ని ప్రసాదిస్తుంది. ఈ వాహనసేవ దర్శనం ద్వారా భక్తకోటికి ఆరోగ్యం, ఐశ్వర్యం సంపూర్ణంగా సిద్ధిస్తాయి.

**అదివో చూడరో అందరు మ్రొక్కరో**
**ముదిగొనె బ్రహ్మము కోనేటి దరిని**
**రవిమండలమున రంజిల్లు తేజము**
**దివి చంద్రునిలో తేజము**
**భువి ననలంబున బొడమిన తేజము**
**వివిధంబులైన విశ్వతేజము**

-అంటూ ఆ శ్రీనివాసుడే సూర్యమండల మధ్యవర్తియగు శ్రీమన్నారాయణుడని ధృవపరచి, కీర్తించాడు పదకవితా పితామహుడు అన్నమయ్య.

**స్వయం ప్రకాశా గోవిందా!**
**ప్రత్యక్షదేవా గోవిందా!!**
**దినకరతేజా గోవిందా!!!**

## చంద్రప్రభ వాహనం

ఏడవనాటి రాత్రి వేంకటేశ్వరుడు ఒక్కరే, తెల్లని వెన్నెలతో కూడుకున్న చల్లని వాతావరణంలో, చంద్రప్రభ వాహనంపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ దర్శనమిస్తారు. పగలు సూర్యప్రభ వాహనంపై ఊరేగిన విష్ణుదేవుడు; ఆనాటి రాత్రి నిశాకరుడై, అమృతకిరణాలు ప్రసరించే చంద్రప్రభ వాహనంపై ఊరేగుతారు. శ్రీకృష్ణుడు తన విభూతులను తెలుపుతూ, ''నక్షత్రాణా మహం శశి'' అంటూ తనను తాను చుక్కల్లో చంద్రునిగా అభివర్ణించుకున్నాడు.



''చంద్రుడు'' అంటే అమృతానికి నిధి అని అర్థం. అమృతకిరణుడు, సుధాకిరణుడు, హిమకిరణుడు అయినటువంటి చంద్రప్రభ వాహనంలో; ధవళ వస్త్రాలు, శ్వేతవర్ణ పుష్పాలు ధరించి ''ధన్వంతరి'' అలంకారంలో అలరిస్తున్నారు మలయప్పస్వామి.

క్షీరసాగర మథనంలో కల్పవృక్షము, కామధేనువు, శ్రీమహాలక్ష్మిలతో పాటుగా; చేతిలో అమృతకలశంతో ధన్వంతరి ఉద్భవించారు. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారం అయిన ధన్వంతరిని ఆయుర్వేద వైద్యానికి మూలపురుషుడిగా వర్ణిస్తారు. ఆయనను పూజిస్తే ఆరోగ్యం వృద్ధి చెందుతుందని ప్రతీతి. దీపావళికి రెండు రోజుల ముందు వచ్చేటటువంటి, ధన్వంతరి జన్మతిథి అయిన ధనత్రయోదశిని ఉత్తరభారతదేశంలో ''ధంతేరాస్'' పండుగగా జరుపుకుంటారు. అదే తిథిలో బంగారానికి ప్రతిరూపమయిన లక్ష్మీదేవి సైతం క్షీరసాగర మథనంలో ఉద్భవించడం వల్ల ఆరోజు బంగారం కొనడం, లక్ష్మీదేవిని పూజించడం అనే సాంప్రదాయాలు అమల్లోకి వచ్చాయి. ఉత్తరభారతదేశంలో ఐదు రోజులపాటు జరుపుకునే అతి పెద్ద పండుగ ''దీపావళి''లో మొట్టమొదటి రోజు

''ధనత్రయోదశి''. ఆ రోజును భారత ప్రభుత్వం ''జాతీయ ఆయుర్వేద దినం''గా ప్రకటించింది.

ధన్వంతరి ఆయురారోగ్యాలకు అధిపతి అయినందున, ప్రస్తుత విపత్కర పరిస్థితుల దృష్ట్యా తిరుమల క్షేత్రంలో ప్రతిరోజూ ఉదయం యోగవాశిష్ఠం, తదుపరి ధన్వంతరి మహామంత్ర పారాయణం జరుపబడుతోంది. తిరుమల క్షేత్రం నుండి ఉదయం 7 గంటలకు శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం గావించబడే ఈ స్తోత్ర పఠనంలో మనం కూడా శృతి కలిపి, ఉడతాభక్తిగా మనవంతు కృషి చేద్దాం.

పురాణేతిహాసాల్లోకి వెళితే ''కర్కటి'' అనబడే బ్రహ్మరాక్షసి, ఘోరమైన తపస్సు గావించి బ్రహ్మ నుండో వరం పొందింది. ఆ వరం ప్రకారం, కర్కటి అత్యంత సూక్ష్మ క్రిమిగా మానవ శరీరాల్లోకి ప్రవేశించి ''విషూచికా'' అనబడే విషజ్వరాన్ని వ్యాపింపచేసి, శరీరాంతర్భాగాలన్నింటినీ ఛిద్రం గావించి, రోగగ్రస్త శరీరావశేషాలను సుష్టుగా భుజించి, తన క్షుద్బాధను తీర్చుకోగలుగుతుంది. మానవజాతి మొత్తాన్ని అప్రయత్నంగా, ఏకమొత్తంగా దిగమింగాలని దాని పన్నాగం. సమస్త మానవాళికీ మహమ్మారిలా దాపురించిన ఆ రక్కసి కోరల బారిన పడే మానవుల విపరీత లక్షణాలు, దాని నుండి తప్పించుకునే మార్గాంతరం, పఠించాల్సిన స్తోత్ర మంత్రాలను కూడా బ్రహ్మదేవుడే సెలవిచ్చాడు. ఆ ''విషూచికా'' అనబడే విషజ్వరమే నేటి ''కరోనా'' అని విజ్ఞుల నమ్మకం. దాని కబంధ హస్తాల నుండి మానవాళిని కాపాడడం కోసం, బ్రహ్మదేవుడు ఆనతిచ్చినట్లుగా,

**"....ప్రాణాపాయకరస్య, కరోనా నామకస్య..."**

అనే సంకల్పంతో మొదలై, యోగవాశిష్ఠ పారాయణం జరుగుతుంది. తరువాత

**"అచ్యుతానంద గోవింద విష్ణో నారాయణామృతః**
**రోగాన్మే నాశయాశేషాన్ ఆశు ధన్వంతరే హరే"**

అన్న శ్లోకంతో ప్రారంభమై, ధన్వంతరీ మహామంత్ర పారాయణం జరుగుతుంది. నిత్యం క్రమం తప్పకుండా ఈ మంత్రపారాయణం చేస్తే, ఉచ్చారణ శుద్ధి కావడంతో పాటుగా; ప్రాణాయామ ఫలం పొంది, ఊపిరితిత్తులు దృఢమై, శ్వాస సంబంధిత వ్యాధుల నుండి రక్షింపబడతారని విజ్ఞుల ఉవాచ.

చంద్రునితో తెలుగువారికి విశేషానుబంధం ఉంది. ప్రతి మాతృమూర్తి తన పిల్లలకు ''చందమామ రావె'' అనే పాటతో చల్లనయ్యకు ఆప్యాయంగా మేనమామ వరుస కలుపుతూ, గోరుముద్దలు తినిపిస్తుంది. ప్రేయసీ-ప్రియులకు వెన్నెల రాత్రి విహారాలంటే ఎంతో ఇష్టం. అందమైన ముఖాన్ని చంద్రబింబంతో పోలుస్తారు. తెలుగు సాహిత్యంలో పున్నమి వెన్నెల మీద రాయబడినంత కవిత్వం, బహుశా మరే ఇతర ఇతివృత్తం పైనా వెలువడలేదంటే అతిశయోక్తి కాదు.

''చంద్రమా మనసో జాతః'' అంటే, చంద్రుడు భగవంతుడి మనస్సు నుండి ఉద్భవించినట్లుగా పురుషసూక్తం చెబుతుంది. ''పుష్ణామీ చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః'' అని పురుషోత్తమ ప్రాప్తి యోగంలో ప్రకటించబడింది. అంటే ''చంద్రకిరణ స్పర్శ తోనే ఔషధ మొక్క వృద్ధి చెందుతుంది'' అని అర్థం. ఔషధాలు లేకపోతే మానవుని మనుగడ ప్రశ్నార్థకమవుతుంది కనుక, ఓషధీశుడైన చంద్రుడే మనకు జీవనాధారం.

పురాణాలలో చంద్రుని ప్రస్తావన విస్తృతంగా లభిస్తుంది. చంద్రుడు కూడా క్షీరసాగర మథనంలోనే ఉద్భవించాడు. చంద్రుడు శివునికి శిరోభూషణం. హాలాహల సేవనంతో విపరీతమైన ఉష్ణతాపానికి గురైన గరళకంఠుడు, చల్లనైన చంద్రుణ్ణి శిరస్సున ధరించి తాపోపశమనం పొందుతాడు. శైవసంప్రదాయానికి మూలమైన శివునికి శిరోభూషణంగా భాసిల్లే చంద్రుడు ప్రఖ్యాత వైష్ణవ క్షేత్రమైన తిరుమలలో శ్రీవారికి చంద్రప్రభ వాహనంగా ఉండటం అత్యంత విశేషం. శివకేశవుల కెంత మాత్రం తారతమ్యం లేదనటానికి మరో ప్రబల నిదర్శనం.

చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగి చంద్రకాంత మణులను స్రవింపచేస్తాడు. ''యత ప్రహ్లాదయాత్ చంద్రః'' అంటే చంద్రుని వల్ల సంతోషం కలుగుతుంది. అదేవిధంగా, చంద్రప్రభ వాహనంపై స్వామిని చూడగానే భక్త్యావేశాలు ఉప్పొంగి, పారవశ్యంతో భక్తుల నేత్రాలు వికసిస్తాయి. ''సూర్యుని తీక్ష్ణత్వం, చంద్రుని కోమలత్వం రెండూ తన స్వరూపమే'' అని శ్రీనివాసుడు ఏడవరోజు జరిగే సూర్యప్రభ మరియు చంద్రప్రభ వాహనాల ద్వారా వెల్లడిస్తున్నారు. ఈ వాహన సందర్శనం ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికమనీ; అందువల్ల త్రివిధ తాపాలు నివారింప బడతాయని ప్రతీతి. చంద్రుని లాంటి చల్లనైన మనస్సు కలిగి, చల్లని వెన్నెల వంటి ప్రశాంతతను తన చుట్టూ ఉన్నవారికి పంచి పెట్టాలని ఈ వాహనం సందేశిస్తుంది.

చంద్రుని శోభను అన్నమయ్య ఈ విధంగా వర్ణించాడు –

**చందమామ రావో జాబిల్లి రావో**
**కుందనపు పైడికోర వెన్నపాలు తేవో**

నగుమోము చక్కనయ్యకు నలుగు పుట్టించిన తండ్రికి నిగములందుండే అప్పకు మా నీలవర్ణునికి

జగమెల్ల ఏలిన స్వామికి చక్కని ఇందిర మగనికి ముగురికి మొదలైన ఘనునికి మా ముద్దుల మురారి బాలునికి.

**(సశేషం)**

# శ్రీవేంకటేశ్వర ప్రపత్తి

## మనిషికి దైవానికి మధ్య ఉన్న అద్వితీయ బంధం

: డా|| చిట్యాల రవీందర్



ప్రపత్తి అంటే కేవలం తల వంచడం లేదా భక్తితో చేతులు జోడించడం వంటి బాహ్య ప్రక్రియలు మాత్రమే కాదు. ఇది అంతరంగంలో జరిగే ఒక గొప్ప మార్పు. 'నేను' అనే అహంకారాన్ని, తనపై తనకున్న నమ్మకాన్ని పూర్తిగా వీడి, 'స్వామీ! ఈ విశ్వంలో, నా జీవితంలో సమస్తం నీవే. నీ సంకల్పమే నా గమ్యం' అని సర్వస్వాన్ని దైవ చరణాలకు సమర్పించుకోవడమే అసలైన శరణాగతి. మనిషి కేవలం ఒక సామాన్యుడైన భక్తుడు మాత్రమే కాదు. అతడు సృష్టికర్తయైన భగవంతుని ప్రతిబింబం. ఈ సత్యాన్ని హృదయపూర్వకంగా గ్రహించినప్పుడు, ఒక చిన్నబిడ్డ తన తల్లిని ఎంతటి నిశ్చింతతో, ఏమాత్రం సందేహం లేకుండా నమ్ముతుందో, అటువంటి స్వచ్ఛమైన భరోసాతో మనిషి తనను తాను స్వామికి అప్పగించుకోవాలి. ఏడుకొండల వాడైన వేంకటేశ్వరుడు అత్యంత కరుణామయుడు. సముద్రమంతటి కరుణను, ఆకాశమంతటి సహనాన్ని తన హృదయంలో దాచుకున్నవాడు. తనను ఆశ్రయించిన వారి దోషాలను, గత జన్మల పాపాలను, మనిషిలోని లోపాలను ఏమాత్రం లెక్కచేయకుండా, వారందరినీ ఒకేలా చేరదీసి రక్షించే అపారమైన గుణం కలిగినవాడు. కష్టాల్లో ఉన్న భక్తులను కంటికి రెప్పలా కాపాడి, ఆపద్బాంధవుడిగా స్వామి తన భక్తుల వెంటే నీడగా ఉంటాడు. ఈ అచంచలమైన నమ్మకం, స్వామి పై ఉన్న అపారమైన విశ్వాసమే శరణాగతికి అసలైన పునాది.

ఎప్పుడైతే మనం మన పరిమితమైన తెలివితేటలు, స్వార్థపూరిత ప్రయత్నాల కంటే, భగవంతుని సంకల్పమే గొప్పదని గుర్తించి, ఆయనకు సంపూర్ణంగా తలొగ్గుతామో, అప్పుడు మన జీవితభారం మొత్తం స్వామి తన భుజస్కంధాలపైకి తీసుకుంటాడు. మన చిన్నపాటి ఆలోచనల కంటే, సర్వశక్తిమంతమైన దైవ సంకల్పమే మన జీవితాన్ని సుగమం చేస్తుందని, ఆయన ఇచ్చేది మనకు అత్యంత మేలైనదని నమ్మడం ద్వారా మనిషికి అపారమైన మానసిక శక్తి, ధైర్యం లభిస్తాయి. ఏడుకొండలను అధిరోహించడం అనేది కేవలం భౌతికమైన యాత్ర కాదు. అది మనిషి తనలో ఉన్న అజ్ఞానాన్ని, అహంకారాన్ని జయించి ఆధ్యాత్మిక ఉన్నతికి చేరుకోవడానికి చేసే ఒక ప్రతీకాత్మక ప్రయాణం.

తిరుమల దివ్యసన్నిధిలో అడుగుపెట్టిన ప్రతిక్షణం, బాహ్య ప్రపంచపు గందరగోళపు ఆలోచనలను, లౌకిక సమస్యలను వీడి, తన మనస్సును పూర్తిగా స్వామి పాదాలపై లగ్నం చేయాలి. స్వామి పాదారవిందాలను స్మరించుకోవడం ద్వారా మనిషి తన నిజస్వరూపాన్ని తెలుసుకుని, ఈ భౌతిక ప్రపంచపు తాత్కాలిక సుఖ దుఃఖాలను మరిచిపోయే దివ్య అనుభూతిని పొందగలడు. ఆ సన్నిధిలో పొందే శాంతి, మరే ఇతర భౌతిక సుఖాల్లోనూ లభించదు.

భక్తి అంటే దైవాన్ని ప్రేమించడం. అది ఆధ్యాత్మిక యాత్రకు ఒక ఆరంభం మాత్రమే. కాని ప్రపత్తి అంటే దైవంలో పూర్తిగా లీనమైపోయి, తన అస్తిత్వాన్ని ఆయనలో కలుపుకోవడం. అది ఒక గొప్ప పరిణతి. భక్తిలో భక్తుడు వేరు. దైవం వేరు అనే ద్వైతం ఉంటుంది. కాని ప్రపత్తిలో ఆ భేదం పూర్తిగా తొలగిపోయి ఏకత్వం సిద్ధమవుతుంది. భక్తినుండి ప్రారంభమైన ప్రయాణం, క్రమంగా తన అహంకారాన్ని కరిగించుకుంటూ పూర్ణ శరణాగతికి చేరుకుంటుంది. సర్వస్వం దైవానికి అప్పగించడంలో ఉండే నిశ్చింతే ప్రపత్తిలో ఉండే అద్భుతమైన ఆయుధం. మనకు ఏది మంచిదో ఆయనకు తెలుసుననే నమ్మకంతో ప్రతి విషయాన్ని ఆయనకు వదిలేయడం ద్వారా మనిషికి మించిన ఆనందం మరొకటి లేదు. ప్రహ్లాదుడు, గజేంద్రుడు, ద్రౌపది వంటి మహానుభావుల గాథలు శరణాగతి ఎంతటి శక్తివంతమైనదో నిరూపించాయి. భక్తుని విశ్వాసాన్ని పరీక్షించినప్పటికీ, ఆ పరీక్షలో నెగ్గిన తరువాత తన ఆశ్రిత హృదయాలను స్వామి ఎన్నడూ విడిచిపెట్టడన్నది పురాణాల సారం.

'ఓం నమో వేంకటేశాయ' అనే నామస్మరణ మనిషిని నిరంతరం దైవంతో అనుసంధానం చేసే ఒక దివ్య వారధి. ప్రతి శ్వాసలో, ప్రతి స్పందనలో దైవం ఉన్నాడనే అనుభూతిని పొందుతూ, నిరంతరం ఆ నామాన్ని స్మరించడం ఒక గొప్ప ఆధ్యాత్మిక సాధన. చేసే ప్రతి పనిని దైవ కార్యంగా భావించి, దాని ఫలితాన్ని పూర్తిగా స్వామికి వదిలేసే కర్మయోగం, ప్రపత్తిని మరింత సులభతరం చేస్తుంది. దైనందిన జీవితంలోని సాధారణ పనులను కూడా స్వామికి చేసే పూజగా మార్చుకున్నప్పుడు మనిషికి ప్రతిక్షణం దైవ సాన్నిధ్యమే లభిస్తుంది. ఉపనిషత్తులు, వేదాలు బోధించే శరణాగతి మార్గం మన పూర్వీకులు అనుసరించిన అతి గొప్ప జీవన విధానం. మన సంస్కృతిలో ఉన్న విలువలను కాపాడుకుంటూ స్వామిని ఆశ్రయించడం ఎంతో శ్రేయోదాయకం. స్వామిపై భారం వేయడం వల్ల మనస్సు ఒత్తిడి నుండి విముక్తి పొంది, లోతైన ప్రశాంతతను అనుభవిస్తుంది. దైవం తోడున్నాడనే నమ్మకం మనిషికి కష్టాల్లో కూడా ధైర్యాన్ని ఇచ్చే అద్భుతమైన శక్తిని ప్రసాదిస్తుంది.

స్వామిని చూస్తుంటే కలిగే దైవిక అనుభూతిలో భక్తుడు తనను తాను మరచిపోతాడు. ఆ సౌందర్యరాశిని ఆరాధించడం ఒక గొప్ప భాగ్యం. భక్తుని అంతరభావన స్వామిపై చూపే ప్రభావం ఆయన అలంకారంలో, ఆయన కరుణలో కనిపిస్తుంది. భౌతిక పూజ కంటే భావ పూజ గొప్పది. మనం ఇచ్చే నైవేద్యం కంటే, మన హృదయంలోని భక్తి అనే ప్రసాదాన్ని స్వామి ఎక్కువగా కోరుకుంటాడు. భక్తితో సమర్పించే ఒక చిన్న పుష్పమైనా స్వామికి అపారమైన ప్రీతిని కలిగిస్తుంది. ప్రపత్తి మార్గం చూపించే గురువు పాత్ర మనిషి జీవితంలో అత్యంత కీలకం. గురువుపై ఉంచే విశ్వాసమే దైవంపై ఉంచే శరణాగతికి మొదటి పునాది. మనుషులలో దైవాన్ని చూడడం, సమాజ సేవలో భగవంతుని గుర్తించడం అత్యుత్తమ భక్తి. వ్యక్తిగత అభివృద్ధిని, సామాజిక శ్రేయస్సును సమన్వయం చేసుకుంటూ జీవించడం ప్రపత్తిలో అంతర్భాగం.

అహంకారమే అజ్ఞానం. ప్రపత్తి ద్వారా ఆ అజ్ఞానపు తెరలు తొలగిపోయి జ్ఞానోదయం కలుగుతుంది. మాయా ప్రపంచం యొక్క అశాశ్వతను మనిషి సులభంగా గ్రహిస్తాడు. కష్టాలను దైవ పరీక్షగా స్వీకరించి ఓర్పుతో ఉండటమే ప్రపత్తి. ఆపదలో ఉన్నప్పుడు భక్తుని విడువని వేంకటేశ్వరుడు ఎల్లప్పుడూ అభయాన్ని ఇస్తూనే ఉంటాడు. పొందిన దానికి ధన్యవాదాలు తెల్పడం, ఉన్నదానితో తృప్తి పడడం మనిషికి ఉండాల్సిన ప్రధాన లక్షణం. దైవాన్ని అడిగే దాని కంటే కృతజ్ఞత తెల్పడం భక్తుడికి ఉండాల్సిన ఉత్తమ లక్షణం. పంచభూతాల్లో వెలిగే దైవాన్ని చూడటం, ప్రకృతిని, పర్యావరణాన్ని గౌరవించడం స్వామికి చేసే సేవ. దైవ సృష్టిని కాపాడుకోవడం రాబోయే తరాలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి. కాలాతీతుడైన వేంకటేశ్వరుని దృష్టిలో మనిషి జీవితం ఒక క్షణమే. ఆ విలువను గుర్తించి నిరంతరం దైవ చింతన చేయాలి. నిరంతరం సాగే కాలంలో దైవం మాత్రమే శాశ్వతమైనదని గుర్తించడం ప్రపత్తి. అంతా స్వామి చిత్తమే అని నమ్మినప్పుడు మనిషి నిశ్చల స్థితిని చేరుకుంటాడు. దైవ సాన్నిధ్యంలో లీనమై, ఆనందంగా జీవించడమే ప్రపత్తి ద్వారా మనిషి పొందే అత్యున్నత స్థితి. చివరగా, వేంకటేశ్వర ప్రపత్తి అనేది ఒక మార్గం మాత్రమే కాదు. అది మన గమ్యం. మన జీవిత ప్రయాణంలో దైవంతో ఏర్పరచుకున్న ఈ అనుబంధం అనాది, అనంతం, అమరం. మనం ఆయన పాదాలను వదలనంతవరకు, ఆయన మనల్ని ఎన్నటికీ వదలడు. ఇదే శరణాగతి ఇచ్చే అతి పెద్ద భరోసా.

* * *

# దేవాలయాలు

**మన దేశంలో ప్రతి గ్రామంలోను కనీసం ఒక దేవాలయమైనా ఉంటుంది. దేవాలయం లేని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు.**

**ఈ సంప్రదాయం ఎప్పటినుంచి అమలులోకి వచ్చింది? అలా ప్రతి గ్రామంలోనూ దేవాలయాన్ని నిర్మించుకోవలసిన అవసరమేమిటి? ఒకవేళ దేవాలయం లేని గ్రామమున్నట్లయితే ఏమవుతుంది?**

ఇటువంటి ప్రశ్నలన్నింటికీ ఇలా సమాధానం చెప్పుకోవచ్చు. ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత, స్థిరచిత్తంతో జీవించాలని ఉంటుంది. దేవుని కటాక్షం లేకుండా అటువంటి జీవితం లభ్యమవటం అసాధ్యం. దేవుని కటాక్షం లభించాలంటే దేవాలయాలు అవసరం.

సనాతన ధర్మంలో వాస్తవానికి దేవుడు లేని చోటు లేదు. భగవంతుడు సర్వాంతర్యామి. మరి దేవుడు సర్వాంతర్యామి అయినట్లయితే దేవాలయాలెందుకు? ఒక దేవాలయంలో దేవుని బంధించి, ఆయన సర్వవ్యాపకత్వానికి పరిమితులను ఏర్పరుస్తున్నాము కదా.

ఇటువంటి సందేహాలను లేవనెత్తేవారు పూర్తిగా ఏమీ తెలియనివారు కాదు. అయితే వాళ్ళు సత్యాన్ని సమగ్రంగా అర్థం చేసుకోలేదు. అందువలననే ఇటువంటి సందేహాలు తలెత్తుతుంటాయి. పరమాత్మ సర్వాంతర్యామి అనటంలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే తగు అవగాహన, సంస్కారం లేని కారణంగా సామాన్యులు పరమాత్మ సర్వాంతర్యామి అనే విషయాన్ని హృద్గతం చేసుకోలేకపోతున్నారు.

అయితే అటువంటి అవగాహన, సంస్కారం ప్రహ్లాదుని వంటి మహాపురుషులకే ఉంటుంది. మహాభక్తుడైన ప్రహ్లాదుడికి ప్రతిచోట దైవదర్శన భాగ్యం లభించేదని శ్రీమద్భాగవతం ద్వారా మనకు తెలుస్తోంది. అయితే సామాన్యులు ప్రహ్లాదునికున్న సంస్కారాన్ని, అధికారాన్ని కలిగి ఉండరు కదా.

అయితే దైవ భక్తిని పెంపొందించడానికి సామాన్యులు ఏమి చేయాలి? మన పూర్వీకులు మనకి చాలా మార్గాలను సూచించారు. శాస్త్రాలు నిర్దేశించిన ప్రకారం ప్రాణప్రతిష్ఠ చేయబడిన దేవతా విగ్రహాలను పూజిస్తే తప్పకుండా



దైవకటాక్షం లభిస్తుందని శాస్త్ర వచనం. పామరులు కూడా సులభమైన ఈ మార్గాన్ని అవలంబించి దైవ కటాక్షాన్ని పొందవచ్చు.

ఒక దేవాలయంలో దేవుని బంధించి ఆయన సర్వవ్యాపకత్వానికి పరిమితులను ఏర్పరుస్తున్నాము కదా అనే సందేహం కలగవచ్చు. దీనికి శ్రీ శంకర భగవత్పాదుల వారు ఒక ఉదాహరణ చెప్పారు.

**"యథా సకల భూమండలాధిపతి రపి అయోధ్యాపతిః ఇతి వ్యవహ్రియతే"**

భూమండలాధిపతి అయిన శ్రీరామచంద్రమూర్తిని అయోధ్యాధిపతిగా అభివర్ణిస్తున్నాము. అంతమాత్రాన ఆయన అధికారం తగ్గిపోతుందా? ఆయన అయోధ్యాపతి మాత్రమే కాదు, లోకాధిపతి కూడాను.

అలాగే పరమాత్మ ఇతర చోట్ల ఉన్నట్లే, దేవాలయంలో కూడా ఉంటాడు. అయితే దేవుడిని అన్వేషించే వారి సౌలభ్యం కోసం ఒక స్థానాన్ని చూపించాలని దేవాలయాన్ని దైవస్థానంగా చూపిస్తాం. దేవాలయంలోని దేవుని ఆరాధన ద్వారా మనం మానసిక ప్రశాంతత పొందవచ్చు.

ప్రహ్లాదుని వంటి శ్రద్ధా భక్తులు, అధికారికత మీకు ఉన్నట్లయితే, అటువంటి సంస్కారాలను మీరు కూడా పొందగలిగినట్లైతే భగవంతుడిని అన్ని చోట్లా మీరు కూడా దర్శించవచ్చు. అప్పుడు మీరు దేవాలయానికే వెళ్ళి దేవుడిని పూజించాల్సిన పనిలేదు, ప్రతిచోటూ మీకు దేవాలయమే అవుతుంది. అయితే ప్రహ్లాదుని స్థాయి మనం చేరుకునే దాకా దేవాలయానికి వెళ్ళి పూజించక తప్పదు. అందువలన దేవాలయాలు అవసరమవుతున్నాయి.

మరి మన విన్నపాలను భగవంతుడు పట్టించుకుంటాడా అనే అనుమానానికి ఆస్కారం లేదు. భగవంతుడు అనంతమైన కరుణామూర్తి. శృతి ఇలా వివరించింది.

**"అపాణిపాదో జవనో గ్రహీతా**
**పశ్యత్య చక్షుః స శృణోత్య కర్ణః ।**
**సవేత్తి వేద్యం న చ తస్యాస్తి వేత్తా**
**తమాహురగ్ర్యం పురుషం మహన్తం ॥**

భగవంతుడు మనవంటివాడు కాదు, మనకు చేతులున్నాయి కాబట్టి వస్తువులను పట్టుకుని పైకెత్తగలుగుతున్నాము. కాళ్ళున్నాయి కాబట్టి నడవగలం. చేతులు లేకపోయినా భగవంతుడు పైకెత్తగలడు. నడవగలడు. మనం భక్తితో ఏది సమర్పించినా ఫలం, పుష్పం, పత్రం, తోయం.. భగవంతుడు స్వీకరిస్తాడు.

మనం మళ్ళీ మొదటి ప్రశ్నకు వచ్చాము. గ్రామాలలో దేవాలయం లేకపోతే ఏమవుతుంది? అంటే మనం ఎవరిముందు మన కష్టాలను చెప్పుకుంటాము? అయితే సామాన్యులు భగవంతుడిని ఎక్కడ దర్శించగలరు? దేవాలయాలలో మాత్రమే దర్శించగలరు.

ఈ అవసరాలను తీర్చటానికి మన పూర్వీకులు ప్రతి గ్రామంలో కనీసం ఒక్క దేవాలయాన్నైనా నిర్మింపచేశారు. సనాతన ధర్మం సుస్థిరంగా చైతన్యవంతంగా ఉండటంలో దేవాలయాలు ప్రముఖమైన పాత్రలు నిర్వహిస్తాయి. దేవాలయాలు లేకపోతే సనాతన ధర్మం దయనీయ స్థితిలో ఉండేది. సనాతన ధర్మ సంరక్షణకు దేవాలయాలే ఆశాజ్యోతులు. అందువలన దేవాలయాలు అత్యంతావశ్యకం.

* * *


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సిగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



# అష్టావక్ర మహర్షి

– మందరపు
వి.జి.శంకరాచారి

ద్వాపర యుగంలో ఏకపాదుడు అనే మహర్షి తన భార్య సుజాతతో కలిసి జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఇతడు బ్రహ్మవేత్త. వేద వేదాంగాలను ఔపోసన పట్టిన విద్యావంతుడు. ఉపనిషత్తులన్నింటినీ కూలంకషంగా చదివిన బ్రహ్మజ్ఞాని. తత్త్వం తెలిసినవాడు. ఇతడు ఒక గురుకులాశ్రమం నడుపుతూ ఎంతోమందికి విద్యాదానం చేసేవాడు. ఎందరో శిష్యులు ఇతడి ఆశ్రమంలో ఉండి విద్య నేర్చుకుని జ్ఞానవంతులయ్యారు.

విద్యార్థులకు వేదవిద్యను బోధించే సమయంలో ఇతడి భార్య సుజాత ఏకపాదుడికి దగ్గరగా కూర్చుని అతడి జ్ఞాన ప్రబోధాన్ని వింటూ ఉండేది. ఇది ఆమెకు ఒక అలవాటుగా మారింది. కాలగమనంలో ఏకపాదుడి భార్య సుజాత గర్భం దాల్చింది. తను గర్భం దాల్చినా సరే చేయవలసిన సపర్యలను భర్తకు చేస్తూ గృహస్థురాలిగా చేయవలసిన పనులన్నింటినీ చక్కగా చేసేది.

తను ఇంటిలో చేయవలసిన పనులన్నిటినీ పూర్తి చేసిన తర్వాత, భర్త చెంతకు వచ్చి అతడు శిష్యులకు చేస్తున్న విద్యా బోధనలను, తత్వజ్ఞానాన్ని వింటూ ఉండేది. గర్భం దాల్చిన సుజాత నిండు గర్భిణి అయింది. ఆ సమయంలో కూడా ఆమె భర్త చెంతకు వచ్చి కూర్చుని శ్రద్ధగా ఆలకించేది.

ఒకరోజు ఏకపాదుడు వేదమంత్రాలను తన శిష్యులకు తెలియజేస్తూ శ్రుతి బద్ధంగా పాడుతూ చెప్పసాగాడు. అతడి గొంతులో కాస్తంత తప్పిదం దొర్లింది. ఇది గ్రహించిన గర్భస్థ శిశువు ఆమె గర్భం నుండి మాట్లాడుతూ ''తండ్రీ! మీరు పలుకుతున్న ఈ మంత్రం రాగబద్ధంగాను, ఛందోబద్ధంగానూ లేదు. మీ ఉచ్చారణ సరిగా లేనందున

మీ శిష్యులు కూడా అపశ్రుతితో మంత్రం పలుకుతున్నారు. వేదమంత్ర ఉచ్చారణలో దోషం ఉంటే ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయి. మీరు పరిపూర్ణ జ్ఞానవంతులు కావచ్చు. మీలో ఉన్న విద్యను, జ్ఞానాన్ని తప్పుగా శిష్యులకు బోధిస్తే మహాపరాధం. అది సమాజానికి ఎనలేని నష్టాన్ని తెచ్చి పెడుతుంది. కాబట్టి మీరు అభ్యసించిన విద్య అయినా సరే మరల మరల అనుభవానికి తెచ్చుకుంటూ, తప్పులను సరిదిద్దుకుంటూ, ఖచ్చితమైన విద్యను మాత్రమే శిష్యులకు అందించాలి అని మీరు పలుకుతున్నది ఈ విధంగా పలకాలి అంటూ శ్రుతిబద్ధంగా ఉచ్చరించి వినిపించాడు.

సుజాత గర్భం నుండి శిశువు మాట్లాడటం వినిన ఏకపాదుడు ఆశ్చర్యపోయాడు. అతడి భార్య కూడా ఆశ్చర్య చకితురాలయింది. అయితే ఆమె అమితంగా ఆనందించింది. గర్భంలో ఉన్నప్పుడే ఇంతటి విజ్ఞానాన్ని ఆర్జించిన తన బిడ్డ ఈ పుడమిపై పడిన తర్వాత మరెంతో జ్ఞానాన్ని పొంది, ఆ జ్ఞానాన్ని ప్రజలకు బోధించి సమాజానికి ఉపయోగపడతాడని సంతోషించింది.

ఆమెలాగే భర్త ఏకపాదుడు మొదట ఎంతో సంతోషించినా అహం అడ్డు వచ్చి గర్భస్థ శిశువుపై క్రోధాన్ని పెంచుకున్నాడు. అంతలోనే సుజాత గర్భం నుండియే ఆ శిశువు మరియొక సలహాను చెబుతూ ''తండ్రీ! శిష్యులకు, నిరంతరం విద్యాబోధన పనికిరాదు. రాత్రింబవళ్ళు విశ్రాంతి లేకుండా విద్యాబోధ, జ్ఞానబోధ చేయడం సరైన పద్ధతి కాదు. శిష్యులుకు విద్యాబోధనను కొంత సమయము మాత్రమే చెప్పవలెను. మిగిలిన సమయాన్ని శిష్యులకు ఇచ్చి ఆ రోజుకి మీరు చెప్పిన విద్యను వల్లె వేయమని చెప్పాలి. భవిష్యత్తులో మీరు చెప్పిన విద్యను గుర్తుంచుకుని మీ శిష్యులు మీ తదనంతరం శిష్యులను తయారు చేయాలి కదా. ఈ సమాజాన్ని సరైన మార్గంలో నడపాలి కదా. కాబట్టి మీ విద్యా ప్రబోధం ఒక్క పూట మాత్రమే కొనసాగించాలి'' అని పలికాడు.

ఈ మాటలు విన్న ఏకపాదుడికి తనకు పుట్టబోయే కొడుకు మీద అమితమైన ఆగ్రహం కలిగింది. పుట్టబోయేది తన సంతానమైనా సరే క్రోధాన్ని అణుచుకోలేక ''ఓయీ! బాలకా! నీవు జన్మించకముందే నా యొక్క విద్యా బోధనను, శిక్షణను కించపరుస్తూ, వంకలు పెడుతూ ఉన్నావు. కావున నీవు చేసిన ఈ తప్పిదానికి 'అష్టావక్రుడి'గా (శరీరం 8 వంకరలతో నిండి యుండుటను అష్టావక్రంగా చెప్పబడుతుంది) జన్మించు అని శపిస్తాడు.

కాలం ఇలా గడుస్తూ ఉండగా ఒకరోజు నిండు గర్భిణిగా ఉన్న సుజాత భర్త ఏకపాదునితో 'నాథా! ఇంట్లో సరుకులు నిండుకున్నాయి ఉప్పుతో సహా. కావున మీరు జనక మహారాజు దగ్గరకు వెళ్ళి సరుకులు తీసుకుని రండి' అని చెబుతుంది.

సుజాత ఆ మాట చెప్పే సమయానికి ఆ దేశపు రాజైన జనకుడు తన రాజ్యములోనికి వచ్చిన వరుణుడి పుత్రుడు అయిన 'వంది'ని విద్య, విజ్ఞాన, బ్రహ్మజ్ఞాన తదితర విషయాలలో అతడితో పోటీపడి ఓడించిన వారికి ధన కనక వస్తు వాహనాలను ఇచ్చి జనక మహారాజు సత్కరిస్తారు అని చాటింపు వస్తుంది.

ఆ చాటింపు విన్న ఏకపాదుడు 'వంది'ని ఓడించాలన్న ఉద్దేశ్యంతో జనక మహారాజు గారి దగ్గరకు బయలుదేరి వెళతాడు. ఏకపాదుడు జనకమహారాజుని కలిసి 'వంది'తో వాదనకు దిగుతానని చెబుతాడు.

అయితే పోటీలో దిగే పోటీదారులకు ఒక నియమాన్ని పెడతాడు వంది. పోటీలో ఎవరు ఓడిపోయినా సరే... జలసేతు బంధన శిక్షను అనుభవిస్తూ ఈ రాజ్యంలోనే ఉండిపోవాలి. తను ఓడిపోయినప్పుడు మాత్రమే తన ఇష్ట ప్రకారం రాజుగారు జలసేతు బంధన శిక్షను రద్దు పరుస్తారు. ఈ నియమానికి ఒప్పుకుని 'వంది'తో వాదనకు దిగాలి.

ఈ నియమానికి ఒప్పుకున్న ఏకపాదుడు 'వంది'తో పోటీకి దిగి ఓడిపోతాడు. ఫలితంగా అతడికి జనకమహారాజు జలసేతు బంధన శిక్షను విధిస్తాడు. (జలసేతు బంధన శిక్ష అనగా నీటిలో ముఖాన్ని ఉంచి ఊపిరి నిలిచిపోతున్న సమయంలో ఆ వ్యక్తి ముఖాన్ని నీటినుండి బయటకు తీస్తారు. ఈ శిక్షను రోజుకి 6 నుండి 7 సార్లు విధిస్తారు).

జలసేతుబంధన శిక్ష పడడంతో అక్కడే ఉండిపోతాడు ఏకపాదుడు. ఇతడిలాగే ఈ శిక్షను అనుభవిస్తున్నవారు చాలామంది ఆ రాజ్యంలో ఉన్నారు.

ఇదిలా ఉండగా గర్భవతి అయిన ఏకపాదుని భార్య సుజాత ఒక బాబుకి జన్మనిస్తుంది. తండ్రి ఇచ్చిన శాపం కారణంగా అష్ట వంకరలతో ఆ బాబు జన్మిస్తాడు. అష్టవంకరలతో పుట్టిన కారణంగా అష్టావక్రునిగా అందరిచేత పిలవబడతాడు.

అష్టావక్రుడు పెరిగి పెద్దవసాగాడు. అయితే ఏకపాదుడు నివసిస్తున్న గృహస్థాశ్రమంకి దగ్గరలోనే మేనమామ అయిన ఉద్దాలకుడు నివసిస్తూ ఉండేవాడు. అష్టావక్రుడు జన్మించిన కొద్ది రోజులకే ఉద్దాలకుడికి కూడా ఒక కొడుకు జన్మిస్తాడు. ఉద్దాలకుడు తన పుత్రునికి ''శ్వేతకేతు'' అని నామకరణం చేస్తాడు.

ఒకవైపు అష్టావక్రుడు, మరియొక వైపు శ్వేతకేతు పెరిగి పెద్దవసాగారు.

మేనమామ ఇల్లు దగ్గరగా ఉండడం వలన అష్టావక్రుడు, శ్వేతకేతు ఇద్దరూ కలిసి ఆటలాడుకునేవారు. ప్రతిరోజు వివిధ రకాలైన ఆటలను ఆడుకుంటూ ఆనందాన్ని పొందుతూ

ఉండేవాడు. అష్టావక్రుడు ఎక్కువ సమయం మేనమామ దగ్గర గడపడం వలన 'ఉద్దాలకుడే' తన తండ్రి అనుకుంటాడు.

ఒకరోజు శ్వేతకేతు, అష్టావక్రుడు ఆడుకుంటూ ఉండటం చూస్తూ ఉద్దాలకుడు అక్కడ గల ఆసనంపై కూర్చుని ఉన్నాడు. వారిద్దరి ఆటల్ని చూస్తూ తనుకూడా ఆనందాన్ని పొందుతూ ఉన్నాడు.

అష్టావక్రుడు – శ్వేతకేతుతో ఆడుతూ ఆడుతూ అలసిపోయి అక్కడే కూర్చుని ఉన్న ఉద్దాలకుడి దగ్గరకు వచ్చి అతడి తొడపై కూర్చున్నాడు. అది చూసిన శ్వేతకేతు అష్టావక్రుడి దగ్గరకు వచ్చి 'మా నాన్న తొడపై ఎందుకు కూర్చున్నావు? మీ నాన్న కాదు.. ముందు లే' అంటూ అష్టావక్రుణ్ణి క్రిందకు తోసి తను వెళ్ళి ఉద్దాలకుడి తొడపై కూర్చున్నాడు.

శ్వేతకేతు చేసిన పనికి చిన్నబుచ్చుకున్న అష్టావక్రుడు ఏడుస్తూ తల్లి దగ్గరకు వచ్చి జరిగిన విషయం చెప్పి తండ్రి గురించి అడుగుతాడు. అప్పుడు సుజాత అతడి తండ్రి ఎక్కడ ఉన్నాదీ, ఏ కారణము వలన శిక్షను అనుభవిస్తున్నదీ చెబుతుంది.

ఎనిమిది సంవత్సరముల లోపు వయసు గల అష్టావక్రుడు తల్లి ఆశీర్వాదము తీసుకుని తండ్రిని విడిపించడానికి, 'వంది'తో పోటీ పడడానికి జనక మహారాజు ఆస్థానానికి బయలుదేరి వెళతాడు.

అష్టావక్రుడు బాలకుడు కాబట్టి అతడిని జనకమహారాజు దగ్గరకు పంపడానికి, వందితో వాదించడానికి ఆస్థాన ప్రముఖులు కొందరు నిరాకరిస్తారు. అయితే అష్టావక్రుడు ఆ ప్రముఖులతో ''ఈ రాజ్య ప్రముఖులకు నా యొక్క నమస్కారం. మీరు నన్ను బాలుడిగా చూస్తున్నారు. కాని భగవంతుడు నాకు ఇచ్చిన జ్ఞానం అపూర్వమైనది. నేను బాలకుడిగా కనిపిస్తున్నా, జ్ఞానంలో వృద్ధుడను. పితామహుడను. 'వంది'ని ఓడించడం నాకు కష్టం కాదు కాబట్టి నాకు అనుజ్ఞను ఇచ్చి రాజాస్థానానికి తీసుకు వెళ్ళండి'' అని కోరుతాడు.

బాలకుడైన అష్టావక్రుడిలో ఉన్న ప్రజ్ఞను గుర్తించిన ఆస్థాన ప్రముఖులు జనకమహారాజు వద్దకు తీసుకుని వెళ్ళి అష్టావక్రుణ్ణి పరిచయం చేస్తారు.

పిదప అష్టావక్రుడు 'వంది'తో వాదనకు దిగి అతడిని విద్య, విజ్ఞాన, ద్వైత, అద్వైత, తత్వ, జ్ఞానము లన్నింటిలోనూ ఓడిస్తాడు.

'వంది' ఓడిపోవడంతో జనకమహారాజు ''ఏమి కావాలో కోరుకొమ్మని'' అష్టావక్రుణ్ణి అడుగుతాడు.

అష్టావక్రుడు సందేహించకుండా ''జలసేతు బంధ శిక్షను అనుభవిస్తున్న తండ్రి ఏకపాదుడిని కాకుండా ఈ శిక్షను అనుభవిస్తున్న వారినందరినీ విడిపించమని' కోరుతాడు.



అష్టావక్రుడు కోరినట్లే అందరినీ విడుదల చేస్తాడు జనకమహారాజు. తర్వా జనకమహారాజు చేత ధన కనక వస్తు వాహనాది వస్తువులను మరియు సపర్యలను, సత్కారాన్ని పొందుతాడు.

ఏకపాదుడు అష్టావక్రుణ్ణి గుండెలకు హత్తుకుని పుత్రోత్సాహాన్ని పొందుతాడు. అంతేకాదు, తన కుమారుడి శరీరం అష్టవంకరలు కోల్పోయి సుందరాకారుడిగా మారేట్లు శాపవిమోచనం కలిగిస్తాడు ఏకపాదుడు.

ఆ విధంగా తండ్రిని విడిపించిన అష్టావక్రుడు తదనంతర కాలంలో కృష్ణభక్తుడిగా మారతాడు. ఒకానొక సందర్భంలో కృష్ణుడి దగ్గరకు వెళ్ళి అతణ్ణి స్తుతిస్తూ ప్రాణాలు విడుస్తాడు. తన పాదాల చెంతన ప్రాణం విడిచిన అష్టావక్రుడి కర్మకాండలన్నీ శ్రీకృష్ణపరమాత్మే జరిపించాడన్నది పురాణ కథనం. అంతేకాదు. గంగను దివినుండి భువికి తీసుకుని రావడానికి ఘోరమైన తపస్సు నాచరించిన భగీరథుడు మొదట బలహీనుడు. అటువంటి వ్యక్తిని శారీరకంగాను, మానసికంగాను బలోపేతం చేసి, ఒంటకాలుపై నిలిచి అనేక సంవత్సరాలు తపస్సు నాచరించే శక్తి కూడా అష్టావక్రుడి వలననే లభించిందని శాస్త్ర వచనం.

# మీ ప్రశ్న - మా సమాధానం

నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**1. గోవు మోక్షసాధన ఎలా అవుతుంది గురువుగారూ? - జె.సరిత, బాపట్ల**

జవాబు – గోవుని గోమాత అంటాం. గోవు మనకు పూజనీయం. గోవు సర్వదేవతా నిలయం కూడా. అత్యంత సాధుజంతువు, మనకెంతో ఉపకారం చేస్తూ మనందరి పూజలందుకునే ఆవు, కేవలం నూతన గృహప్రవేశం సందర్భంలోనే కాక వివాహం, నామకరణం, ఉపనయనం మొదలగు సంస్కారాలు నిర్వహించే సందర్భాలలోనూ హిందువులచే గౌరవించబడుతుంది. స్కాందపురాణంలోనూ, వేదాలలోనూ గో ఘనత వివరించబడింది. గోపాష్టమి, గో ద్వాదశి మొదలగు విశేష దినాలలో మనం గోవుని ఆరాధిస్తాం. మోక్షసాధన విషయంలోనూ గోవుల ఆరాధన అతి ప్రధానం. గో తులాభారంలో పాల్గొనేవారు, చేయించేవారు వైకుంఠం పొందుతారట. గోవుతో సరితూగే గో గ్రాసం గోవుకి దానం చేస్తే అది విశేషదానంగా పరిగణించబడి పుణ్యాన్ని ప్రసాదిస్తుంది. రోజూ గో దర్శనం, గో పృష్టభాగం దర్శనం, గోవును సేవించడం చేస్తే వారికి స్వర్గం కన్నా పై లోకాన్ని సంప్రాప్తిస్తుంది. అందుకే ''గావో విశ్వస్య మాతరః'' అని అన్నారు.

**2. కర్మ యోగాన్ని వివరించండి – మురళీకృష్ణ, చందానగర్**

జవాబు – దృఢమైన మనస్సంకల్పంతో మనం చేసే కర్మయే కర్మ యోగం. వర్ణాశ్రమ ధర్మాల ప్రకారం, అధికార సంపన్నమైన విధులు, ఆచార కర్మలు చేయడం మన కర్మ.

**కర్మ**     **కామ్యము**

- **రోజూ సంధ్యావందనం చేయడం మొ॥**
- **కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఆచరించే కర్మలు – తర్పణం, వ్రతాలు మొ॥**
- **ఏదైన ప్రయోజనం ఆశిస్తూ చేసే నోములు, యాత్రలు, ముడుపు కార్యక్రమాలు**

కర్మలు ఆచరించవలసిందే. ప్రతిప్రాణి ఏదో కర్మ చేస్తూనే ఉంటుంది జీవితాంతం. దేవతలు కూడా లోక కళ్యాణార్థం కర్మలు చేస్తారు. మనం కర్మబద్ధులం.. కర్మయోగంలో కర్తృత్వము దైవానికే ఉంటుంది.

**కర్మయోగం**

- **దేవతార్చన**
- **తపస్సు**
- **తీర్థయాత్ర**
- **యజ్ఞము**
- **ఇంద్రియ నిగ్రహం**
- **స్వాధ్యాయం (వేదాలు చదవడం)**
- **జ్ఞానయజ్ఞం (వేదార్థాలు తెలుసుకోవడం)**

వీటిని ఫలితం ఆశించకుండా భగవంతుడే చేయిస్తున్నాడని తలుస్తూ ఫలితాన్ని భగవదర్పితం చేయడం. గీతాచార్యుని జ్ఞానయజ్ఞం.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

***– ఎడిటర్, శ్రీవేంకటేశం***

---

## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు



**105 వ కళ్యాణం:** తేది 02-07-2026 గురువారం రోజు చిన్నగుండవెల్లిలో హరినామక్షేత్రం శంకుస్థాపన తరువాత జరిగింది. దీనిని భక్తులు నిర్వహించారు.

**106 వ కళ్యాణం:** తేది 25-07-2026 శనివారం తొలి ఏకాదశి సందర్భంగా భజగోవిందం, ఆ తరువాత 106వ కళ్యాణం జరిగింది. ఇది హైదరాబాద్ లోని పత్రిక నగర్ లో శ్రీమాన్ బొమ్మా వేంకట స్వర్ణకుమార్ రెడ్డి, సుజన దంపతులు నిర్వహించారు.





# హరినామక్షేత్రం శంకుస్థాపన

తేది 02-07-2026 గురువారం రోజున చిన్నగుండవెల్లిలో శ్రీవేంకటేశ్వర స్వామివారి హరినామక్షేత్రానికి శంకుస్థాపన టిటిడి బ్రాహ్మణోత్తములచే జరిగింది. ఆ తరువాత 105వ శ్రీనివాస కళ్యాణం కూడా అక్కడే జరిగింది. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఎంతో ఇష్టమైన ఈ కార్యక్రమము శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ దేవనాథ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణ మరియు మంగళా శాసనములతో జరిగింది. శ్రీమాన్ కె.వి.రమణాచారి గారు, శ్రీవేంకటేశం మాసపత్రిక గౌరవ సంపాదకులు శ్రీమాన్ టి.గౌరీశంకర్ గారు, టిటిడి వేదపండితులు శ్రీమాన్ విష్ణుభట్టాచార్యుల బృందం, పుల్లగూర్ల సాయిరెడ్డి దంపతులు, గ్రామపెద్దలు, భక్తులు వచ్చారు. ఎన్నో సంవత్సరాల నుండి వేచి చూస్తున్న ఈ కార్యక్రమము ఎంతో ఆనందంగా జరిగింది.

# జప పుస్తకాలు పంప మనవి

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం తరపున తిరుమల శ్రీవారికి 24వ పర్యాయంగా 7 కోట్ల జపం వ్రాసే భక్తులు, వారి వారి జప పుస్తకములను 15-08-2026 వరకు పీఠమునకు చేరునట్లు పంపవలసిందిగా మనవి.

**శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం**

1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500 007. ఫోన్ : 040-27175050

# రాశి ఫలితములు

## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము

వివాహ ప్రయత్నములు నెరవేరుటకు అనుకూలమైన సమయము. గృహోపకరణాలు, అలంకార సామాగ్రి, బంగారం, వాహన యోగములు. భార్యాభర్తల మధ్య అనుకూలత పెరుగును. ఆభరణ లాభములు, పిల్లల వివాహ ప్రయత్నములు ఫలించును. సత్యనారాయణ వ్రతం చేయుట శుభప్రదం.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

అనుకూలమైన మాసము. ఇంటిలో విజయం, సమాజంలో గౌరవము పెరుగును. సంతానముతో విభేద భావన కలగవచ్చును; ఓర్పుతో, సామరస్యంగా వ్యవహరించవలెను. అనారోగ్య సూచనలు, మనోవికారం ఉండవచ్చు. నవగ్రహ ప్రదక్షిణలు చేయవలెను.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. తండ్రికి అనారోగ్య సూచనలు ఉన్నాయి. పై అధికారుల వలన మాటలు పడుట, ధనవ్యయము. మనోనిగ్రహం అవసరం. భార్యకు అనారోగ్య సమస్యలు ఉండగలవు. నిరంతరం శివనామ జపము చేయవలెను.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ రాశివారికి సామాన్య ఫలితములు. వృత్తి, వ్యాపారములలో కొంత అనుకూలత ఉన్నది. అయితే జాగ్రత్తగా వ్యవహరించవలసిన కాలము. తొందరపడి పలికిన మాటలు ఇబ్బందులకు దారి తీసే అవకాశమున్నది. శ్రీవారి అలంకార దర్శనం మనశ్శాంతిని ప్రసాదించును.

## సింహరాశి

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము

సామాన్య లాభములు కలిగిన మాసం. ప్రతి విషయాన్ని భూతద్దంలో చూసి అనవసర ఆందోళన పడకండి. ధనవ్యయం ఎక్కువైనా అవసరాలకు సరిపడా ధనం సమకూరుతుంది. మాటలు ఆయుధాల్లా ఉపయోగించరాదు. శ్రీలక్ష్మీ, గజలక్ష్మీ దేవి ఉపాసన శుభప్రదం.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ–పురుషులకు కొన్ని విషయాలలో అనుకూలత, కొన్ని విషయాలలో ప్రతికూలత ఉంటుంది. లౌకిక జ్ఞానం, నూతన విధానాలు అనుసరించి ప్రతి సమస్యను లాజిక్‌తో పరిష్కరించాలి. అమ్మవారి నిరంతర ఆరాధన వలన విజయం సిద్ధిస్తుంది.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ఆదాయ వనరులు స్పష్టంగా కనిపించవు. అన్నదమ్ముల మధ్య అనుకూలత లోపించవచ్చు. బంధువర్గ సహకారం తగ్గే సూచనలు ఉన్నాయి. భార్య ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం. శ్రీ గజలక్ష్మీ, లక్ష్మీదేవి పూజలు చేయుట వలన మనోనిగ్రహం కలుగుతుంది.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూలత ఉన్నప్పటికీ మధ్యలో కొన్ని ఆటంకాలు. నిర్లక్ష్యం పనికిరాదు. అభిప్రాయ భేదాలకు తావు ఇవ్వకూడదు. ధనం నీటిలా ఖర్చయ్యే సూచనలు ఉన్నాయి. భార్యాభర్తల మధ్య మాట పట్టింపులు రావచ్చు. గజలక్ష్మి, లక్ష్మీదేవి పూజలు చేయుట శ్రేయస్కరం.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ మాసమున అనుకూలత ఉంటుంది. అభివృద్ధి దిశగా ముందుకు సాగగలరు. మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. అనుకూలమైన రోజులు కొరకు ఎదురుచూపు ఉంటుంది. సత్యదేవుని వ్రతం, నవగ్రహారాధన చేయుట శ్రేయస్కరం. ఎవరి దగ్గర నుండి ఏమి తీసుకోకుండా జాగ్రత్త పాటించాలి.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు

ఈ మాసమున అనుకూలత ఉంటుంది. కార్యముపట్ల శ్రద్ధతో పనిచేస్తే సాధించలేనిది ఉండదు. గజలక్ష్మీ దేవి అనుగ్రహం వలన సమస్యలు తొలగును. మానసిక బలం పెరుగుతుంది.

## కుంభరాశి

ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ రాశి వారికి కొంత అనుకూలత ఉంటుంది. బంధుమిత్రుల సహాయ సహకారము లభిస్తుంది. అనారోగ్య సమస్యలు కొంత ఇబ్బంది కలిగించవచ్చు. తండ్రి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం. అవసరాలకు ధనం సమకూరుతుంది. గజలక్ష్మి దేవి పూజలు చేయండి.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూలంగా ఉంటుంది. అధిక శ్రమ, నీరసం, తెలియని మానసిక ఒత్తిడి ఉండవచ్చు. భార్యకు నెలసరి సంబంధ అనారోగ్య సూచనలు ఉన్నాయి. ఆయుర్వేద చికిత్స వలన ఉపశమనం కలుగుతుంది. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజలు చేయాలి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా. లలితవాణి

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదిలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

**ఈ కింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి**

1. వ్యాస పూర్ణిమకు మరో పేరేమిటి?
2. హరినామ క్షేత్రానికి ఏకాంగి ఎవరు?
3. కుంతికి వరమిచ్చినదెవరు?
4. వ్యాసపూజ ఏ చెట్టు దగ్గర చేయాలి?
5. రావణుని గూఢచారి ఎవరు?
6. హరినామక్షేత్రం – శంకుస్థాపన ఎప్పుడు
7. క్షీరసాగర మథనంలో శ్రీహరి పాత్ర ఏమిటి?
8. వకుల పుష్పం అంటే ఏమిటి?
9. శ్రీవారి బంగారు విమానం అంటే ఏమిటి?
10. శ్రీవారి కొండ మీద బ్రహ్మజ్ఞానం పొందిందెవరు?
11. గరుత్మంతుని తల్లి ఎవరు?
12. ఆత్మ నివేదనకి ప్రతీక ఎవరు?
13. జగన్నాథుని రథం పేరేమిటి?
14. వైష్ణవులు గరుడ వాహనాన్ని ఏమంటారు?
15. మృగమదమంటే ఏమిటి?

1 ______
2 ______
3 ______
4 ______
5 ______
6 ______
7 ______
8 ______
9 ______
10 ______
11 ______
12 ______
13 ______
14 ______
15 ______

పేరు: ______

చిరునామా: ______

______

______

పిన్‌కోడ్: ______ ఫోన్: ______


## శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. కుబ్జగా
2. 7 ఎకరాలు
3. చంద్రుడు
4. నందిగ్రామంలో
5. లలిత
6. అత్తిలి
7. జయదేవుడు
8. శివుడు
9. మేధావి
10. తానీషా
11. 17
12. సరస్వతీ నదికి
13. యమునా నదీ తీరంలో
14. సనత్కుమారుడు
15. వామదేవ మహర్షి

## సరైన సమాధానాలు రాసినవారు

1. చింతలపాటి శివశంకర శాస్త్రి
2. పి.యశోద
3. చిల్లర సీతారామారావు
4. కరుణశ్రీ

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**పి.యశోద**


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy,** Cell: **93482 12354.** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com








RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.






**If Un Delivered Please Return to:**
**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq